www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

'వేర్పాటు'పై వేడెక్కిన పార్లమెంటు


డీకే సురేశ్

- దక్షిణాదిని ప్రత్యేక దేశం చేయాలన్న కాంగ్రెస్ ఎంపీ వ్యాఖ్యలపై రగడ
- డీకే సురేశ్, కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని రాజ్యసభలో బీజేపీ డిమాండ్
- విభజన కోరే వ్యక్తి ఏ పార్టీ వాడైనా సహించబోమన్న మల్లికార్జున ఖర్గే
- తమ ఎంపీ వ్యాఖ్యలను వక్రీకరించారని కాంగ్రెస్ అధ్యక్షుడి వివరణ
- లోక్‌సభనూ కుదిపేసిన వివాదం..కాంగ్రెస్, డీఎంకే వాకౌట్ 2
- మోదీ సర్కారుపై దక్షిణాదిన అపోహలెక్కువ: కేంద్ర మంత్రి నిర్మల

శనివారం | 3-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 289 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి సా. 5.22 తదుపరి నవమి; నక్షత్రం: విశాఖ పూర్తి; వర్జ్యం: ఉ. 11.53-1.35; దుర్ముహూర్తం: ఉ. 6.51-8.21; అమృతఘడియలు: రా. 10.03-11.44; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 6.08 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వాళ్లు..

- పచ్చని చెట్లు కొట్టేసేందుకు 'సిద్ధం'!
- పంట కాల్వలు పూడ్చేందుకూ 'సిద్ధం'!
- జాతీయ రహదారిని తవ్వేసేందుకు 'సిద్ధం'!
- పిల్లల చదువులు చెడగొట్టేందుకూ 'సిద్ధం'!
- అన్ని విలువలూ వదిలేసి, బరితెగించి మరీ జనాన్ని నానా బాధలు పెట్టేందుకు 'సిద్ధం'!


చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై పోలీసులు దగ్గరుండి డివైడర్‌ను తొలగింపజేస్తున్న దృశ్యం

సిగ్గు విడిచి సిద్ధం!

జగన్ ఎన్నికల ప్రచార సభ కోసం విధ్వంసం

- నేడు దెందులూరులో బహిరంగ సభ
- జాతీయ రహదారి 50 మీటర్ల మేర తవ్వకం
- ఎక్స్‌కవేటర్‌తో డివైడర్ తొలగింపు
- ఇప్పటికే ఏలూరులో పచ్చని చెట్లపై వేటు
- 800 మీటర్ల మేర పంటకాలువ పూడ్చివేత
- 1600 ఆర్టీసీ బస్సులు.. స్కూళ్లు, కాలేజీల వాహనాలూ.. విద్యా సంస్థలకు 'సెలవు'
- నేటి ఇంటర్ పర్యావరణ పరీక్ష వాయిదా
- కనీవినీ ఎరుగని రీతిలో బరితెగింపు

పంట కాలువను పూడ్చేసి.. జాతీయ రహదారిపై డివైడర్‌ను సైతం ధ్వంసం చేసి 'యుద్ధప్రాతిపదికన' ఏర్పాట్లు చేస్తున్నారు! విద్యా సంస్థలకు అనధికారికంగా సెలవులు ప్రకటించి.. ఇంటర్ పరీక్షను కూడా వాయిదా వేసేశారు! ఇంత హఠాత్తుగా రాష్ట్రంలో ఏ విపత్తు వచ్చిందోనని భయపడిపోకండి! ఇదంతా ముఖ్యమంత్రి జగన్ 'సిద్ధం' సభ కోసమే!

చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై సుమారు 50 మీటర్ల మేర డివైడర్‌ను ధ్వంసం చేశారు. సభ లోపలకు వెళ్లేందుకు దారి కోసం పొలాలకు నీళ్లందించే పంట కాలువను సుమారు 800 మీటర్ల మేర పూడ్చేశారు. ఇదీ... 'సిద్ధం' సభ కోసమే!

(ఏలూరు/కాకినాడ - ఆంధ్రజ్యోతి)

అన్నింటికీ బరి తెగించారు! ప్రజలేమనుకుంటారనే ఇంగితాన్నీ మరిచారు! 'సిద్ధం' అంటూ వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార సభల నిర్వహణ కోసం సర్వం భ్రష్టు పట్టిస్తున్నారు. గత వారం విశాఖ సమీపంలో ఉత్తరాంధ్ర జిల్లాల సభ జరిగిన సంగతి తెలిసిందే. ఈ శనివారం ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం పొలగూడెం

మిగతా 2వ పేజీలో...

ఎడాపెడా 'సిద్ధం'

- రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు దేన్నీ వదలని వైసీపీ నేతలు
- అసౌకర్యానికి గురవుతున్న ప్రయాణికులు

'షో' కోసం స్క్రీన్‌ప్లే!

- జనం బాగా కనిపించేలా వ్యూహం.. ప్రాంగణం 70 ఎకరాలు
- అందులో 10-15 ఎకరాల్లోనే జనం ఉండేలా చుట్టూ ఫ్లెక్సీలు
- 30 వేల మందే పడతారని, ట్రాఫిక్ జామ్ అవుతుందన్న పోలీసులు
- 'మాకు కావాల్సింది అదే' అన్న వైసీపీ నేతలు 2

జగనన్నా.. నీకు బాధ్యత లేదా?

తల్లినీ, చెల్లెళ్లనూ తిడుతున్నా చేతులు దులుపుకొంటావా?

- కాలకేయుల సైన్యంలా సోషల్ మీడియా
- షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదనీ పోస్టులు!
- చేసిన వాళ్లకంటే.. చేయించినవాళ్లే ముఖ్యం
- ఎవరు చేయిస్తున్నారో గుర్తించాలి కదా?
- ఆమె కులం, పెళ్లి ఇప్పుడే గుర్తుకొచ్చాయా?
- పాదయాత్ర చేసినప్పుడు తెలియదా?
- అమ్మ, అక్క, చెల్లీ అంటావే.. మాపై దాడి గురించి మాట్లాడవేం!?
- వివేకా కుమార్తె సునీత ఆవేదన, ఆక్రోశం



(కడప - ఆంధ్రజ్యోతి)

వైసీపీ సోషల్ మీడియా 'కాలకేయుల సైన్యం'లా మారిందని వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డి ఆగ్రహించారు. చెల్లెళ్లనూ, తల్లినీ నిందించేలా పోస్టులు పెడుతుంటే సీఎం జగన్మోహన్ రెడ్డి ఏం చేస్తున్నారు, ఆయనకు

మిగతా 11వ పేజీలో...

నీకూ మీ నాన్న గతే!

- సోషల్ మీడియాలో బెదిరిస్తున్నారు
- షర్మిల, విజయమ్మనూ వదలరట
- హైదరాబాద్‌లో సునీతా రెడ్డి ఫిర్యాదు



శుక్రవారం ఢిల్లీలో ధర్నా చేస్తున్న షర్మిల, కాంగ్రెస్ నేతలు

ఏపీలో బీజేపీ రాజ్యం

ఒక్క సీటూ ఆ పార్టీకి ఇవ్వని ఆంధ్రులు

- కానీ, బీజేపీకి రాష్ట్రాన్ని బానిసను చేశారు
- రాష్ట్రాన్ని మోదీ హీనంగా చూస్తున్నారు
- హోదాపై ప్రశ్నించని 25మంది ఎంపీలు
- ఐదేళ్లు కాదు.. పదేళ్లు హోదా అన్న మోదీ
- జోన్, స్టీల్ ప్లాంట్, పోర్ట్స్, ప్యాకేజీ ఇవ్వలేదేం?
- షర్మిల ధ్వజం.. ఢిల్లీలో హోదాపై ధర్నా 11

కబ్జాల 'రాజ్'

విశాఖ శివారులో ఎమ్మెల్యే అవినీతి దందా

విశాఖ నగర శివారున ఉన్న రూరల్ నియోజకవర్గమది. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాజకీయ భవిష్యత్‌పై గాక అక్రమార్జనపై దృష్టి పెట్టారు. ఎమ్మెల్యే అండతో కుటుంబీకులతో పాటు బంధువులు, అనుచరులు గద్దల్లా వాలిపోయారు. ప్రభుత్వ భూములు, చెరువులు, బందలు ఆక్రమించేశారు. సాగునీటి వనరులను ధ్వంసం చేసి మరీ అక్రమార్జనకు పాల్పడ్డారు.

- ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణ
- కుటుంబీకుల గుప్పిట్లో కొండ పోరంబోకు
- ఆరు ఎకరాల్లో 'ఆక్వా' కోసం నిర్మాణాలు
- చెరువు భూముల్లో బంధువులకు పట్టాలు
- అనుచరుల అక్రమాలకూ ఎమ్మెల్యే దన్ను
- నియోజకవర్గంలో సాగునీటి వనరుల ధ్వంసం
- ఆరు ఎకరాల బందను పూడ్చి లే అవుట్
- 10 ఎకరాల ఏపీఐఐసీ భూములూ స్వాధీనం
- తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి విక్రయం
- సెటిల్మెంట్లు, పోస్టింగ్‌లు.. అన్నింటా వాటా



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చిన్నవయసులోనే రాజకీయాల్లో ఎదిగారు. పాతికేళ్లు రాకముందే పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలో యూత్ కాంగ్రెస్ నాయకుడిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసే

మిగతా 3వ పేజీలో..

అమ్మో ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కుటుంబీకులు 6 ఎకరాల కొండ పోరంబోకు ఆక్రమించి ఆక్వా వ్యాపారం కోసం నిర్మాణాలు చేపట్టారు. ఇక బంధువులు చెరువు భూముల్లో పట్టాలు తీసుకుని, అమ్ముకుని క్యాష్ చేసుకున్నారు. ఎమ్మెల్యే అండతో అనుచరులైతే బందలు పూడ్చి, ప్రభుత్వ భూములు ఆక్రమించి లేఅవుట్లు వేసి సొమ్ము చేసుకున్నారు. ఇక భూముల సెటిల్మెంట్లూ మామూలే. ఇంకా మట్టి తవ్వకాలు, బదిలీలు, పోస్టింగ్‌లు.. ఇలా అన్నింటిలో ఎమ్మెల్యేకు వాటాలు ఇవ్వాల్సిందే.


హైదరాబాద్‌కు చేరుకున్న ఝార్ఖండ్ ఎమ్మెల్యేలు


చంపయీ సొరెన్ ప్రమాణం

'ఝార్ఖండ్ క్యాంపు' తెలంగాణలో!

- రెండు విమానాల్లో బేగంపేట ఎయిర్‌పోర్టుకు
- 39 మంది జేఎంఎం కూటమి ఎమ్మెల్యేల రాక
- షామీర్‌పేట్‌లోని రిసార్టులో 3 రోజులు మకాం
- పార్టీ నేతలకు ఎమ్మెల్యేల బాధ్యతల అప్పగింత
- పర్యవేక్షించిన దీపాదాస్, పొన్నం, సంపత్ 2

ఝార్ఖండ్ సీఎంగా చంపయీ ప్రమాణం

- అసెంబ్లీలో ఎల్లుండి విశ్వాసపరీక్ష
- హైకోర్టుకు వెళ్లండి..
- సుప్రీంలో హేమంత్‌కు ఎదురుదెబ్బ

మనోళ్లకు అమెరికా సురక్షితమేనా?

- నెలలో ఆరుగురు, వారంలో ముగ్గురు దుర్మరణం
- ఐదేళ్లలో విదేశాల్లో 403మంది మృత్యువాత
- కెనడాలో అత్యధికంగా 91, అమెరికాలో 36
- లోక్‌సభలో ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- విద్యార్థుల భద్రతకే తొలి ప్రాధాన్యం: జైశంకర్
- ఒహియోలో మరో భారతీయ విద్యార్థి మృతి 2
- అనుమానాస్పద స్థితిలో శ్రేయాస్‌రెడ్డి మరణం



తికమక.. మకతిక!

పలు మార్పులతో వైసీపీ ఆరో జాబితా

- నారాయణస్వామి మళ్లీ జి.నెల్లూరుకు
- చిత్తూరు లోక్‌సభ అభ్యర్థిగా రెడ్డెప్ప
- ఎమ్మిగనూరులోనూ అభ్యర్థి మార్పు
- వెంకటేశ్ స్థానంలో బుట్టా రేణుక
- మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు నాగార్జునరెడ్డి, రాంబాబు అటూఇటూ
- రాజమండ్రి, నరసాపురం ఎంపీ అభ్యర్థులుగా జి.శ్రీనివాస్, ఉమాబాల
- ఉమ్మారెడ్డి కుమారుడికి గుంటూరు లోక్‌సభ

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గందరగోళపడుతున్నట్లు కనిపిస్తోంది. సర్వేల పేరిట సిటింగ్‌లకు మొండిచేయి చూపి గెలుపుగుర్రాలంటూ కొత్త ఇన్‌చార్జులను నియమించిన ఆయన.. ఒత్తిళ్ల కారణంగా వారినీ మార్చేస్తున్నారు. శుక్రవారం నాలుగు లోక్‌సభ, ఆరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేస్తూ ఆరో జాబితాను విడుదల చేశారు. చిత్తూరు

మిగతా 11వ పేజీలో...

- జగన్‌కు వసంత షాక్!
- వైసీపీకి కృష్ణప్రసాద్ గుడ్‌బై
- మైలవరానికి ఇన్‌చార్జిగా తిరుపతిరావు
- అవనిగడ్డ ఇన్‌చార్జి ఫోన్ స్విచాఫ్

కడపకు మాధవి..!

ఉమ్మడి జిల్లాలో 6 అసెంబ్లీ సీట్లకు టీడీపీ అభ్యర్థులు ఖరారు

- పులివెందులలో బీటెక్ రవి
- జమ్మలమడుగుకు భూపేశ్‌రెడ్డి
- బద్వేలు-రోశన్న.. మైదుకూరు-పుట్టా
- కమలాపురం పుత్తా కుటుంబీకులకే
- మిగతా 4 స్థానాలపై ఇంకా కసరత్తు

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని పది అసెంబ్లీ సీట్లలో ఆరింటికి టీడీపీ తన అభ్యర్థులను ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరో

మిగతా 11వ పేజీలో...

జీతాలు సరిపోక..

గంజాయి స్మగ్లర్లుగా మారిన ఇద్దరు ఏపీ పోలీసులు

- సిక్ లీవ్ పెట్టి ఏపీ నుంచి హైదరాబాద్‌కు సరఫరా
- తెలంగాణలో అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు 11

కొత్తగా 4,000 కోట్ల అప్పు

2023-24లో ఆర్బీఐ నుంచి ఇదే అత్యధికం

అప్పుదియుల పెండింగ్ బిల్లులు కోసమేనా? 12

తమిళగ వెట్రి కళగం



- హీరో విజయ్ కొత్త పార్టీ
- పార్లమెంటు ఎన్నికలకు దూరం.. అసెంబ్లీ లక్ష్యం
- 2026లో అధికారం తమదేనని ధీమా 2

మహిళలూ జరభద్రం

దేశంలో నానాటికీ పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ ముప్పు



- భారత్‌లో ఏటా 80 వేల కేసులు, 35వేల మరణాలు
- సర్వైకల్ క్యాన్సర్ కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు
- సెప్టెంబరు నుంచి వ్యాక్సినేషన్‌కు సన్నాహాలు
- టీకాలు, పరీక్షలతో చాలావరకూ తగ్గే ముప్పు
- రేపు ప్రపంచ క్యాన్సర్ దినం

భారత్‌లో ఏటా దాదాపు 80 వేల మంది గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారు. 35 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా 1% మంది మహిళలు మాత్రమే గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో సర్వైకల్ క్యాన్సర్ నివారణ కోసం 9-14 ఏళ్ల బాలికలకు టీకా ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నట్టు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. ఆ మర్నాడే ప్రముఖ మోడల్, నటి పూనమ్ పాండే గర్భాశయ క్యాన్సర్‌తో మృతిచెందారు. దీంతో సర్వైకల్ క్యాన్సర్‌పై చర్చ మొదలైంది. అసలు గర్భాశయ క్యాన్సర్ అంటే ఏమిటి..? ఎలా సంక్రమిస్తుంది..? లక్షణాలేమిటి..? నివారణకు మార్గాలున్నాయా? ప్రభుత్వం ఏం చేస్తోంది..? సవివర కథనం..12లో



భారత్‌లో విజృంభణ

- 2022లో 14 లక్షల కేసులు.. 9 లక్షల మరణాలు
- స్త్రీలలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు అధికం
- పురుషుల్లో నోటి, లంగ్ క్యాన్సర్లు: డబ్ల్యూహెచ్‌వో
- నిరుడు 3.4 లక్షల సర్వైకల్ కేసులు: కేంద్రం

పూనమ్ పాండే మృతి

32 ఏళ్లకే బలి తీసుకున్న గర్భాశయ కేన్సర్ 12

ఒక్క నెలలోనే ఆరుగురు

అమెరికాలో ఆందోళనకరంగా భారతీయ విద్యార్థుల మరణాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: అమెరికాలో గడిచిన వారం రోజుల్లో ముగ్గురు భారతీయ విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. జనవరి ప్రారంభం నుంచి చూస్తే ఆరుగురు చనిపోయారు. వీరిలో ఇద్దరు అనుమానాస్పద స్థితిలో మరణించగా, డ్రగ్స్‌కు బానిసైన ఓ వ్యక్తి హరియాణాకు చెందిన మరో విద్యార్థిని దారుణంగా సుత్తితో కొట్టి హత్య చేశారు. మరొకరు హైపోథెర్మియాతో చనియాడు. ఇద్దరు తెలుగు విద్యార్థులు జనవరి 15న అనుమానాస్పద స్థితిలోనే మరణించగా.. వారి మరణానికి ఇంట్లోని గ్యాస్ లీకేజీనే కారణం అని తర్వాత తేలింది. ఈ వరుస మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

1 ఇండియానా రాష్ట్రంలోని పర్డ్యూ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ చదువుతున్న నీల్ ఆచార్య శవమై కనిపించాడు. గత నెల 28న ఆచార్య అదృశ్యమైనట్లు అతని తల్లి గౌరీ ఆచార్య ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే వర్సిటీ క్యాంపస్‌లో అతడి మృతదేహం లభ్యమైంది.

1జనవరి 16న జార్జియాలో జులియన్ ఫాల్క్‌నర్(25) అనే వ్యక్తి హరియాణాకు చెందిన ఎంబీఏ విద్యార్థి వివేక్ సైనీ(25)ని 50సార్లు సుత్తితో కొట్టి చంపాడు.

1మరో భారతీయ విద్యార్థి అకుల్ ధావన్(18) జనవరి మొదట్లో యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయీ అర్బానా-షాంపెయిన్ వెలుపల శవమై కనిపించాడు. శవపరీక్షలో అతను హైపోథెర్మియాతో మరణించినట్లు గుర్తించారు.

1జనవరి 15న కనెక్టికట్ వసతి గృహంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నికేశ్ (21), తెలంగాణలో వనపర్తికి చెందిన దినేశ్ (22) ఉన్నత చదువుల కోసం అంతకుముందు నెల రోజుల క్రితమే అమెరికా వెళ్లారు. వారి మరణానికి గల కారణమేంటో ఇప్పటికీ తెలియరాలేదు.

2018 నుంచి 36 మంది: కేంద్రం

2018 నుంచి ఇప్పటి వరకూ విదేశాల్లో చదువుతున్న 403 మంది భారతీయ విద్యార్థులు వేర్వేరు కారణాలతో మరణించినట్లు లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. కెనడాలో అత్యధికంగా 91మంది మరణించారు. ఆ తర్వాత బ్రిటన్‌లో 48మంది, రష్యాలో 40మంది, అమెరికాలో 36మంది, ఆస్ట్రేలియాలో 35 మంది, ఉక్రెయిన్‌లో 21 మంది, జర్మనీలో 20 మంది మృతిచెందినట్లు వివరించింది. వీటిలో సాధారణ మరణాలతో పాటు ప్రమాదాలు, వైద్య సంబంధిత కారణాలు తదితరాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. విదేశాల్లో చదువుతున్న భారత విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఓ ప్రశ్నకు సమాధానంగా విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. కాగా, అమెరికాలో భారతీయ విద్యార్థులు తమ భద్రతపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని ఆ దేశానికే చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సర్వేలో వెల్లడైంది. ఈ కారణంగా విద్యార్థులు ఇతర దేశాలకు తరలిపోయే ప్రమాదముందని ఐఐఈ హెచ్చరించింది. యువ భారతీయ-అమెరికన్లు జాతి వివక్షను ఎదుర్కొంటున్నారని మరో సర్వే తెలిపింది.

ఒహియోలో మరో భారతీయ విద్యార్థి మృతి



ఒహియో రాష్ట్రం సిన్సినాటిలోని లిండర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థి శ్రేయాస్ రెడ్డి బెనిగేరి(19) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శ్రేయాస్ మరణానికి దారితీసిన పరిస్థితులపై ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని, ఇందులో తమకు ఎలాంటి అనుమానాలు లేవని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ధ్రువీకరించారు. శ్రేయాస్‌రెడ్డి మృతిపట్ల కాన్సులేట్ సంతాపం వ్యక్తం చేసింది.

చంపయీ సోరెన్ ప్రమాణం

» 5న అసెంబ్లీలో విశ్వాస పరీక్ష



రాంచీ, ఫిబ్రవరి 2: ఝార్ఖండ్ సీఎంగా చంపయీ సోరెన్ శుక్రవారం ప్రమాణం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణం చేయించారు. కాంగ్రెస్‌కు చెందిన ఆలంగిర్ ఆలమ్, ఆర్జేడీ నేత సత్యానంద్ మంత్రులుగా ప్రమాణం చేశారు. హేమంత్ సోరెన్ ప్రారంభించిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని, ఆదివాసీల కోసం జల్, జంగల్, జమీన్ (నీళ్లు, అడవి, భూమి) పోరాటాన్ని కొనసాగిస్తామని కొత్త సీఎం ఆ తర్వాత చెప్పారు. అనంతరం తొలి కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 5న విశ్వాసపరీక్షను ఎదుర్కోవాలని నిర్ణయించారు.

మేం జోక్యం చేసుకోం: సుప్రీంకోర్టు

హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు తనను కుట్రపూరితంగా అరెస్టు చేశారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తన ప్రభుత్వాన్ని కూల్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారని.. తన అరెస్టును చట్టవిరుద్ధమైన చర్యగా ప్రకటించాలని హేమంత్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, తాము ఈ అంశంలో జోక్యం చేసుకోబోమని, రాష్ట్ర హైకోర్టుకే వెళ్లాలని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, రాంచీలోని మనీలాండరింగ్ నిరోధక ప్రత్యేక కోర్టు శుక్రవారం హేమంత్‌ను ఐదు రోజులపాటు ఈడీ కస్టడీకి అప్పగించింది.

'ఝార్ఖండ్ క్యాంపు' తెలంగాణలో!

హైదరాబాద్/ శామీర్‌పేట/ మేడ్చల్ టౌన్/ బేగంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాజకీయం తెలంగాణకు చేరింది. చంపయీ సోరేన్ ప్రభుత్వం సోమవారం విశ్వాస పరీక్షను ఎదుర్కోనున్న నేపథ్యంలో, ఎమ్మెల్యేలెవరూ చేజారకుండా 39 మంది జేఎంఎం కూటమి ఎమ్మెల్యేలను రెండు ప్రత్యేక విమానాల్లో శుక్రవారం హైదరాబాద్‌కు తరలించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి వారిని రెండు ప్రైవేటు బస్సుల్లో అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య శామీర్‌పేట లియోనియో రిసార్టుకు తీసుకెళ్లారు.

వచ్చేవారం నుంచి రూ.29కే కిలో బియ్యం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సామాన్యులకు కేంద్రం శుభవార్త చెప్పింది. భారత్ రైస్ పేరుతో రూ.29కే కిలో బియ్యం విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. దేశవ్యాప్తంగా వచ్చే వారం నుంచి అమ్మకాలు ప్రారంభమవుతాయని కేంద్ర ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా శుక్రవారం మీడియాకు వెల్లడించారు.

పార్లమెంటులో వేర్పాటు సెగ

దక్షిణాదిని ప్రత్యేక దేశం చేయాలన్న కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ వ్యాఖ్యలపై తీవ్ర రగడ

» క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్

» విచ్ఛిన్న మనఃస్థితికి నిదర్శనం: గోయల్

» విభజన కోరే వ్యక్తి ఏ పార్టీ వాడైనా సహించబోమన్న ఖర్గే



డీకే సురేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 : దక్షిణ భారతదేశాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలంటూ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలు శుక్రవారం పార్లమెంటును కుదిపేశాయి. కాంగ్రెస్ పార్టీ, సోనియాగాంధీ తక్షణం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అధికార బీజేపీ, ఎన్డీయే సభ్యులు ఉభయ సభల్లో డిమాండ్ చేశారు. దీనిపై రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఒక ప్రకటన చేశారు. దేశాన్ని విభజించాలని ఎవరు కోరినా, వారు ఏ పార్టీకి చెందిన వారైనా సహించేది లేదని స్పష్టం చేశారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశమంతా ఒక్కటిగానే ఉండి తీరుతుందని తెలిపారు. అయినా, రాజ్యసభలో పరిస్థితి సద్దుమణగలేదు. తనకు ఉన్న విచ్ఛిన్న స్వభావాన్ని కాంగ్రెస్ మరోసారి బయటపెట్టుకున్నదని రాజ్యసభలో కేంద్రమంత్రి గోయల్ ఆగ్రహించారు. సురేశ్ వ్యాఖ్యలను సభ తేలిగ్గా తీసుకోరాదని డిమాండ్ చేశారు. అయితే, రాజ్యసభ సభ్యుడు కాని సురేశ్‌పై ఇక్కడ చర్చించలేమని ఖర్గే అనగా.. దీనిపై లోక్‌సభలోనే చర్చ జరపాలన్న తన ఆదేశాన్ని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ గుర్తుచేశారు. మీడియాలో వచ్చినట్టు తాను మాట్లాడలేదని సురేశ్ టీవీల ఎదుటే ప్రకటించారని, ఆయన ఏమైనా మాట్లాడి ఉంటే స్పందించడానికి సభా హక్కుల సంఘం ఉందని ఖర్గే అన్నారు. సురేశ్ అనని మాటలను పదే పదే సభలో ప్రస్తావించడం సరికాదన్నారు. ఈ సమయంలో కన్నడలో సురేశ్ చేసిన వ్యాఖ్యల ఇంగ్లిష్ అనువాదాన్ని పీయూష్ చదివి వినిపించారు. డీకే సురేశ్ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు, ఎంపీ. గురువారం కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయన స్పందించారు. "పన్నుల ఆదాయంలోంచి తమ వాటాను దక్షిణాది రాష్ట్రాలు పొందలేకపోతున్నాయి. ఇక్కడ వసూలు చేసిన పన్నుల సంపద అంతా ఉత్తరాదిలోనే పంపిణీ అవుతోంది. ఈ అన్యాయాన్ని సరిదిద్దకపోతే.. దక్షిణాది రాష్ట్రాలు ప్రత్యేక దేశంగా వేర్పడక తప్పని పరిస్థితి నెలకుంటుంది" అని సురేశ్ అన్నారు. కాగా, లోక్‌సభను కూడా ఈ అంశం కుదిపేసింది. అధికార బీజేపీ, ఎన్డీయే సభ్యులు.. కాంగ్రెస్, సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై వారికి, కాంగ్రెస్, డీఎంకే సభ్యులకు మధ్య వాగ్వాదం నడిచింది. చివరకు ఇండియా కూటమిలోని ఆ రెండు పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి. శుక్రవారం సభలో జీరో అవర్‌లో ఈ అంశాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి లేవనెత్తారు.

దక్షిణాదిన మాపై అపోహలెక్కువ!



మోదీ ప్రభుత్వ పనితీరుపై దక్షిణ భారతంలో నిజాల కంటే అపోహలే ఎక్కువగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆమె శుక్రవారం ఓ ఆంగ్ల చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దక్షిణాదిన బీజేపీ పెద్దగా ఎదగకపోవడంపై అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ పలు అంశాలు ప్రస్తావించారు. దక్షిణాదిన ఇప్పటికే అభివృద్ధి ప్రేరక జీవావరణ వ్యవస్థ నెలకొని ఉందని.. దీని నిర్మాణంలో కేంద్ర రాష్ట్రాలు కీలక పాత్ర పోషించాయన్నారు. 'విద్య, నైపుణ్యం, ఉపాధి అవకాశాలు అక్కడ(దక్షిణాదిలో) ఉన్నాయి. విదేశాలకు వలస వెళ్లేవారి సంఖ్య కూడా ఆ ప్రాంతంలో చాలా ఎక్కువ. ప్రైవేటు పెట్టుబడులు అత్యధికం. మానవ వనరుల పాత్ర కూడా చాలా ఉంది. ఇందువల్లే దక్షిణాదిన ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జీడీపీలో వారి వాటా కూడా అధికంగా ఉంది' అని తెలిపారు. ఆ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఆర్థిక సహకారం అందిస్తామని నిర్మల హామీ ఇచ్చారు.



తమిళ హీరో విజయ్ కొత్త పార్టీ

» పార్టీ పేరు 'తమిళగ వెట్రి కళగం'



చెన్నై, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తమిళనాట సినీరంగ నేపథ్యమున్న మరో రాజకీయ పార్టీకి బీజం పడింది. ఎంతోకాలంగా అదిగో ఇదిగో అంటూ ఊరిస్తున్న ప్రముఖ యువ హీరో విజయ్.. రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. తమిళగ వెట్రి కళగం(తమిళనాడు విజయం పార్టీ) పేరుతో పార్టీ ప్రారంభిస్తున్నానని తెలిపారు. అయితే, తన పార్టీ 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనే తలపడుతుందని, ఆ ఎన్నికలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికలకు దూరంగా ఉంటామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. తన అభిమానుల సంఘాలు 'విజయ్ మక్కల్ ఇయక్కం'(విజయ్ ప్రజా సంస్థ) పేరుతో కొన్నేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను స్వచ్ఛందంగా చేపడుతున్నారని తెలిపారు. అయితే, సామాజిక, ఆర్థికపరమైన రాజకీయ సంస్కరణలు తెచ్చేందుకు స్వచ్ఛంద సంస్థకు సాధ్యం కాదన్నారు. అందుకే తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘంలో పార్టీ పేరు నమోదు చేయించనున్నట్టు తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఏ కూటమికీ మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని చెప్పారు. 2026లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా పోటీ చేసి అధికారంలోకి వస్తుందని విజయ్ ధీమా వ్యక్తం చేశారు. "పారదర్శకమైన జాతి, మత బేధాలకు తావులేని, అవినీతి రహిత సమాజ స్థాపన కోసం, రాజకీయ మార్పు కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. ఆ లోటును తీర్చేందుకే రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నాం" అని విజయ్ పేర్కొన్నారు. విజయ్ రాజకీయాల్లోకి రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు.

సిగ్గు విడిచి 'సిద్ధం'!



విజయవాడ రైల్వే స్టేషన్ 1వ నెంబర్ ప్లాట్ ఫాంపై సిద్ధం డిజిటల్ ప్రచారం

ఎడా పెడా 'సిద్ధం'

రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు దేన్నీ వదలని వైసీపీ నేతలు

» ఎటు చూసినా పోస్టర్లు, బ్యానర్లే

» పార్టీ ప్రచారానికి ప్రజల సొమ్ముపై విస్మయం

విజయవాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ 'సిద్ధం' పేరుతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. విశాఖపట్నంలోని భీమిలిలో తొలి సభను నిర్వహించగా.. శనివారం ఏలూరు జిల్లాలో మలి సభకు ఏర్పాట్లు చేశారు. అయితే.. ఈ సిద్ధం సభకు సంబంధించి జిల్లాలు దాటి మరీ ప్రచారం చేస్తుండడం గమనార్హం. రైల్వే స్టేషన్, బస్టాండ్ సహా కీలక ప్రాంతాల్లో ఎటు చూసినా బ్యానర్లు, పోస్టర్లు, డిజిటల్ చిత్రాలు దర్శనమిచ్చాయి. అత్యంత రద్దీగా ఉండే విజయవాడ బస్టాండ్, రైల్వే స్టేషన్లలో అయితే అడుగడుగునా వీటిని ఏర్పాటు చేశారు. సీఎం జగన్ ముఖచిత్రంతో 'సిద్ధం' పేరుతో ఏర్పాటు చేసిన ఈ ప్రచార చిత్రాలు చూసి ప్రయాణికులు విస్తుబోతున్నారు. సహజంగా రైల్వేస్టేషన్లు, బస్టాండ్లకు వచ్చేవారు.. రైళ్లు, బస్సుల సమాచారం తెలుసుకునేందుకు బోర్డుల వంక చూస్తారు. కానీ, ఇప్పుడు ఎటు చూసినా ఆ సమాచారం ఎక్కడా కనిపించక పోగా, 'జగన్ సిద్ధం' బ్యానర్లు, పోస్టర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు 'ఇదేం ఖర్మ' అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో జాతీయ, రాష్ట్ర రహదారులను సైతం వైసీపీ నాయకులు వదిలి పెట్టలేదు. విజయవాడలోని ఎన్‌హెచ్-16, 65ల వెంబడి భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్‌లో ప్రకాశ్ ఆర్ట్స్, బస్‌స్టేషన్‌లో యూనీ యాడ్స్ ఏజెన్సీలు ఈ 'సిద్ధం' బ్యానర్లను ఏర్పాటు చేశాయి. ఈ రెండు సంస్థలు యాడ్ ఏజెన్సీలు కావటంతో.. ప్రభుత్వ సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్టు తెలుస్తోంది. ఒక పార్టీకి సంబంధించిన ప్రచార బ్యానర్లను ఇలా ప్రభుత్వ సొమ్ముతో భారీ సంఖ్యలో ఏర్పాటు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఏ ఖాతా నుంచి ఈ నిధులు చెల్లించి ఉంటారని రాజకీయ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది. 'సిద్ధం' సభ నిర్వహణ, లక్ష్యం పూర్తిగా పార్టీకి సంబంధించిన వ్యవహారం. దీనికి, ప్రభుత్వానికి సంబంధం లేదు. అయినా.. ముఖ్యమంత్రి ఫొటోతో భారీ ఎత్తున ప్రచారం చేస్తుండడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సిద్ధం బ్యానర్లలో ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే కనపడవచ్చు, అందులో పార్టీ పేరు లేకపోవచ్చు, కానీ పార్టీ రంగులు మాత్రం కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సొంత పార్టీ వ్యవహారాలకు సంబంధించిన బ్యానర్లకు, ప్రచారానికి ప్రజల సొమ్మును ఎలా ఖర్చు చేస్తారనేది సామాన్యుల ప్రశ్న. దీనికి వైసీపీ నాయకులు ఏం చెబుతారో చూడాలి.

(మొదటి పేజీ తరువాయి)

వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు ఏలూరు పట్టణంలో 'సిద్ధం' పోస్టర్లకు అడ్డుగా వస్తున్నాయంటూ పచ్చని చెట్లను కొట్టేశారు. సభా ప్రాంగణం వద్దకు వాహనాలు వెళ్లేందుకు అడ్డు ఉందంటూ... పంట కాల్వనూ పూడ్చేశారు. ఇప్పుడు మరింత తెగించి... ఏకంగా జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌నే తవ్వేశారు. సభా ప్రాంగణానికి దాదాపు అర కిలోమీటరు దూరంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడికి అధికారులు, నాయకుల వాహనాలు వెళ్లడంతో పాటు సభకు జనాలు చేరుకోవడానికి అడ్డుగా ఉందంటూ... శుక్రవారం చెన్నై-కోల్‌కతా 16వ నంబరు జాతీయ రహదారిపై డివైడర్లను పోలీసులే దగ్గరుండి ఎక్స్‌కవేటర్లతో పగులగొట్టించారు. సుమారు 50మీటర్ల మేర తొలగించి 'మార్గం సుగమం' చేశారు. రోడ్లు వేయడం ఎలాగూ చేతకాదు. కానీ... ఒక పక్క రాజకీయ సభకోసం హైవేనూ తవ్వేయడం ఏమిటి? అని జనం విస్తుపోతున్నారు.

800 మీటర్ల మేర కాల్వ పూడ్చి...

'సిద్ధం' సభా ప్రాంగణంలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో... వైసీపీ నేతలు పంట పొలాలకు నీళ్లందించే కాలువను ఏకంగా 800 మీటర్ల మేర పూర్తిగా పూడ్చేశారు. జాతీయ రహదారికి అనుకుని నిర్మించిన సైడ్ డ్రైన్ల మీదుగా ఉన్న కెనాల్‌పై పూడ్చేసిన ఆ మట్టి మార్గం గుండానే ప్రస్తుతం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.

బలవంతంగా బడి బస్సులు

జగన్ నిర్వహిస్తున్న 'సిద్ధం' సభకు జనాన్ని తరలించేందుకు పాఠశాలలు, కాలేజీల బస్సులను అధికార పార్టీ బలవంతంగా తీసుకుంటోంది. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల అంతటా ఈ పరిస్థితి నెలకొంది. ఇష్టం లేకపోయినా విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సులు అప్పగిస్తున్నాయి. దీంతో... శనివారం విద్యాసంస్థలు అనధికారికంగా సెలవు ప్రకటించేశాయి. 'ఈ రోజు బస్సులు రావు. మీరు ప్రత్యామ్నాయం చూసుకోండి' అంటూ తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపాయి. అంటే.. 'మీ పిల్లలు బడికి రాలేరు' అని చెప్పకనే చెప్పడమే. ఇక... కృష్ణా యూనివర్సిటీ అధికారులు 'సెలవు' ఇచ్చినట్లు చెప్పకుండా, 'ఆర్టీసీ బస్సులన్నీ సీఎం సభకు వెళ్తున్నాయి. విద్యార్థులు ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేసుకోవాలి' అంటూ అతి తెలివి ప్రదర్శించారు. ఇక విద్యాశాఖ అధికారులు ఎక్కడా లిఖిత పూర్వక ఆదేశాలు ఇవ్వకుండా, శనివారం సెలవు ఇచ్చి వచ్చే రెండో శనివారం బడులు నిర్వహించుకోవాలని మౌఖికంగా చెప్పినట్లు సమాచారం. ఇంటర్ విద్యార్థులకు శనివారం జరగాల్సిన 'పర్యావరణ' పరీక్ష వాయిదాకూ జగన్ సభే కారణమని తెలుస్తోంది. ఇటీవల విశాఖ జిల్లాలో జరిగిన మొదటి 'సిద్ధం' సభ, అంతకుముందు విజయవాడలో జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సమయంలోనూ విద్యాశాఖ ఇలాగే వ్యవహరించింది. .

ఆర్టీసీ బస్సులు... స్కూలు బస్సులు...

ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి దాదాపు 1600 ఆర్టీసీ బస్సులను వైసీపీ నాయకులు జనసమీకరణకు ఉపయోగించుకుంటున్నారు. ఒక్క ఏలూరు జిల్లా నుంచే సుమారు 80 ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు కళాశాలలు, స్కూళ్ల నుంచి మరో 600 బస్సులను కేటాయించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 125కి పైగా స్కూళ్లు, కాలేజీల నుంచి వందలాది బస్సులను వైసీపీ నేతలు బలవంతంగా లాక్కున్నారు. ఇక వైసీపీ తరఫున రవాణా అధికారులే స్వయంగా రంగంలోకి దిగారు. ప్రైవేటు టూరిస్టు బస్సులు, మినీ బస్సులను లాగేసుకున్నారు. వాటికి అద్దె చెల్లించబోమని కూడా చెప్పేశారు.



పాలగూడెం వద్ద సీఎం జగన్ సిద్ధం సభ కోసం పంట కాల్వను పూడ్చి ఏర్పాటు చేసిన బారికేడ్లు



ఏలూరు నగరం ప్రధాన రహదారిలో డివైడర్‌లో నరికేసిన చెట్లు

బస్సు జనానికి రూ.10 వేలు...

జగన్ సభకు మూడు జిల్లాల పరిధిలో నుంచి తరలిస్తున్న జనం సౌకర్యాల కోసం ప్రతి బస్సుకు రూ.10 వేల చొప్పున సంబంధిత ప్రజా ప్రతినిధులకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అందుబాటులో ఉన్న నేతలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వార్డు మెంబర్లు తదితరుల ద్వారా నగదుతో పాటు పార్టీ జెండాలను కూడా పంపిణీ చేసింది. సభ జరిగే చుట్టు పక్కల జిల్లాలలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కనీసం ఇరవై వేల మందినైనా తరలించాలంటూ ఎమ్మెల్యేలను ఆదేశించినట్లు తెలుస్తోంది.

ధీరుడూ... అర్జునుడట...

సభా ప్రాంగణంలో ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌తో పాటు మరికొందరిని కించపరిచే విధంగా కొన్ని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. 'గజదొంగల ముఠా నుంచి ప్రజల్ని కాపాడే ధీరుడు' అంటూ పిడికిలి ఎత్తి పోరాటం చేస్తున్న ప్రజల ముందు జగన్ నిలబడి ఉన్నట్లుగా ఫ్లెక్సీలో ఫొటోను ముద్రించారు. అలాగే 'అభిమన్యుడు కాదు, అర్జునుడు' అనే నినాదంతో మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

పరీక్ష వాయిదా సిగ్గుమాలిన చర్య: ఎస్ఎఫ్ఐ

సీఎం సభ కోసం ఇంటర్ విద్యార్థుల పర్యావరణ విద్య పరీక్షను వాయిదా వేయడం సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్ విమర్శించారు. జగన్ ఎక్కడ సభ పెడితే అక్కడ షాపులు మూయించడం, విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వడం ఆనవాయితీగా మారిందని ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. ఇప్పుడు ఇంటర్ విద్యామండలిని కూడా వైసీపీ రాజకీయంలోకి లాగారని విమర్శించారు.

'షో' కోసం స్క్రీన్ ప్లే!

» జనం భారీగా వచ్చినట్లు చూపే యత్నం

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి జగన్ 'సిద్ధం' సభకు జనం బారులు తీరారు. ఏర్పాట్లు చేసిన 70ఎకరాల ప్రాంగణం దాటి చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని ముంచెత్తారు. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది'.. శనివారం దెందులూరు నియోజకవర్గం పాలగూడెం వద్ద జరిగే బహిరంగ సభలో ఈ దృశ్యాలు ఆవిష్కృతమయ్యేలా అధికార పార్టీ నేతలు అద్భుతమైన ఎత్తుగడ వేశారు. రైతులు, స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఎన్ని ఇబ్బందులు పడినా సభను సక్సెస్ చేయడమే ముఖ్యం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ హంగామా చూసి ప్రజలు నివ్వెరపోతున్నారు. 'వాహనదారులు ఇబ్బంది పడతారు' అని పోలీసులు చెబితే.. 'అదే కదా మనకు కావాల్సింది' అంటూ వైసీపీ నేతలు తమ నైజాన్ని చూపించారు. దీంతో అవాక్కైన పోలీసులు 'మనకు ఇదేమి ఖర్మ' అంటూ తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జగన్ రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో 'సిద్ధం' పేరుతో నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో భాగంగా రెండో సభ దెందులూరు నియోజకవర్గంలో జరగబోతోంది. భీమిలిలో నిర్వహించిన మొదటి సభకు లక్షల్లో జనం వస్తారని అంచనా వేసిన వైసీపీ నేతలకు చేదు అనుభవం ఎదురైంది. పోలీసుల అంచనా ప్రకారం ఆ సభకు 80వేలకు మించి జనం రాలేదు. జగన్ సొంతమీడియా ఎక్కువమంది జనం వచ్చారని చూపించేందుకు నానా ప్రయాసలు పడింది. దీంతో దెందులూరు సభను సక్సెస్ చేయడానికి వైసీపీ నేతలు విఝున్‌రెడ్డి, తలసిల రఘురామ్ తదితరులు సభాస్థలాన్ని గురువారం పరిశీలించారు. మొత్తం 70ఎకరాల విస్తీర్ణంలో భారీ గ్రౌండ్ ఏర్పాటు చేసిన ఏలూరు జిల్లా నేతలను అభినందిస్తూనే మొత్తం సభా ప్రాంగణాన్ని 10-15 ఎకరాలకు కుదించాలని సూచించారు. ఆ పరిధి దాటి జనం బయటకు వెళ్లకుండా చుట్టూ ప్రహరీ తరహాలో ఫ్లెక్సీలు పెట్టించారు. తొక్కిసలాట జరిగే ప్రమాదముందని పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేసినా.. ససేమిరా అంటూ తాము చెప్పినట్లు చేయాల్సిందేనని వైసీపీ నేతలు పట్టుబట్టారు.

30 వేలమందికే ఏర్పాట్లు

జగన్ సభకు దాదాపు లక్ష మంది వరకూ వస్తారనే సమాచారం ఉందని పోలీసు అధికారులు వైసీపీ నేతలకు తెలిపారు. సభా ప్రాంగణంలో 30వేల మందికే ఏర్పాట్లు ఉన్నాయని వివరించారు. అయితే సభా ప్రాంగణం నిండటమే తమకు కావాలన్నట్టుగా వైసీపీ నేతలు చెప్పినట్టు తెలుస్తోంది. ప్రాంగణం నిండిపోయాక వచ్చే వాళ్లందరూ జాతీయ రహదారిపై ఆగిపోయేలా చూడాలంటూ పోలీసులకు సూచించారు. జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్ అయితే దూరప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు ఇబ్బందులు పడతారని పోలీసులు వివరించినా వైసీపీ నేతలు పట్టించుకోలేదు. 'జనం భారీగా రోడ్డుపై నిలబడాలి. కనీసం సగం మంది సభికులు రోడ్డుపై ఆగిపోవాలి. ఆ దృశ్యాల ఫొటోలు, విజువల్స్ టీవీల్లో చూపించి 'వామ్మో ఏమి జనం' అంటూ ఇతర ప్రాంతాల్లో ప్రజలు చర్చించుకోవాలి' అని ఎత్తుగడ వేసినట్టు తెలుస్తోంది. తమ యజమాని సభల్లో చిక్కగా జనం ఉండే ప్రాంతాన్ని ఫొటో తీసి 'సభకు హాజరైన జనసంద్రంలో ఒక భాగం' అంటూ ఫొటో వేసుకునే సీఎం పత్రిక ఫొటోగ్రాఫర్లు సైతం తమకు సూచనలు చేస్తున్నారని పోలీసులు వాపోతున్నారు. సభకు వచ్చే జనం 70ఎకరాల ప్రాంగణమంతా వెళితే డ్రోన్ ఫొటోలో పల్చగా కనిపిస్తారని, అటువెళ్లకుండా అడ్డుకోవాలని చెబుతున్నారంటున్నారు. జగన్ పాలనపై ప్రజల వ్యతిరేకత నుంచి బయట పడేందుకు వైసీపీ నాయకులు వేస్తున్న ఎత్తుగడలు పోలీసులకు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం ఇచ్చిన 01/2019 సర్క్యులర్‌ను రద్దు చేస్తే ఆందోళన బాట పట్టక తప్పదని ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య హెచ్చరించారు. శుక్రవారం ఈ మేరకు ఆర్టీసీ ఎండీకి లేఖను అందించారు.

కబ్జాల'రాజ్'

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం దక్కించుకున్నారు. మూడు పదులు దాటగానే ఎమ్మెల్యే పదవి దక్కింది. రాజకీయంగా మంచి భవిష్యత్ ఉన్నా దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యే కావడంతో కన్నూమిన్నూ కానలేదు. మంచీ చెడూ తేచలేదు. అనుచరులు ఏ పనిచేసినా అభ్యంతరం పెట్టలేదు. కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే సమర్థించుకున్నారు. ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఎక్కడ మట్టి తవ్వకాలు జరిగినా ఎమ్మెల్యేకు వాటా ఇవ్వాల్సిందేనంటారు. వివాదాస్పద భూముల సెటిల్మెంట్లు, అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లు.. ఇలా అన్నింటిలో వాటాలు సమర్పించుకోవాల్సిందే. చుట్టూ అవినీతిపరులను పెట్టుకుని ఎమ్మెల్యే అప్రతిష్ఠ పాలయ్యారని నియోజకవర్గం కోడై కూస్తోంది. మరోసారి టికెట్ దక్కించుకునేందుకు ప్రస్తుతం తాడేపల్లి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కొండ పోరంబోకు ఆక్రమణ

జిల్లాల విభజనలో ఆ నియోజకవర్గంలో ఒక మండలాన్ని మాత్రం విశాఖపట్నం జిల్లాలో ఉంచి, అత్యధిక ప్రాంతాలను పక్కనే కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలో కలిపేశారు. అయితే ఎమ్మెల్యే కుటుంబీకులు, అనుచరులు అక్కడా, ఇక్కడా అని చూడకుండా ఎక్కడ పడితే అక్కడ అక్రమాల్లో చెలరేగిపోయారు. ఎమ్మెల్యే కుటుంబానికి ఆక్వా వ్యాపారం ఉంది. దానికి సంబంధించిన పరికరాలు నిల్వ చేయడానికి, సిబ్బంది నివాసాల కోసం ఫార్మా సిటీ ప్రాంతంలో ప్రభుత్వ భూములను ఆక్రమించారు. ఆరు ఎకరాల కొండ పోరంబోకు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిని స్వాధీనం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా కూడా చేశారు. కానీ ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు. ఆ భూములు చాలాకాలంగా తమ స్వాధీనంలోనే ఉన్నాయని, ప్రభుత్వానికి ధర కట్టి తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రకటించారు. కానీ ఏదీ జరగలేదు. రూపాయి కూడా కట్టకుండానే ఆరు ఎకరాలు అనుభవిస్తున్నారు.

బందలు పూడ్చేసి లేఅవుట్లు

చెరువులు, బందలను పూడ్చేసి లేఅవుట్లు వేసే ముఠాలకు ఎమ్మెల్యే పూర్తి సాయం అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి సమీపంలో ఆరు ఎకరాల మేరీ బందను ఎమ్మెల్యే ప్రధాన అనుచరగణం చౌకగా కొనేసి, రాత్రికి రాత్రి దానిని పూడ్చేశారు. అధికారులు ప్రశ్నిస్తే వారిని బెదిరించారు. అలాగే బాపన కోనేరు, షైనం కోనేరు, బంజరు కోనేరు కలిపి సుమారు ఎనిమిది ఎకరాల బందల్ని చదును చేశారు. ఈ అక్రమాలపై సొంత పార్టీ నేతలే తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయితే చర్యలు తీసుకోకుండా ఎమ్మెల్యే అడ్డం పడ్డారు. చివరికి జిల్లా కలెక్టర్ జోక్యంతో లేఅవుట్ పనులు ఆగిపోయాయి. కాగా మేరీ బందలో ఎమ్మెల్యే అనుచరులు లేఅవుట్ వేసి అమ్మకానికి సిద్ధం చేశారు. సాగునీటి వనరులను ధ్వంసం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంఘాలు డిమాండ్ చేసినా ఎమ్మెల్యే ఒత్తిడి వల్ల అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు.



రికార్డులు తయారు చేసి..

సాగునీటి వనరులు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నవాటిని చెరువులు, తక్కువ విస్తీర్ణంలో ఉన్నవాటిని బందలు అని అంటారు. ఇవి సాధారణంగా ప్రభుత్వ భూముల్లో ఉంటాయి. కొన్ని ప్రైవేటు భూముల్లో కూడా ఉంటాయి. పూర్వం భూస్వాములు/రాజులు తమ పొలాలు లేదా రైతుల పొలాల కోసం తమ సొంత ఖర్చుతో సొంత భూముల్లో బందలు/చెరువులు తవ్వించి సాగునీరు అందించేవారు. వాటికి వరద నీరు వెళ్లేలా ఇన్ ఫ్లో గెడ్డలు ఉంటాయి. అయితే ఎస్ఎఫ్ఏ (సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్)లో కొన్నింటికి యజమానుల పేర్లు ఉంటాయి. కొన్నింటికి ఇనాం అని ఉంటుంది కానీ ఎవరి పేరూ ఉండదు. ఇనాం అంటే జిరాయితీ లేక్ వే. సాధారణంగా ఇనాం భూములకు తహసీల్దార్ పట్టా ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇవి నీటి వనరులు కాబట్టి పట్టా ఇవ్వకూడదు. భూస్థితి గెడ్డ, వాగు, చెరువు, బంద.. అని ఉంటే వాటిని సాగు నీటి చట్టాల ప్రకారం ధ్వంసం (చదును, పూడ్చివేత) చేయరాదు. మేరీ బంద ఎఫ్ఎంబీలో చెరువు అని ఉంటుంది. అదేవిధంగా ఆరిపాక సర్వే నంబర్ 61లో కోనేరు అని ఉంటుంది. వీటిని అసలు ధ్వంసం చేయరాదు. అయితే రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డులు తయారుచేసి క్రయ విక్రయాలు జరిగాయి.

ఏపీఐఐసీ భూములూ స్వాహా

నియోజకవర్గ ప్రాంతంలో ఏపీఐఐసీకి చెందిన 10 ఎకరాల భూములకు ఎమ్మెల్యే అనుచరులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, లేఅవుట్ వేసి విక్రయించేశారనే ఆరోపణలు ఉన్నాయి. వీటిని పక్క జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యేకు ముడుపులు అందినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ కేసుతో సంబంధం ఉందనే కారణంతో వైసీపీ నుంచి ఇద్దరిని సస్పెండ్ చేశారు. ఇక బీఆర్‌టీఎస్ రహదారిపై 26 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమించి వైసీపీ కార్పొరేటర్ బంధువులు వాణిజ్య సముదాయం నిర్మించేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. దీని వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

సెటిల్మెంట్లు, పోస్టింగ్‌లు

నియోజకవర్గంలో ఒక సర్పంచ్ భర్త ఎమ్మెల్యేకు కుడిభుజంగా ఉంటూ వివాదాస్పద భూములు సెటిల్ చేసి కోట్ల రూపాయలు ఆర్జించారు. అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఏవైనా సరే ఎమ్మెల్యేతో చెప్పి వెంటనే చేయిస్తున్నారు. అన్నింటిలోనూ ఎమ్మెల్యేకు వాటా ఉందంటారు.

అనుచరులపై కేసులు

నియోజకవర్గంలో జగనన్న కాలనీల చదును పేరిట మట్టి తరలింపు, ఇళ్ల లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూలు చేయడంతో పాటు డి.పట్టా భూములను జిరాయితీ పట్టా భూములుగా మార్పిస్తానంటూ ఎమ్మెల్యే అనుచరుడు ఒకరు మోసం చేశారు. దీనిపై పోలీసు కేసు నమోదైంది. అలాగే నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో ఎమ్మెల్యే అనుచరులు ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడినట్టు అభియోగాలు ఉన్నాయి. ల్యాండ్ పూలింగ్ ఓనర్ సర్టిఫికెట్ జారీలో చాలా వివాదాలు జరగడంతో రెవెన్యూ అధికారులు తొమ్మిది మందిపై కేసులు పెట్టారు.

బంధువులూ దందా

8.68 ఎకరాల వీర్రాజు చెరువుకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే బంధువులు టాంపరింగ్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ చెరువుపై ఆధారపడి మూడు గ్రామాల రైతులు భూములను సాగు చేస్తున్నారు. ఆ చెరువు భూముల్లో ఎమ్మెల్యే బంధువులకు పట్టాలు ఇవ్వడంతో వాటిని వారు అమ్మేసుకున్నారు. కొన్నవారు చదును చేసుకున్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు హైకోర్టును ఆశ్రయించారు.

బాధపడొద్దు.. అండగా మేమున్నాం

కార్యకర్తల కుటుంబాలకు భువనేశ్వరి భరోసా



ఆత్మకూరు పట్టణంలోని అల్లీపురంలో అంజనేయరెడ్డి కుటుంబానికి చెక్కు అందజేసి మాట్లాడుతున్న భువనేశ్వరి

నెల్లూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'కార్యకర్తలను కోల్పోవడం పార్టీకి తీరని లోటు. కుటుంబ పెద్ద చనిపోతే ఆ బాధ తీరనిది. కానీ ఇక బాధపడొద్దు. వారు నాయకుడి కోసం ప్రాణమిచ్చారు. మీకు మేము అండగా ఉంటాం' అంటూ టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి భరోసా కల్పించారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా 3వ రోజు శుక్రవారం నెల్లూరు జిల్లా ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో ఆమె పర్యటించారు. అడుగడుగునా భువనేశ్వరికి కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆత్మకూరులోని అల్లీపురంలో కముజుల ఆంజనేయరెడ్డి, కలువాయిలో బొలిగర్ల చెన్నయ్య, శానాయపాలెంలో సన్నిబోయిన కృష్ణయ్యల కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం భువనేశ్వరి అక్కడి నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు.

శ్రీవారి సేవలో జస్టిస్ హరినాథ్



ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు.
– ఆంధ్రజ్యోతి, తిరుమల

ఎన్నికల విధులకు ప్రభుత్వ ఉద్యోగులే

- తప్పనిసరిగా వారినే నియమించండి
- నగదు, మద్యం అక్రమాలపై నిఘా పెంచండి
- ప్రతి జిల్లాలోనూ 50 కేంద్రాలకు వెబ్ కాస్టింగ్
- జిల్లాల ఎన్నికల అధికారులకు సీఈవో మీనా ఆదేశం



అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అవసరమైన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సంసిద్ధత మౌలిక సౌకర్యాలు, ఓటర్ల జాబితా నవీకరణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో ప్రభుత్వ ఉద్యోగులనే నియమించాలని, విధుల్లో తప్పనిసరిగా వారే ఉండాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ జారీకి ఎక్కువ సమయం లేదని ఈ లోగా అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. తాజా మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని జిల్లాలకు పంపామని, వాటిపై జిల్లా స్థాయిలో అధికారులు సమగ్ర అవగాహన పెంచుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల వారీగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సునిశితమైన, 1200 మంది ఓటర్లు పైబడి ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెబ్ కాస్టింగ్ సౌకర్యాన్ని తప్పనిసరిగా కల్పించాలన్నారు. ప్రతి జిల్లాలోనూ కనీసం 50 శాతం పోలింగ్ స్టేషన్లు వెబ్ కాస్టింగ్‌లో ఉండాలని తెలిపారు. దివ్యాంగులు, వయో వృద్ధులైన ఓటర్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వీరికి అవసరమైన ర్యాంపుల నిర్మాణ పనులను ఈ నెల 5వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులనే తప్పని సరిగా నియమించాలని, మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణా కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రతి జిల్లాకు సంబంధించిన నిర్వహణ ప్రణాళిక ముసాయిదా ప్రతిని సోమవారానికల్లా తమకు పంపాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల సమన్వయంతో మద్యం, నగదు అక్రమ రవాణా, ఇతర సామగ్రి రవాణాపై నిఘా పెట్టాలన్నారు. కేవలం రాష్ట్ర సరిహద్దుల్లోనే కాకుండా జిల్లాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపైనా నిఘా ఉంచాలన్నారు.

తిరగబడక ముందే ప్రభుత్వం మేలుకోవాలి

- ప్రభుత్వానికి వెంకట్రామిరెడ్డి వంతపాడుతున్నారు
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డ్ సచివాలయాల ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను తన చెప్పుచేతుల్లోకి తీసుకోవడానికి సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తన వందిమాగధులతో అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని ఆ సంఘం అధ్యక్షుడు భీమ్‌రెడ్డి అంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వానికి వంతపాడుతూ వెంకట్రామిరెడ్డి లాంటి ఉద్యోగ సంఘాల నేతలు గ్రామ, వార్డ్ సచివాలయ ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్దలు ఇలాంటి వారిని నిలువరించాలని, లేకుంటే సచివాలయ ఉద్యోగులే తిరగబడక తప్పదన్నారు. ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యమైన తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల నిర్వహణ ఖర్చులను ఇంతవరకు ఆర్బీకే సిబ్బంది భరిస్తూ వచ్చారని, ఆ బకాయిలన్నింటినీ ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఎరువులు రైతులు తీసుకోకపోవడంతో గడ్డకట్టిపోయినా, రైతు మేగజైన్‌ను రైతులు కొనుగోలు చేయకపోయినా ఆ భారమంతా సిబ్బందిపై వేస్తున్నారన్నారు.

చంద్రబాబు కేసులో తీర్పు మేరకే వీవీపాట్‌లు

- ఎన్నికల్లో పారదర్శకత కోసమే అమలు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కేసుకు సంబంధించి 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగానే ఓటర్ వెరిఫెయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్స్(వీవీపాట్) ప్రవేశ పెట్టినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వీటివల్ల ఎన్నికల్లో పారదర్శకతకు వీలవుతుందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రతి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొన్ని ఎంపిక చేసిన కేంద్రాల్లో వీటిని ప్రవేశ పెట్టినట్టు వివరించింది. ఈ మేరకు వైసీపీ ఎంపీ రఘురామకృష్ణ రాజు, బీఆర్ఎస్ ఎంపీ మన్నెం శ్రీనివాసరెడ్డి అడిగిన ప్రశ్నలకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ శుక్రవారం లోక్‌సభలో వివరణ ఇచ్చారు. వీవీపాట్‌లు ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తప్పనిసరిగా స్లిప్పులను కూడా లెక్కపెట్టే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. అయితే, వీవీపాట్‌లకు సంబంధించిన ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉందని తెలిపారు. ఈవీఎంలపై తలెత్తిన అనేక ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక విషయాలను తన వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచిందని మంత్రి పేర్కొన్నారు.

విచారణపై స్టే కావాలంటే హైకోర్టుకెళ్లండి

- 'మార్గదర్శి'కి సూచించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి చిట్‌ఫండ్ కేసుల విచారణపై స్టే కావాలనుకుంటే ఏపీ హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీంకోర్టు ఆ సంస్థకు సూచించింది. మార్గదర్శిపై దాఖలైన చార్జిషీట్‌లను రెండు జిల్లా కోర్టులు తిరస్కరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేసింది. ఆ అప్పీళ్లపై విచారణను ఏపీ హైకోర్టు నుంచి తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో మార్గదర్శి పిటిషన్ వేసింది. శుక్రవారం.. జస్టిస్ అభయ్ ఎస్. ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లపై స్టే ఇవ్వాలని మార్గదర్శి సంస్థ తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. స్పందించిన సుప్రీంకోర్టు స్టే కావాలనుకుంటే ఏపీ హైకోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించింది. తెలంగాణ హైకోర్టులో ఇప్పటికే విచారణ కొనసాగుతున్నందున స్టే ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించవచ్చునని ధర్మాసనం అభిప్రాయపడింది. తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసేవరకు ఏపీ ప్రభుత్వ అప్పీళ్లపై స్టే ఇవ్వాలని ఆ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. మార్గదర్శి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగించింది.

ముందస్తు బెయిల్ ఇవ్వండి!

- విచారణ లేకుండానే కేసు పెట్టారు
- కనీసం 41ఏ నోటీసులూ ఇవ్వలేదు
- కేసు నమోదు వెనుక రాజకీయాలు..
- ఓట్ల తొలగింపుపై పోరాడుతున్నాననే కక్ష
- 5 నుంచి అసెంబ్లీ.. హాజరవ్వాల్సి ఉంది
- హైకోర్టులో టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి పిటిషన్



అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ముందస్తు బెయిల్ కోరుతూ పర్చూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హైకోర్టును ఆశ్రయించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ కంపెనీల్లో ఇటీవల తనిఖీలకు వచ్చిన మైనింగ్ అధికారుల విధులకు ఆటంకం కలగించారని ఆరోపిస్తూ ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ మార్టూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది.

పిటిషన్‌లో ఏం పేర్కొన్నారంటే..

"గ్రానైట్ కంపెనీల్లో తనిఖీలు చేయకుండా విధులకు ఆటంకం కలిగించామనే ఆరోపణలతో మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(నిఘావిభాగం, నెల్లూరు) బాలాజీనాయక్ గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పలు కంపెనీల యజమానులతో పాటు నాపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి ప్రాథమిక విచారణ జరపకుండా కేసు పెట్టారు. కేసు నమోదు వెనుక రాజకీయ కారణాలున్నాయి. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్ల లోపు జైలు శిక్షకు వీలున్నవే. అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పోలీసులు సీఆర్పీసీ సెక్షన్ 41(ఏ)కింద నోటీసులు ఇవ్వాలి. కానీ, ఇవ్వలేదు. మరోవైపు, ఈ నెల 5 నుంచి ప్రారంభంకానున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాల్సి ఉంది. కానీ, ఈలోగానే నన్ను(పిటిషనర్) అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కేసులో కొందరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లే అయినా మేజిస్ట్రేట్ యాంత్రికంగా వారికి రిమాండ్ విధించారు. పర్చూరు నియోజకవర్గం పరిధిలో తప్పుడు సర్టిఫికెట్లతో ఓట్ల తొలగింపు కోసం గంపగుత్తగా ఫామ్-7 దాఖలు చేసిన వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాను. ఆ తర్వాతే ఓట్ల తొలగింపులో భాగస్వాములైన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకున్నారు. కొందరు పోలీసులను సైతం సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో నన్ను వేధించాలనే ఏకైక ఉద్దేశంతో తప్పుడు కేసులో ఇరికించారు. నాపై నమోదైన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నా. ముందుస్తు బెయిల్ మంజూరు చేయండి" అని ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టును అభ్యర్థించారు.

పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటా!

- హైకోర్టుకు నివేదించిన ఎంపీ కేశినేని
- 'కొండపల్లి' వ్యాజ్యంపై విచారణ మూసివేత

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కొండపల్లి పురపాలక చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫిషియో సభ్యునిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2021లో హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ఎంపీ కేశినేని నాని ఉపసంహరించుకున్నారు. శుక్రవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా ఆయన తరపు న్యాయవాది ఎన్. అశ్వినీకుమార్ స్పందిస్తూ.. పిటిషనర్ తన ఎంపీ పదవికి రాజీనామా చేశారని తెలిపారు. రాజీనామాను ఆమోదించాలని ఒకటి రెండు రోజుల్లో స్పీకర్‌ను కోరబోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామన్నారు. దీనికి సమ్మతించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి పిటిషన్ పై విచారణను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, కొండపల్లి పురపాలక చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్ అఫిషియో సభ్యునిగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ విజయవాడ ఎంపీ నాని 2021లో ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అప్పట్లోనే విచారణ జరిపిన న్యాయస్థానం ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎం పీని అనుమతించాలని కొండపల్లి మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల అథారిటీని ఆదేశించింది. ఫలితాన్ని ప్రకటించవద్దని అధికారులకు స్పష్టం చేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాకిస్థాన్‌లో అదే కథ

పాకిస్థాన్ రాజకీయంలో ఎప్పుడూ సైన్యమే గెలుస్తుంది. ఆ సంగతి జైల్లో ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌కు మరింత తెలుసు. శుక్రవారం ఆయన ట్విట్టర్‌లో ఓ సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. తాను గనుక అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేసి ఉండకపోతే, దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీజోక్యాన్ని నిలువరించే ధైర్యం భవిష్యత్తులో ఏ ప్రధానికీ ఉండేది కాదన్నారు. తనమీద పెట్టిన కేసులు, పడిన శిక్షలు, వెనుక కుట్రల గురించి లోతుగా వివరిస్తూ, ఓటు అనే శక్తిమంతమైన ఆయుధంతో దుష్టశక్తులను తరిమికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చాడు. ఆయన పార్టీ గుర్తు బ్యాట్‌ను ఎన్నికల సంఘం ఇప్పటికే రద్దుచేసింది, పార్టీ అభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగానే గెలవాలి. కూరగాయలు, కుర్చీలు, మంచాలు ఇత్యాది గుర్తులతో బరిలో ఉన్న-వీరిని ప్రజలు పెద్దపెట్టున గెలిపించడం సాధ్యమేనా?

ఎన్నికలు వారం ఉన్నాయనగా, రెండురోజుల తేడాలో రెండు ప్రధాన కేసుల్లో తీర్పులు ఎందుకంత వేగంగా వెలువడ్డాయో అందరికీ తెలుసు. తాను పదవీచ్యుతుడు కావడం వెనుక అమెరికా కుట్ర ఉన్నదని నిరూపించే ఆధారాలను ఇమ్రాన్ ఓ బహిరంగసభలో ప్రజలకు తెలియచెప్పి, ఆ కాగితాలను ఊపి హీరో అయినమాట నిజం. కానీ, రహస్యపత్రాలను లీక్ చేసిన కేసులో ఇప్పుడు ఆయనకు పదేళ్ళ జైలు శిక్షపడింది. ప్రధానిగా తాను అందుకున్న కానుకలను అమ్మిసొమ్ముచేసుకున్నాడన్న తోషాఖానా కేసులో ఆయనతోపాటు భార్యకు కూడా పద్నాలుగేళ్ళ జైలుశిక్షపడింది. ఈ తీర్పుల్లో వేగం, శిక్షల తీవ్రత చూసినప్పుడు ఇప్పటికే మూడేళ్ళ జైలుశిక్ష అనుభవిస్తున్న ఆయనను ఇప్పట్లో బయటకు రాకుండా చేయడమన్న లక్ష్యం కనిపిస్తూనే ఉంది. పదేళ్ళపాటు ప్రభుత్వ పదవులు అనుభవించడానికి అర్హత కోల్పోయిన ఆయన, రాజకీయంగా తిరిగితేరుకోకుండా తుదముట్టించే కుట్ర ఇది అని ఆయన పార్టీ వాదన. అధికశాతం ప్రజలు ఈ కేసులు అక్రమమైనవేనని నమ్ముతున్నారు. ఇమ్రాన్‌ను రక్షించుకోవాలని వివిధ రంగాల ప్రముఖులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు. ఇమ్రాన్ నీతిపరుడన్న భ్రమలు వీరికి ఉండకపోవచ్చు. కానీ, ప్రధాన రాజకీయపక్షాలను తోలుబొమ్మల్లాగా ముందుపెట్టి సైన్యం వెనుక నుంచి చక్రం తిప్పుతున్న సంగతి ప్రజలకు తెలుసు. దశాబ్దాలుగా సాగుతున్న నాటకమే అయినా, సైన్యంతో ఇమ్రాన్ బహిరంగయుద్ధం చేయడంతో ఇది మరీ స్పష్టంగా తెలిసొచ్చింది. ఆర్మీ, నిఘావ్యవస్థ పెద్దల నియామకం విషయంలో రేగిన ఘర్షణతోనే ఇమ్రాన్ పదవిపోయిన విషయం బహిరంగ రహస్యం. సైన్యంతో పోరాటంలో ఆయన పార్టీ ఓడిపోయింది. వేలాదిమంది కార్యకర్తలు జైళ్ళకు పోయారు, నాయకులు పార్టీ వదిలేశారు, దేశాలు పట్టిపోయారు, కొందరు కనిపించకుండా పోయారు. సైనికస్థావరాలమీద ఇమ్రాన్‌పార్టీ కార్యకర్తలు, అభిమానులు దాడులు చేసి, వాటికి నిప్పుపెట్టిన ఘటనలతో పాటు ఆయన పార్టీ దుంపనాశనం కావడంలో సైన్యం పాత్ర కూడా ప్రజలకు తెలుసు.

చరిత్ర పునరావృతమవుతుంది అన్నమాట పాకిస్థాన్‌కు చక్కగా అతుకుతుంది. అవినీతి ఆరోపణలతో నవాజ్ షరీఫ్‌ను పదవీచ్యుతుడిని చేసి, సైన్యం అండతో అధికారంలోకివచ్చిన ఇమ్రాన్‌ఖాన్ షరీఫ్‌ను వేధించుకుతిన్నారు. చివరకు కొనప్రాణంతో ఉన్న భార్యను కూడా చూడనివ్వకుండా చేశారు. పదేళ్ళజైలుశిక్షపడిన నవాజ్‌షరీఫ్ దేశం విడిచిపోతానన్న ఒప్పందంతో బెయిల్ దక్కించుకొని లండన్‌లో ప్రవాసజీవితం గడిపారు. ఆ తరువాత సైన్యానికి ఇమ్రాన్ మీద విరక్తి కలగడంతో భుట్టోలూ షరీఫ్‌లూ చేయికలిపారు, తమ్ముడు షరీఫ్ ప్రధాని అయ్యాడు, ఆ తరువాత అన్నరాకకు రాజమార్గం ఏర్పడింది. నవాజ్ షరీఫ్ దేశంలో కాలూనగానే ఆయన జైలుశిక్షరద్దయింది, జీవితకాల రాజకీయ నిషేధమూ తొలగిపోయింది. మూడుసార్లు గద్దెదింపిన సైన్యమే ఇప్పుడు ఆయనను ఆలింగనం చేసుకొని, నాలుగోసారి కూచోబెట్టేందుకు శ్రమిస్తోంది.

దశాబ్దాల సైనికరాజకీయంతో విరక్తిచెందిన ప్రజలు ఇమ్రాన్‌కు అండగా నిలుస్తారా, సైన్యంతో పెట్టుకున్న ఈ క్రీడాకారుడిని మోయడంవల్ల ప్రయోజనం లేదని షరీఫ్, భుట్టోల పక్షాన ఉంటారా అన్నది 8వతేదీన తేలుతుంది. స్వతంత్ర అభ్యర్థులుగా ఎంతమంది గెలిచినా, వారు ఒత్తిళ్ళకు, ప్రలోభాలకు లొంగకుండా ఇమ్రాన్‌కు విధేయంగా ఉంటారన్న నమ్మకం లేదు. ఎంత భయంకరమైన శిక్షలు పడినా ఇమ్రాన్ తెరవెనుక ఒప్పందాలు చేసుకోడు అంటూ ఆయన పార్టీ నాయకుడు చేసిన వ్యాఖ్య నవాజ్ షరీఫ్ లాగానే దేశం వదిలిపోవ-

పరిపూర్ణ వెలుగునిచ్చే జీవితం

1940, 50 దశాబ్దాలు ఉత్సాహం, చైతన్యం, కార్యదీక్ష, అంకితభావం, సృజనాత్మకతలతో నిండినవి. ఒకవైపు జాతీయోద్యమ ఉధృతి. మరోవైపు రెండవ ప్రపంచయుద్ధపు సంక్షోభం, సమసమాజపు కలల నందించిన సోవియట్ యూనియన్ ప్రభావం, వీటితో తెలుగు ప్రజలు, ముఖ్యంగా యువతీ యువకులు, విద్యార్థులు ఉద్యమాలలో భాగమైన కాలమది. ఫాసిస్టు వ్యతిరేకత ఆంధ్రదేశంలో ఉధృతంగా ప్రచారమైన రోజులవి. గ్రామగ్రామాన కమ్యూనిస్టు నినాదాలు మారుమోగిన కాలమది. ఆ కాలంలోని చైతన్యాన్నంతా తనలో ఆవహింపజేసుకుని, విద్యార్థినిగా, గాయనిగా, కార్యకర్తగా సాంస్కృతిక దళ సభ్యురాలిగా, నటిగా తనలోని సమస్త శక్తులనూ సమాజానికి అంకితం చేయాలని నిర్ణయించుకున్న ఒకానొక బాలిక నంబూరి పరిపూర్ణ. కుటుంబ నేపథ్యమూ సహకరించింది. అన్నయ్య నంబూరి శ్రీనివాసరావు మాటలు, మార్గదర్శకత్వం వెన్నుతట్టి పిలిచాయి. మద్రాసు, విజయవాడ వంటి నగరాలు, పట్టణాలే కాదు గ్రామాలు కూడా మూడు అడుగుల పరిపూర్ణ, సన్నగా చిన్నగా ఉన్న పరిపూర్ణ, స్టేజీ ఎక్కి తన కంఠంతో, నాట్యంతో, నటనతో ప్రజల మనసులలో అగ్ని పుట్టించేది. నిర్భీతి, సాహసం, నమ్మిన విలువల పట్ల అంకితభావం, ఆత్మగౌరవం, సంగీత సాహిత్యాలతో సున్నితమైన మనసు నిండా సహజ స్వభావసిద్ధమైన భావుకత— వీటితో నంబూరి పరిపూర్ణ ఆనాటి విద్యార్థి, యువజనోద్యమాలలో ప్రకాశించింది.



నంబూరి పరిపూర్ణ
1931–2024

ప్రేమించటమంటే గౌరవించటమని పరిపూర్ణ విశ్వాసం. ప్రతి సంబంధంలోనూ 'రెస్పెక్ట్' ముఖ్యమని ఆమె అనేకసార్లు చెప్పారు. ఇంట్లోనే కాదు ఆమె ఆఫీసుని, తన ఉద్యోగాన్ని నిర్వహించిన తీరు కూడా ఆమె విలువలను ప్రతిబింబిస్తుంది. మామూలుగా స్నేహాలు వ్యక్తుల మధ్య ఏర్పడి అక్కడే ఆగుతాయి. పరిపూర్ణ స్నేహం అక్కడ ఆగదు. ఆమె పిల్లలతో మంచి స్నేహం కలుస్తుంది. అంతటితో కూడా ఆగదు. మనవరాలు, మేనకోడలు... ఇలా ఎందరితోనో అల్లుకుపోగల చనువుని ఇస్తుంది. మూడు తరాలను ప్రభావితం చేసిన పరిపూర్ణ జీవితం ఆమెది.

ఆనాడు, ఈనాడు కూడా ఉద్యమం స్త్రీల సృజనాత్మకతనూ, నాయకత్వ లక్షణాలనూ తనలో ఇముడ్చుకోలేకపోయింది. వివాహం, నాయకుడైన భర్తను ప్రశ్నించక అనుసరించటమే ఉద్యమాలలోని స్త్రీల కర్తవ్యం, గమ్యం అయింది. దాసరి నాగభూషణం గారనే ఒక కమ్యూనిస్టు నాయకుడితో వివాహం పరిపూర్ణ పాలిట వరమా శాపమా అంటే శాపమే. కానీ శాపాన్ని వరంగా మార్చుకోగలిగిన జీవితాన్ని దిద్దుకోగలిగిన తనను తన స్వంత అస్తిత్వంతో ఆవిష్కరించుకోగలిగిన సృజనశీలి పరిపూర్ణ. అగ్రవర్ణానికి, ఆధిపత్య భావజాలానికి ఎదురుతిరిగి నిలబడి బతుకు పోరాటంలో నిలిచి, గెలిచింది. పరిపూర్ణ మానవిగా మార్గదర్శకురాలయింది పరిపూర్ణ.

బీదరికం, ఉద్యమం నుంచి దూరం కావటం, భర్త నుంచి దూరం కావటం, ముగ్గురు పిల్లల పోషణ భారం మీద పడటం ఇవేమీ ఆమెను కుంగదీయలేదు. స్వయం ప్రకాశితగా నిలబెట్టాయి. తనను తాను కాపాడుకుంటూ, ఇతరులకు స్ఫూర్తిగా నిలబడటం ఎలాగో కష్టపడి నేర్చుకుంది. కానీ ఆమె జీవితాన్ని చూసి ఉద్యమ నాయకత్వం ఏమీ నేర్చుకోలేదు. అది చారిత్రక విషాదం. స్త్రీల పట్లా, దళితుల పట్లా, వామపక్ష ఉద్యమాలలో మార్పు రావాల్సిన అవసరాన్ని డా. కొమర్రాజు అచ్చమాంబ నుంచి నంబూరి పరిపూర్ణగారి వరకూ ఎందరో స్త్రీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ జీవితాలనే పాఠాలుగా చేసి నేర్పాలని ప్రయత్నించారు. అవి విఫలయత్నాలే అయ్యాయి. కానీ వారి జీవితాలు, జీవిత గమనంలో వారు వేసిన దారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి తమ గమ్యాన్ని చూపించాయి. నడక నేర్పించాయి. అందువల్లే చరిత్రలో నంబూరి పరిపూర్ణ నిలబడిపోతారు. ఆధిపత్య వ్యక్తుల పేర్లు వినపడవు. కాలగమనంలో వారు తిరోగామి శక్తులుగా గుర్తింపబడతారు.

పరిపూర్ణకీ నాకూ 1985 నుంచి స్నేహం. వారింటికి వెడితే, ఇంటిని ఎలా కళాత్మకంగా, పరిశుభ్రంగా, మాననీయంగా, ప్రేమాదరణలతో తీర్చిదిద్దుకోవాలో అర్థమైంది. ఉద్యమ జీవితం నుంచి దూరమైనా ఉద్యమ విలువలనూ, ఉద్యమాలు అసలెందుకు మొదలవుతాయో ఆ ఆదర్శాలనూ, ఆశయాలను జీవితంలో నిలుపుకోవడమెలాగో అర్థమైంది. అసలైన విషయం అది అని తెలిసింది.

పరిపూర్ణ హాయిగా నవ్వటం చూశాను. ఆనందంగా బతకటం చూశాను. కోపంతో, చిరాకుతో, విసుగుతో కూడా ఆమెను చూశాను. కానీ దిగులు, దుఃఖం, కుంగిపోవటం— వీటితో ఆమెను ఎన్నడూ చూడలేదు. నేనే కాదు— నా స్నేహం చాలదు అవి చూసేందుకు. కానీ ఆమె పిల్లలతో సహా, ఆత్మీయ బంధువులతో సహా, ప్రాణ మిత్రులతో సహా ఎవరూ ఆమెనలా చూసి ఉండరని నాకు నమ్మకంగా తెలుసు. ఆమె ఆ విధంగా కూడా నాకు మార్గదర్శకురాలయింది.

1986లో దూరదర్శన్‌కు 'ఇద్దరూ ఒకటే' అనే చిన్న ఫిలింకి స్క్రిప్టు రాశాను. ఆడ, మగ పిల్లలిద్దరినీ వివక్ష చూపకుండా పెంచాలనేది ఆ కథ సారాంశం. అందులో పరిపూర్ణకు కోడలుగా నేను, కొడుకుగా అక్కినేని కుటుంబరావు నటించాం. అప్పుడప్పుడూ నవ్వుతూ నా అత్తగారు మీరు అంటే.. మా అబ్బాయి వీరు అని కుటుంబరావుని అభిమానించేవారు. చిన్నవాళ్లమనే కారణంతో గౌరవం తగ్గించే ప్రసక్తే లేదు ఆమె వద్ద. ప్రేమించటమంటే గౌరవించటమని ఆమె విశ్వాసం. ప్రతి సంబంధంలోనూ 'రెస్పెక్ట్' ముఖ్యమని ఆమె అనేకసార్లు చెప్పారు. ఇంట్లోనే కాదు ఆమె ఆఫీసుని, తన ఉద్యోగాన్ని నిర్వహించిన తీరు కూడా ఆమె విలువలను ప్రతిబింబిస్తుంది. మామూలుగా స్నేహాలు వ్యక్తుల మధ్య ఏర్పడి అక్కడే ఆగుతాయి. పరిపూర్ణ స్నేహం అక్కడ ఆగదు. ఆమె పిల్లలు దాసరి అమరేంద్ర, దాసరి శిరీష, దాసరి శైలేంద్రల వరకూ వెళ్తుంది. వారితో మంచి స్నేహం కలుస్తుంది. అంతటితో కూడా ఆగదు. మనవరాలు తోట అపర్ణ, మేనకోడలు నంబూరి మనోజ్ఞ ఇలా ఎందరితోనో అల్లుకుపోగల చనువుని ఇస్తుంది. మూడు తరాలను ప్రభావితం చేసిన పరిపూర్ణ జీవితం ఆమెది. ఆమె కథలు, నవలలు, వ్యాసాలు రాశారు. తన ఆత్మకథను 'వెలుగుదారులలో...' అనే పేరుతో రాశారు. ఆమె జీవితం గురించి ఎలాంటి దాపరికాలూ లేకుండా రాసిన ఆ పుస్తకం చదివితే ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఉద్యమాలు, రాజకీయాలు, కుల, లింగపరమైన వివక్షలు, వాటికి వ్యతిరేకంగా వ్యక్తులు చేసిన పోరాటాలు, అవి ఉద్యమాలకు ఇచ్చిన స్ఫూర్తి, వ్యక్తిగతం రాజకీయంగా మారే సందర్భాలు, ఇలా ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆమె చేసింది కేవలం వ్యక్తిగత పోరాటం కాదనీ, రాజకీయమనీ అర్థమైతే ఇప్పటి తరాలకు ఎంతో మేలు జరుగుతుంది.

వెలుగుదారులలో... పుస్తకం నంబూరి పరిపూర్ణని చిరంజీవిని చేసింది. ఆ పుస్తకం చదివితే ఆమెతో స్నేహం కలుస్తుంది. ఆమె వేసిన దారిలో నడవాలనిపిస్తుంది. జీవితాన్ని సృజనాత్మకంగా జీవించటం కూడా ఒక Intellectual లక్షణమని తెలుస్తుంది. పరిపూర్ణగారూ మీకు వీడ్కోలు లేదు. మీరు ప్రతి తరానికీ వెలుగుచూపే దారులేసి నడిపిస్తూనే ఉంటారు.

■ ఓల్గా

సర్వత్రా నియమాలు, ఎల్లెడలా ఉల్లంఘనలు!

చట్టబద్ధ పాలన, చట్టంతో పాలన ఒకటి కాదు. రెండింటి మధ్య చాలా వ్యత్యాసమున్నది. చట్టబద్ధ పాలనలో చట్టమే అత్యున్నతమైనది. పాలకులు దానికి కట్టుబడి ఉంటారు. అలా ఉంటేనే వారి పాలన చట్టబద్ధ పాలన అవుతుంది. ప్రజలు కోరుకునే పాలన ఇది. ఇక చట్టంతో పాలనలో పాలకులే సర్వాధికారులు. చట్టం కేవలం వారికి ఒక సేవిక మాత్రమే. మరి సేవకులను ఎవరు ఏ క్షణాన అయినా మార్చుకోవచ్చు అందుకే ఇది ప్రజలు మెచ్చని, కోరుకోని పాలన. మన పూర్వీకులు అంటే చారిత్రక తొలి యుగాల మనుషులు స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుని సంఘ జీవితాన్ని అభివృద్ధిపరచుకోవడం ప్రారంభమైన నాటి నుంచీ మానవులు తమ సమష్టి జీవనం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉండి తీరాలన్న వాస్తవాన్ని అంగీకరించారు. నియమ బద్ధంగా వ్యవహరించడం అలవరచుకున్నారు.



ఒక సరళ వ్యవహారాన్ని చాలా సంక్షిప్త రీతిలో వివరించాలనేది రాజకీయాల నియమాలలో ఒకటి. ఈ నియమంపై పూర్తి స్పష్టత కావాలన్నా, ఇతర రాజకీయ నియమాల గురించి మరింతగా తెలుసుకోవాలన్నా మీరు వెళ్లవలసిన, సంప్రదించి తీరాల్సిన మహానుభావుడు నితీశ్ కుమార్!

యుద్ధానికీ నియమాలు ఉన్నాయి. గత శతాబ్దిలో రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం జెనీవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులలో యుద్ధాల నిర్వహణ, యుద్ధ ఖైదీలను చూసుకునే విషయమై కొన్ని ఒప్పందాలను రూపొందించారు. ఆ ఒడంబడికలను ప్రపంచ వ్యాప్తంగా 196 దేశాలు ఆమోదించాయి. ఆ ఒప్పందాలను అంతర్జాతీయ మానవతావాద న్యాయసంహితగా పరిగణిస్తున్నారు. ఏ దేశమూ ఈ న్యాయ నిబంధనలను ఉల్లంఘించకూడదు. అది ప్రపంచ సంకల్పం. దేశాల ఆచరణ గురించి మరి చెప్పనవసరం లేదు.

ఆ ఒప్పంద నియమాలను సంక్షిప్తంగా పేర్కొంటాను: రోగగ్రస్తులు, గాయపడిన వారిని ఆదుకోవాలి, యుద్ధ సమయంలో యుద్ధ ప్రాంతాలలో ఉన్న వైద్య సిబ్బంది, మత సంబంధిత వ్యక్తులకు రక్షణ కల్పించాలి; గాయపడిన సైనికులు, నావికులను అన్ని విధాల ఆదుకోవాలి; యుద్ధ ఖైదీల పట్ల పరిపూర్ణ మానవతా దృక్పథంతో ప్రవర్తించాలి. ఆక్రమిత ప్రాంతాలలో ఉన్న వారితో సహా పౌరులు అందరికీ ఎటువంటి మినహాయింపు లేకుండా సంరక్షణ కల్పించాలి.

అయితే వియత్నాం, ఇరాక్, లిబియా యుద్ధాలలో ఈ నియమాలను నిర్భీకంగా ఉల్లంఘించడం జరిగింది. ఇప్పుడు కొనసాగుతోన్న యుద్ధాల (రష్యా– ఉక్రెయిన్ మధ్య; ఇజ్రాయెల్– హమాస్ మధ్య)లోనూ ఆ నియమాలను ఎవరూ పాటించడం లేదు. అత్యాచారాలు, దోపిడీ యథేచ్ఛగా జరిగిపోతున్నాయి ఉక్రెయిన్ ఆసుపత్రులు, విద్యాలయాలు, పౌర ప్రాంతాలపై రష్యా భీకరంగా క్షిపణి దాడులు చేస్తోంది. గత నెల 24న, 65 మంది ఉక్రేనియన్ యుద్ధ ఖైదీలను తీసుకువెళుతున్న ఒక రవాణా విమానాన్ని కూల్చివేశారు. ఖైదీలతో పాటు విమాన సిబ్బంది తొమ్మిది మంది కూడా ఆ ఘటనలో మరణించారు. ఉక్రెయిన్ ఉగ్రవాద చర్యకు పాల్పడిందని రష్యా ఆరోపించింది. ఆ విమానం కూల్చివేతతో తమకు సంబంధం లేదని ఉక్రెయిన్ ఖండించింది. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధానికి వద్దాం. ఈ అమానుష ఘర్షణలను హమాస్ గత అక్టోబర్ 7న ప్రారంభించింది. గాజా నుంచి దక్షిణ ఇజ్రాయెల్‌పై హమాస్ హఠాత్తుగా జరిపిన క్షిపణి దాడుల్లో 1200 మంది మరణించారు. 240 మంది ఇజ్రాయిలీలు ఇప్పటికీ హమాస్ నిర్బంధంలో మగ్గుతున్నారు. ఇజ్రాయెల్ వెన్వెంటనే ప్రతీకార చర్యలకు ఉపక్రమించింది. గత నాలుగు నెలలుగా అవి అమానుషంగా కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం చాలా కిరాతకంగా వ్యవహరిస్తోంది. గాజాను దిగ్బంధం చేసింది. ఇంతవరకు 25 వేల మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం హతమార్చింది.

అంతర్జాతీయ ఒడంబడికలు నిర్దేశించిన ప్రతి నియమమూ ఈ రెండు యుద్ధాల్లోనూ పూర్తిగా ఉల్లంఘనకు గురవుతోంది. యుద్ధ నియమాలను ఉల్లంఘించిన వ్యక్తులు, దేశాలపై ఐక్యరాజ్యసమితి న్యాయస్థానాలలో విచారణ జరుపుతారు. శిక్ష విధిస్తారు. జెనీవా ఒడంబడికను ఇజ్రాయెల్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్‌ను దక్షిణాఫ్రికా 'ద హేగ్'లోని అంతర్జాతీయ న్యాయస్థానానికి ఈడ్చింది. ఆ న్యాయస్థానం ఇజ్రాయెల్‌పై అనేక ఆంక్షలు విధించింది. మరి ఆ యూదు దేశం వాటికి కట్టుబడి ఉంటుందా?

ప్రాచీన తమిళ సారస్వతంలోని ఒక ఉజ్వల అధ్యాయమైన సంగం సాహిత్యంలో ఒక పద్యం యుద్ధ నియమాలను వివరించింది: గోవులు, గౌరవప్రద బ్రాహ్మణులు, మహిళలు, రుజాగ్రస్తులు సంతానం లేనివారు తక్షణమే సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలి; ఇక్కడ ఒక యుద్ధం ప్రారంభమవనున్నది. ధర్మపథాన్ని నిర్దేశించిన తరువాత రాజు యుద్ధ రంగంలోకి ప్రవేశిస్తాడు'.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

రామాయణ మహాకవి కంబన్ (క్రీ.శ. 1180) రామ రావణ యుద్ధం గురించి చేసిన వర్ణనలో శ్రీరాముడు తన ప్రత్యర్థి రావణుడుతో ఇలా అంటాడు: 'నీవు నీ ఆయుధాలు అన్నిటినీ కోల్పోయి, నిరాయుధంగా నిస్సహాయంగా మిగిలిపోయావు. ఇటువంటి పరిస్థితిలో నేను నీతో పోరాడడం ధర్మం కాదు; ఈ రోజుకు పోరును విరమించి ఇంటికి వెళ్లు, రేపు ఉదయం యుద్ధానికి రా; అప్పుడు నేను నీతో పోరాడుతాను'.

యుద్ధం నుంచి ప్రేమకు వెళదాం. ప్రేమ గురించి, ప్రేమ నియమాల పైన సంఖ్యానేక పుస్తకాలు ఉన్నాయి. ఎన్ని ప్రేమ నియమాలు ఉన్నాయో అన్ని పుస్తకాలు ఉన్నాయి. ప్రేమికుల సంఖ్య మాత్రం తక్కువగా ఉంటుందా? ప్రేమ నియమాలు అనేది అనేక పుస్తకాల శీర్షిక. ప్రేమ నియమాలు అనే సాదా సీదా శీర్షిక నుంచి 8 రూల్స్ ఆఫ్ లవ్ నుంచి 40 రూల్స్ ఆఫ్ లవ్ .... ఇలా ఆకర్షణీయమైన శీర్షికలతో ఎన్నో పుస్తకాలు ఉన్నాయి. వాటిలో ఏ ఒక్కదాన్నీ నేను చదవలేదుగానీ వాటికి అసంఖ్యాక పాఠకులు ఉన్నారని కచ్చితంగా చెప్పగలను.

నా గమనంలోకి వచ్చిన కొన్ని ఆలోచనాత్మకమైన ప్రేమ నియమాల గురించి ప్రస్తావిస్తాను: 'నీ ప్రేమకు విలువ ఇవ్వని వ్యక్తి పట్ల నీ ప్రేమను వృథా చేసుకోవద్దు' అని షేక్‌స్పియర్ మహాకవి అన్నారు. 'సదా ప్రేమలో ఉండాలి. అసలు ఎప్పటికీ వివాహం చేసుకోకపోవడానికి అదే కారణం' అని ఆస్కార్ వైల్డ్ అంటాడు. 'ఎవరైనా ఒకరు తన ప్రేమను తెలియజేయడానికి చేసిన పనులు, సాహసాల గురించి చదివిన తరువాత ఏమి చదవాలి? హత్యోదంతాల కాలమ్' అని బెర్నార్డ్ షా అంటాడు. 'ఒకసారి ప్రేమలో పడ్డ తరువాత మళ్లీ లేవడం అసాధ్యం' అని మహా వైజ్ఞానికుడు ఐన్‌స్టీన్ చమత్కరించారు. ప్రేమకు హాస్యయుతమైన భాష్యాలు చెప్పే ఉద్దేశంతో ఆ మహా మహులు ఆ వ్యాఖ్యలు చేసి ఉండకపోవచ్చు గానీ వాటిలో ప్రేమ నియమాలు మనకు స్పష్టమవుతాయి. పురాతన, మహోన్నత తమిళ తాత్విక —కావ్యం 'తిరుక్కురల్' (క్రీ.శ.500)లో ప్రేమపై 25 అధ్యాయాలు, 250 ద్విపదలు ఉన్నాయి. 'ప్రేమికుల మధ్య కళ్లు, కళ్లు కలిసినప్పుడు మాటల అవసరం లేదు' అని 'తిరుక్కురల్' స్రష్ట అంటాడు. ఒక ప్రేమ నియమాన్ని ఆయన అలా చక్కగా చెప్పాడు. ఇక రాజకీయాల నిబంధనలు చూద్దాం.

రాజకీయ వ్యవహారాల విషయంలో రాజకీయ నియమాలతో రాజకీయాలపై చట్టాన్ని ముడిపెట్టకూడదు. అలా చేయడం గందరగోళపడడమే అవుతుంది. చట్టం ఒక విషయం, అయితే నియమాలు — ఆట ఆడే తీరు తెన్నులు— మరొక విషయం. నిజానికి కొన్ని ఆటలను నిర్దేశత నియమాలను అధిగమించే లక్ష్యంతో అప్రకటిత నిబంధనలతో ఆడడం జరుగుతుంది. ఉదాహరణకు పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు ఉద్దేశించిన చట్టాన్నే తీసుకోండి. ఆ చట్టం అమలవుతున్న వైనాన్ని గమనిస్తే అది పార్టీ ఫిరాయింపులను మరింతగా ప్రోత్సహిస్తుందని అర్థమవుతుంది. రాజకీయాల నిబంధనల కింద అంపైర్ సైతం ఒక పక్షాన ఆడవచ్చు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. పార్టీ ఫిరాయింపుల క్రీడలో స్పీకర్లే ఆటగాళ్లయిన ఉదంతాలు చాలా ఉన్నాయి. పైగా ఒక సరళ వ్యవహారాన్ని చాలా సంక్షిప్త రీతిలో వివరించాలనేది రాజకీయాల నియమాలలో ఒకటి. ఈ నియమంపై పూర్తి స్పష్టత కావాలంటే, రాజకీయాల ఇతర రాజకీయ నియమాల గురించి మరింతగా తెలుసుకోవాలన్నా మీరు వెళ్లవలసిన, సంప్రదించి తీరాల్సిన మహానుభావుడు నితీశ్ కుమార్ అనడంలో నాకే కాదు, ఎవరికీ సందేహం లేదు.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఐదేళ్లయినా ఎక్కడి 'తిక్కన' అక్కడే!

మహాభారతాన్ని ఆంధ్రీకరించిన సారస్వతమూర్తి తిక్కన రాజకీయ రంగుల 'వల'లో చిక్కుకున్నారు. 2018 డిసెంబర్‌లో నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయడానికి తిక్కన విగ్రహాన్ని తీసుకువచ్చారు. ఆయన కాంస్య విగ్రహం పసిడి రంగుకు చేరువలో ఉండడంతో పసుపు ముద్ర అపవాదు పడి దాదాపు ఐదేళ్ల నుంచి ఆవిష్కరణకు దూరమైంది. మహాభారతంలో 15 పర్వాలు, 15,901 పద్యాలు విరచించారనే విషయం తెలియని ప్రస్తుత పాలకుల కురచ దృష్టి వల్ల, తిక్కన విగ్రహం చీకటి గదిలో బందీ అయింది. సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తిక్కన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని చివరి వరకు ప్రయత్నించి విఫలమయ్యారు. కొవిడ్‌తో ఆసుపత్రిలో చేరే ముందు కూడా అప్పటి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, ఆయన కార్యాలయ ప్రాంగణంలోనే ప్రతిష్ఠింపజేయాలని కూడా అభ్యర్థించారు.



పెన్నానది పరవళ్ల మధ్య శ్రీరంగనాథస్వామి పాదాల చెంత విరచించిన నెల్లూరు నగరంలో తిక్కన విగ్రహం లేని కొరతపై ఎస్పీ బాలు దృష్టి పెట్టడంతో అప్పటి ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ వెంటనే స్పందించి రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. డి.విజయభాస్కర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. ఆయన వెంటనే దానిని ఆమోదింపచేసి విజయవాడలో ప్రముఖ శిల్పి బుర్రా ప్రసాద్‌చే విగ్రహం తయారు చేయించారు. ఆ విగ్రహ ఆవిష్కరణతో పాటు, తెలుగు మహోత్సవం పేరుతో మూడు రోజుల పాటు తిక్కన తిరునాళ్ళు జరపాలని టీడీపీ ప్రభుత్వం భావించింది. ఈ లోపు ఎన్నికల కోడ్ రావడంతో ఈ కార్యక్రమమంతా వాయిదా పడింది. దాంతో తిక్కన విగ్రహాన్ని సంగీత కళాశాలలోని ఓ చీకటి గదిలో ఉంచారు.

ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో ఆ తర్వాత జిల్లా మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ దృష్టికి ఆ విషయాన్ని తీసుకెళ్లారు. ఈ మంత్రి బృందం పరిశీలించింది. అప్పటి కలెక్టర్ చక్రధర్ బాబు కూడా అదిగో ఇదిగో అంటూ మీనమేషాలు లెక్కపెడుతూ మహాత్ముని విగ్రహం, వంద అడుగుల జాతీయ జెండాని కూడా ప్రతిష్ఠించారు. అదే ప్రాంగణంలో తిక్కన విగ్రహం ఏర్పాటు చేయవలసి ఉంది. విగ్రహం అప్పటికి నెల్లూరు చేరుకొని మూడేళ్లు దాటినా, సాహిత్య కళాభిమానులు, చరిత్ర అభిమానులు ప్రశ్నిస్తున్నా తిక్కన విగ్రహాన్ని ప్రతిష్ఠించే చొరవ నాయకులు, అధికారులు కూడా తీసుకోకపోవడమే జిల్లాకు శాపంగా మారింది. కారణం తెలుగుదేశం పార్టీ చేయించిన విగ్రహం కావడం, దానికితోడు రంగు సమస్య వెంటాడడంతో తిక్కన చీకటిలోనే బందీగా ఉన్నారు. రాజకీయ సుడిలో చిక్కుకున్న మహాకవి 'తిక్కన'కు ఐదేళ్లు నిండి, ఆరో ఏడు మొదలైంది. ఆయనకు విముక్తి ఎప్పుడా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

– ఈతకోట సుబ్బారావు, నెల్లూరు

రేపు కె. సభా శతజయంతి సదస్సు

సాహిత్య అకాడెమీ, చిత్తూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4న కె. సభా శతజయంతి సదస్సు జరుగనున్నది. చిత్తూరు బైపాస్ రోడ్డులో గల కట్టమంచి బాలకృష్ణారెడ్డి మ్యాంగో భవనంలో జరగనున్న ఈ కార్యక్రమ ప్రారంభ సమావేశంలో సి. మృణాళిని స్వాగతోపన్యాసం చేస్తారు. కె. రామలక్ష్మి అధ్యక్షులు, కె. బాలకృష్ణారెడ్డి గౌరవ అతిథి. మధురాంతకం నరేంద్ర కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం కిరణ్ క్రాంత్ చౌదరి అధ్యక్షతన జరిగే మొదటి సమావేశంలో కె.సభా కథాసాహిత్యంపై డి.రాజేశ్వరమ్మ, జీవితం—సాహిత్యంపై పాయసం సుబ్రహ్మణ్యం, బాలసాహిత్యంపై పత్తిపాక మోహన్ పత్ర సమర్పణ చేస్తారు. మధ్యాహ్నం కాసిమ్ అలీ ఖాన్ అధ్యక్షతన జరిగే రెండవ సమావేశంలో కెసభా నవలలపై జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, కవిత్వ రచనలపై పలమనేరు బాలాజీ, నాటికలపై ఎం.ఆర్. అరుణకుమారి పత్రసమర్పణ చేస్తారు. సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి వసపల హరికృష్ణారెడ్డి అధ్యక్షులు, డి. అశోక్ కుమార్ గౌరవ అతిథి. కె. వేణుగోపాల్ సమాపన ప్రసంగం, వి. రఘుపతి వందన సమర్పణ చేస్తారు.

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

లౌకికత్వమా, హిందుత్వమా... ఏది దారి?

రామ మందిర ప్రారంభోత్సవ సంరంభం ముగిసింది. త్రేతాయుగం మరోసారి ప్రారంభమైంది. సాక్షాత్తు విష్ణుమూర్తి కలియుగ అవతారంగా భక్తుల కీర్తి గానాల మధ్య నరేంద్ర మోదీ చేతుల మీదుగా రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠాపన జరిగింది. ఆయనే అభివర్ణించినట్టు ఇదొక సరికొత్త కాలచక్రానికి శుభారంభం. ఇక అంతా రామమయం అని అశేష హిందూ భారతం తన్మయంతో ఊగిపోయింది. అయ్యో ఇదేమి రాజకీయం అని కొందరు అవాక్కయ్యారు. మతం రాజకీయంగా, రాజకీయం మతంగా మారడం ఇప్పుడే ఏదో కొత్తగా చూస్తున్నట్టు గుండెలు బాదుకున్నారు. ఇప్పుడే కాదు ఎన్నో యుగాలుగా, ఇక్కడే కాదు ప్రపంచమంతా అప్రతిహతంగా కొనసాగుతున్న అనంత ధార్మిక మార్మిక తతంగమే కదా ఇదంతా. తరతరాల మత రాజకీయాల కొనసాగింపే ఈ రామ మందిర వివాదం.

1984 ముందు బీజేపీ, ఆరఎసఎస్, విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థల ఎజెండాలో రామ మందిరం లేనే లేదు. రెండు సీట్ల నుండి 300 సీట్ల దాకా బీజేపీ ఎదిగిన ప్రస్థానంలో రామ మందిర పాత్ర మనకు తెలిసిందే. ఇక్కడ నుంచి 400 సీట్ల దాకా పరిక్రమిస్తామని రామమందిర ప్రారంభోత్సవం నాడే మోదీ భక్తులు అత్యుత్సాహంగా చేసిన ప్రకటన కూడా ఈ వెలుగులోనే అర్థం చేసుకోవాలి. బీజేపీ వారి మాటల్లో చేతల్లో ఎలాంటి దాపరికమూ లేదు. "భారతదేశానికి రాముడే చేతన, రాముడే చింతన, రాముడే ఆస్తా, రాముడే ఆధారం, రాముడే సత్యం రాముడే నిత్యం" ఇత్యాది అత్యద్భుత భవ్య దివ్య పదజాలంతో మోదీ చేసిన ప్రసంగం దేశమంతా మారుమోగుతూనే ఉంది. బీజేపీ వారి ఉద్దేశం సుస్పష్టం. ఇందులో వారిని తప్పుపట్టే పనే లేదు. మరో వెయ్యేళ్లు ఇక్కడ అప్రతిహతంగా రాజ్యాధికారాన్ని చెలాయించాలంటే రాముడే ఆధారం అని వారికి అర్థమైంది. రానున్న ఎన్నికల పరమావధిగా ఈ రామ మందిర ఉద్ఘాటన మహోత్సవం సాగినట్టు అర్థమవుతూనే ఉంది.

మరి ప్రతిపక్షాలు ఏం చేయాలి? బీజేపీ వారు రాముని అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారని చెబుతూనే, ప్రతిపక్షాలు కూడా మరో రకంగా మరో రూపంలో అదే పని చేయడం ద్వారా ఈ దేశానికి వారు ఎలాంటి సందేశాలు ఇస్తున్నారు అన్నదే ఇక్కడ చర్చనీయాంశం. ఢిల్లీ ప్రధాని ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీలో ప్రతి నియోజక వర్గంలోనూ ప్రతి నెలా మొదటి మంగళవారం రామాయణ సుందరకాండ పఠనాన్ని, హనుమాన్ చాలీసా పఠనాన్ని ప్రారంభించారట. అలాగే ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ 100కోట్ల రూపాయలకు పైగా ఖర్చుతో జగన్నాథ కల్చరల్ హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇటీవలనే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ఛత్తీస్‌గఢ్‌లో రామాయణ కల్చరల్ హెరిటేజ్ ఏర్పాటుకు వాగ్దానం చేశారు. మధ్యప్రదేశ్‌లో కమల్ నాథ్ ఆకాశమంత హనుమాన్ విగ్రహాన్ని, ఊరంత సీతా మందిరాన్ని ప్రజలకు వాగ్దానం చేశారు. ఇలా ప్రతిపక్షాలవారు కూడా తామూ హిందూ భక్తులమేనని నిరూపించుకోవడానికి తంటాలు పడుతున్నారు.

వారు తమ మత విశ్వాసాలను ప్రకటించడానికి హక్కు ఉంది. కానీ టైమింగ్ ఎలాంటిది? అది కదా ముఖ్యం. దేశంలో ఒకపక్క రాజ్యాంగ మౌలిక సూత్రాలలో అతి ప్రధానమైన లౌకిక స్వప్నానికి భంగం వాటిల్లే మత రాజకీయ ప్రయత్నాలు బాహాటంగా కొనసాగుతున్న వేళ, దేశ ప్రయోజనాలు కాపాడడానికి నడుం కట్టుకున్నామన్న వారు ఏం చేయాలో, ఎలాంటి కార్యక్రమాన్ని తీసుకోవాలో అర్థం కాని అయోమయంలో పడిపోవడం ప్రజాస్వామిక వాదులకు పరమ విషాదం. హిందుత్వాన్ని హిందుత్వంతో జయించగలరా? మత రాజకీయాలను మత రాజకీయాలతో ఓడించగలరా? మోదీ దారిలోనే ప్రతిపక్షాలు కూడా నడిస్తే ప్రజలకు మోదీనే మెరుగైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తే అది వారి తప్పేముంది?

బహుశా ఈ విషయాన్ని ప్రతిపక్ష పార్టీలన్నింటికంటే రాహుల్ గాంధీ బాగా అర్థం చేసుకున్నట్టు ఉన్నారు. ఎన్నికలు ఇంకా రెండు మూడు నెలల్లో ఉండగా ప్రతిపక్షాల ఐక్యతకు, ఉమ్మడి కార్యక్రమాల పోరాటాల రూపకల్పనకు సమయం కేటాయించాల్సిన కాంగ్రెస్ పార్టీ కీలక నేత, ఇలా దేశ యాత్రలు చేయడం ఏంటని కొన్ని విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో, రాహుల్ గాంధీ మరోసారి మరో నినాదంతో భారత్ జోడో న్యాయ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్రకు ముందు ఢిల్లీలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు మాత్రమే తన ఎజెండా కాదని, ఈ దేశంలో కేవలం ఎన్నికల రాజకీయాలతో బీజేపీని ఓడించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. తన పోరాటం పొలిటికల్, ఐడియలాజికల్ పోరాటమని, ఇది ఈ దేశంలో సమాంతరంగా సాగినప్పుడే ఎప్పటికైనా లౌకిక శక్తుల విజయం సాధ్యమవుతుందని రాహుల్ అభిప్రాయం. ఈ దేశంలో తరతరాలుగా సాగిన, ఇప్పుడు సాగించాల్సిన సాంస్కృతిక పోరాటం పట్ల ఆయన పరోక్షంగా తన అభిప్రాయాలు చెప్పడం ప్రతిపక్షాలకు ఒక గొప్ప మార్గ నిర్దేశం. కేవలం ప్రతిపక్షాలకే కాదు ఈ దేశంలో ఉన్న సమస్త లౌకిక ప్రజాతంత్ర శక్తులందరికీ ఇది ఒక గొప్ప సందేశమే.


జనవరి 22న అయోధ్యలో వన్ మ్యాన్ షో కొనసాగుతున్న సమయంలో మమతా బెనర్జీ బెంగాల్లో సర్వధర్మ సామూహిక ప్రార్థనలు కొనసాగించడంతో రాహుల్ గాంధీ అభిప్రాయాలకు కొంతైనా అర్థం పట్టినట్టు అయింది. ఇప్పటికైనా ప్రతిపక్షాలు బీజేపీ పన్నిన మతరాజకీయ వ్యూహంలో చిక్కుకుపోకుండా, తమ హిందూ భక్తి విశ్వాసాలను కాపాడుకుంటూనే, దేశమంతా ఒక లౌకిక ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం కోసం నడుం కట్టాలి. ఈ యుద్ధానికి, యుద్ధంలో విజయానికి ఎన్నేళ్ళు పట్టినా అనివార్యంగా ప్రతిపక్షాలు నడవాల్సిన దారి ఇదే.

ఇప్పటికైనా ప్రతిపక్షాలు బీజేపీ పన్నిన మతరాజకీయ వ్యూహంలో చిక్కుకుపోకుండా, తమ హిందూ భక్తి విశ్వాసాలను కాపాడుకుంటూనే, దేశమంతా ఒక లౌకికప్రజాతంత్రప్రత్యామ్నాయం కోసం నడుం కట్టాలి. ఈ యుద్ధానికి, యుద్ధంలో విజయానికి ఎన్నేళ్ళు పట్టినా అనివార్యంగా ప్రతిపక్షాలు నడవాల్సిన దారి ఇదే.



దీనికి ఎన్నో త్యాగాలు కావాలి. సీట్ల సర్దుబాట్లకే సిగపట్లు పట్టే ఈ విపక్షాల వీరులు వందల ఏళ్ళు పోరాటం చేయాలంటే ఆ సత్యాన్ని జీర్ణించుకోగలరా? ఏది ఏమైనా యుద్ధాలు రక్తపాతాలు కుట్రలు కుతంత్రాలు కేంద్రంగా విస్తరించే రాజ్యాన్ని కూడా తన బోధనలతో బౌద్ధం ఎలా శాంతి మార్గం పట్టించిందో ఆ చరిత్ర గుర్తెరగాలి. మతాధార రాజ్యాన్ని సర్వజాతుల సర్వ వర్గాల సామరస్యం వైపు మళ్లించడంలో బౌద్ధం సాధించిన విజయాలను తెలుసుకోవాలి. తర్వాత తర్వాత ఏ కుట్రలతో, తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఏ వర్గాలు బౌద్ధ భిక్షువుల్ని వేలాదిగా వధించి వారిని నెత్తుటి సముద్రాల్లో కలిపేశారో ఆ సత్యాన్ని అధ్యయనం చేయాలి. కులం పునాదుల మీద ఒక జాతిని, ఒక నీతిని నిర్మించలేరని బాబాసాహెబ్ అన్నమాట ఇప్పుడు కొంచెం మార్చుకోవాలి. వాస్తవానికి దీన్ని మతం పునాదుల మీద అని ఇప్పుడు చదువుకోవాలి. రానున్న ఇంత భయానక ప్రమాదాన్ని ఆయన ఆనాడే గుర్తించాడు. కనుక ఇక మనకు మరో ప్రత్యామ్నాయం లేదని బుద్ధం శరణం గచ్ఛామి అన్నాడు. ఇంత మహత్తర మార్గాన్ని ఆయన ఎందుకు ఎంచుకున్నాడో, ఈ దేశానికి ఆ మార్గమే శరణ్యమని ఆయన ఎందుకు చెప్పాడో కనీసం ఆయన అనుయాయులైనా అర్థం చేసుకున్నారో లేదో తెలియదు. అర్థం చేసుకున్నవారు ఆ మార్గంలో పయనించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మందిరాలు కూల్చి మసీదులు కట్టారని చేస్తున్న వాదనతో పాటు, బౌద్ధ ఆరామాలను ధ్వంసం చేసి ఆ శిథిలాల మీద హిందూ దేవాలయాలు నిర్మించారన్న వాదన కూడా ఉంది. అందుకే గుడులు తవ్వకుంటూ వెళ్లడం కాదు, సత్యం కోసం మనల్ని మనం తవ్వకుంటూ ముందుకు వెళ్లాలి. బౌద్ధ ధర్మమే ఈ దేశానికి అసలు సిసలు సాంస్కృతిక ప్రత్యామ్నాయ ధర్మం. బౌద్ధ తత్వమే అసలైన లౌకికత్వం. బౌద్ధం ఒక అత్యుత్తమ మానవ జీవనశైలి. దైవం చుట్టూ జరిగే మాయామర్మాలు ఇందులో లేవు కనుక దాన్ని మతంగా స్వీకరించినా తప్పు లేదు. కమ్యూనిజం చెప్పే భౌతికత, బుద్ధిజం చెప్పే నైతికతల విలువైన మానవీయ మేళవింపే లౌకికత. కమ్యూనిస్టులు, నాస్తిక హేతువాద విప్లవ సంఘాలవారు ఎవరైనా బౌద్ధాన్ని ఒక జీవన మార్గంగా మలచుకోవచ్చు. లౌకికత్వం ఒక పదం కాదు, అనేక యుగాలుగా అనేక త్యాగాలతో మన పెద్దలు నిర్మించిన పథం ఇది. ఇదే ఈ దేశానికి ఇప్పటికీ ఎప్పటికీ ఏకైక దారి దీపం.

• డా. ప్రసాదమూర్తి
కవి, జర్నలిస్టు



అంగరంగుల వైభవంగా..



పెనుగంచిప్రోలు గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతల రంగుల మహోత్సవం శుక్రవారం జగ్గయ్యపేటకు చేరుకుంది. వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఎడ్లబండ్లపై కొలువుదీరిన దేవతామూర్తులను దర్శించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

- 6లో..

జిల్లాలో మరో నయా మోసం

బాకీల బావ

కొత్త వ్యక్తిగా పరిచయం.. ఇంట్లో మనిషిగా స్నేహం

మాటలు కలిపి పరిచయం పెంచుకుంటాడు. కొద్దినెలలకు ఇంట్లో మనిషిలా కలిసిపోతాడు. బంధుత్వం లేకపోయినా వరసలు కలిపి.. 'బావ' అని పిలుస్తాడు. ఇంటికి వెళ్లి చొరవగా భోజనం చేసే వరకూ వెళ్తాడు. ఆ తర్వాత చిన్న సెటిల్‌మెంట్ ఉందని చేబదులు తీసుకుంటాడు. ఇస్తానన్న సమయానికి అదనంగా మరికొంత చేర్చి బాకీ తీర్చేస్తాడు. లక్షల నుంచి మొదలైన వ్యవహారాన్ని ఇసుక, ఇనుములో రూ.కోట్లలో పెట్టుబడి పెట్టే వరకు తీసుకెళ్తాడు. ఇదంతా వింటుంటే.. 'బావ కాని బావ ఇంత మంచివాడా..' అనిపిస్తుంది. ఆ తర్వాత అసలు సినిమా చూపిస్తాడు. స్నేహంతో మొదలై.. బంధుత్వాలను కలుపుకొన్న ఈ బాకీల బావ చివరికి డబ్బుతో జంప్ అవుతాడు. ఇతగాడి ఉచ్చులో పడి నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

- 'బావ..' అంటూ బంధుత్వం
- మొదట అప్పు తీసుకుని వడ్డీ సహా చెల్లింపు
- ఇసుక, ఇనుము తక్కువకు ఇప్పిస్తానని మాటలు
- రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టాక డబ్బుతో జంప్
- నగరానికి చెందిన ఓ బాధితుడు ఆత్మహత్య
- నిందితుడు విశాఖలోని మధురవాడవాసి
- రాష్ట్రవ్యాప్తంగా రూ.కోట్లలో వసూలు.. టోకరా

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విశాఖపట్నంలోని మధురవాడకు చెందిన ఆదర్ల వెంకటరెడ్డి నిత్యం వివిధ నగరాలకు తిరుగుతుంటాడు. తన కామన్ ఫ్రెండ్స్ ద్వారా కొంతమందితో పరిచయం పెంచుకుంటాడు. నెల రోజుల పాటు స్నేహంగా మాట్లాడిన తర్వాత అవతలి వ్యక్తులను 'బావ' అని సంబోధిస్తాడు. నెమ్మదిగా వారి ఇళ్లకు వెళ్లడం మొదలుపెడతాడు. ఆ తర్వాత కొన్నిరోజులకు ఆ ఇంట్లోనే భోజనం చేస్తాడు. కుటుంబ సభ్యులందరితో పరిచయం పెంచుకుంటాడు. ఆ తర్వాత తనకు సమస్య వచ్చిందని చెప్పి రూ.3 లక్షల నుంచి రూ. 4 లక్షలు అప్పుగా తీసుకుంటాడు. గడువు నాటికి తీసుకున్న మొత్తానికి మరో రూ.లక్షను కలిపి వారి చేతుల్లో పెడతాడు. ఈవిధంగా రెండు, మూడుసార్లు చేయడం ద్వారా అప్పు ఇచ్చిన వారిలో బలమైన నమ్మకాన్ని కలిగిస్తాడు. ఇచ్చిన డబ్బు వెనక్కి రావడంతో పాటు అదనంగా ఎంతో కొంత వస్తుండడంతో వెంకటరెడ్డిని చాలామంది నమ్మారు. ఇలా నగరానికి చెందిన ఒక వ్యక్తితో పరిచయం పెంచుకుని తక్కువ ధరకు విశాఖలో ఇనుము, ఇసుక ఇప్పిస్తానని చెప్పి రూ.2 కోట్ల వరకు వసూలు చేసి ఇప్పుడు జంప్ అయ్యాడు. ఇసుక, ఇనుము రాకపోగా, డబ్బు పోగొట్టుకుని ఆ కుటుంబం ఇప్పుడు రోదిస్తోంది.

ఇలా వెంకటరెడ్డి చేసిన మోసానికి ఓ వ్యక్తి కొన్నాళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు ఆదర్ల వెంకటరెడ్డి కారణమంటూ లేఖ కూడా రాశాడు.

ప్రముఖులతో ఫొటోలు

వెంకటరెడ్డి తనను తాను బడావ్యక్తిగా చూపించుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించుకున్నాడు. ప్రముఖులు, రాజకీయ నేతలతో దిగిన ఫొటోలను అందరికీ చూపించేవాడు. వారి ఇళ్లలో భోజనాలు చేసిన సమయంలో, కూర్చుని మాట్లాడుతున్న సమయంలో ఫోన్ వస్తే ఎమ్మెల్యే, ఎంపీ, ఐఏఎస్ అధికారి అంటూ నమ్మించేవాడు. ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి భార్య పోలీసులను ఆశ్రయించిన తర్వాత వెంకటరెడ్డి వ్యవహారాలు బయటకొచ్చాయి. బాధితులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు కొంతమంది నందిగామలో ఉన్నట్టు సమాచారం.



ఎవరెటు..



రెండు జిల్లాల వైసీపీ అభ్యర్థుల ఎంపికలో అయోమయం

- అవనిగడ్డలో సింహాద్రి చంద్రశేఖర్‌రావు డౌటే..!
- ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్.. కొత్తగా సింహాద్రి వికాస్ పేరు
- పెనమలూరులో జోగి రమేశ్ పోటీ చేస్తారా..?
- వసంత పార్టీ వీడనుండటంతో మైలవరంపై జోగి కన్ను

అనూహ్యంగా తెరపైకి సర్నాల తిరుపతిరావు

- పశ్చిమలో ఆసిఫ్ సీటుపైనా సవాలక్ష సందేహాలు
- కేశినేని నానీకి ఎంపీ సీటు ఇస్తారో లేదో అనుమానమే
- ఇవ్వకపోతే కేశినేని శ్వేతకు పశ్చిమ లేదా మైలవరం..?

అయోమయం జగన్నాథం.. అన్నట్టుంది వైసీపీలో ప్రస్తుత పరిస్థితి. నేడు ప్రకటించిన అభ్యర్థులు రేపటికి ఉంటారో, లేదో, కీలకమైన స్థానాల్లో సిటింగ్‌లుగా ఉన్నవారు ఎన్నికల సమయానికి స్థిరంగా ఉంటారో, జంప్ అవుతారో తెలియని అయోమయ స్థితి రాజ్యమేలుతోంది. కొత్తగా నియమించిన ఇన్‌చార్జులన్నా చివరి వరకు నిలబడతారా.. అంటే సందేహమే సమాధానమవుతోంది. ఇదంతా ఒక ఎత్తయితే ఇన్‌చార్జిగా నియమించిన వ్యక్తే పార్టీ పెద్దలకు అందుబాటులోకి రాని చిత్రమైన పరిస్థితి.. ఎన్నికల ముందు కేడర్‌లో అనిశ్చితికి కారణమవుతోంది.



వైసీపీ మైలవరం ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రెండు జిల్లాల వైసీపీ శ్రేణుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. కృష్ణాజిల్లాలో ఏడు స్థానాలకు గానూ నాలుగింటిలో అభ్యర్థులను ఖరారు చేస్తూ పార్టీ అధికారిక ప్రకటన చేసింది. మచిలీపట్నం, పెడన, పెనమలూరు, అవనిగడ్డ స్థానాలకు ఇన్‌చార్జులను ఖరారు చేయగా, అవనిగడ్డ ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావు పార్టీ అధిష్ఠానానికే టచ్‌లో లేకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేశారు. ఆయనతో పూర్తిస్థాయిలో సంప్రదించకుండా, తుది నిర్ణయాన్ని చెప్పకుండానే వైసీపీ పెద్దలు ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారని చంద్రశేఖర్‌రావు సన్నిహితులు చెబుతున్న మాట. అవనిగడ్డ సిటింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి సింహాద్రి రమేశ్ ఉద్దేశపూర్వకంగానే వైసీపీ పెద్దలను తప్పుదారి పట్టించారన్న ప్రచారం కూడా జరిగింది. రమేశ్ తనయుడు వికాస్‌కు అవనిగడ్డ ఎమ్మెల్యే సీటు ఇప్పించే ప్రక్రియలో భాగంగా ఆయనే చంద్రశేఖర్‌రావును అవనిగడ్డ స్థానానికి ప్రతిపాదించారని, పోటీకి ఆయన సుముఖంగా ఉన్నారని వైసీపీ పెద్దలను నమ్మించారని చెబుతున్నారు. చంద్రశేఖర్‌రావు పోటీకి విముఖత చూపుతారు.. చివరికి తన కుమారుడే అభ్యర్థిగా నిలబడతాడన్న వ్యూహంతో రమేశ్ వైసీపీ పెద్దలను పక్కదారి పట్టించినట్లు వైసీపీ శ్రేణుల్లోనే చర్చ జరుగుతోంది. కాబోయే ఎమ్మెల్యే సింహాద్రి వికాస్ అంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం కూడా ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

జోగి.. ఎటువైపు..?

పెనమలూరు ఇన్‌చార్జిగా నియమితులైన మంత్రి జోగి రమేశ్ ఆ స్థానం నుంచి బరిలో ఉండకపోవచ్చన్న ప్రచారం జరుగుతోంది. తొలి నుంచి మైలవరం నుంచి పోటీకి తహతహలాడుతున్న జోగికి తాజాగా వసంత పార్టీని వీడనుండటంతో లైన్‌క్లియర్ అయ్యింది. అయితే, మైలవరం ఇన్‌చార్జిగా సర్నాల తిరుపతిరావు పేరును వైసీపీ గురువారం ప్రకటించింది. మైలవరం జెడ్పీటీసీగా ఉన్న తిరుపతిరావు ఆర్థికంగా బలహీనుడు. అలాంటి వ్యక్తిని అభ్యర్థిగా వైసీపీ చివరికి వరకు కొనసాగిస్తుందా అనేది అనుమానమే. చివరిగా జోగి రమేశ్ ఇక్కడ బరిలో ఉంటారని వైసీపీ శ్రేణులే బలంగా చెబుతున్నాయి. ఆర్థికంగా బలమైన వ్యక్తిని ఇక్కడ ఇన్‌చార్జిగా తీసుకొస్తే తనకు ఏకుమేకు అవుతాడన్న ఉద్దేశంతో జోగి రమేశ్ హడావుడిగా తిరుపతిరావును పార్టీ అధినేత జగన్ వద్దకు తీసుకెళ్లి మైలవరం ఇన్‌చార్జిగా ప్రకటింపజేశారని చెబుతున్నారు. ఎన్నికల సమయానికి తిరుపతిరావును సైడ్ చేసి జోగి రమేశ్ ఎంట్రీ ఇస్తారన్న ప్రచారం బలంగా జరుగుతోంది.

పశ్చిమలో ఆసిఫ్ ఉన్నట్టా లేనట్టా..?

పశ్చిమలోనూ షేక్ ఆసిఫ్ చివరి వరకు అభ్యర్థిగా నిలవడం అనుమానమేనని సమాచారం. ఆయన స్థానంలో మరో వ్యక్తిని తెరపైకి తెస్తారన్న ప్రచారం జరుగుతోంది.

కేశినేని నానీకి హ్యాండ్ ఇస్తారా?

వైసీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థిగా కేశినేని నాని పేరు ప్రకటించినా ఎన్నికల సమయానికి ఆయన స్థానంలో ఆర్థికంగా బలమైన వ్యక్తిని తెరపైకి తెచ్చే అవకాశం లేకపోలేదని వైసీపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. నానికి ఎంపీగా చేయిచ్చే పక్షంలో ఆయన కుమార్తె శ్వేతకు అసెంబ్లీ టికెట్ ఇస్తారని సమాచారం. విజయవాడ పశ్చిమ లేదా మైలవరం స్థానాల్లో ఒకటి నాని కుటుంబానికి కేటాయించి, ఆయనకు మొండిచేయి చూపుతారన్న ప్రచారం జరుగుతోంది.

గాంధీ కో ఆపరేటివ్‌లో తన్నులాట..!

- అవిశ్వాసంలో మరో మలుపు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గాంధీ కో-ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్‌పై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం రోజుకో మలుపు తిరుగుతోంది. అవిశ్వాసం నెగ్గకుండా చూసేందుకు ఛైర్మన్ వేమూరి వెంకట్రావు ప్రయత్నాలు చేస్తుండగా, ఎలాగైనా అవిశ్వాసం నెగ్గి ఛైర్మన్‌ను గద్దె దించాలని డైరెక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. అవిశ్వాసంపై ఇరుపక్షాలకు సర్దిచెప్పేందుకు రెండు రోజుల క్రితం నగరానికి చెందిన ఓ పెద్దమనిషి వద్ద బ్యాంకు ఛైర్మన్, డైరెక్టర్లు ఏకే అన్సారీ, సగ్గుర్తి నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరుపక్షాలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నం చేస్తుండగా, ఛైర్మన్.. డైరెక్టర్లను దూషిస్తూ దాడికి ప్రయత్నించడంతో ఈ పంచాయితీ అర్ధంతరంగా ముగిసినట్లు సమాచారం. 30 ఏళ్లుగా డైరెక్టర్లుగా ఉన్నవారి విషయంలో ఛైర్మన్ వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని మిగిలిన బ్యాంకు డైరెక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు అవిశ్వాసానికి కారణమైన బ్యాంకు కొత్తశాఖ ఏర్పాటుపై సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఈ సమయంలో బ్యాంకు శాఖ ఏర్పాటుకు భవన యజమానితో ఎలాంటి ఒప్పందం లేకుండా డబ్బు చెల్లించడం, పనుల కోసం సుమారు రూ.33 లక్షలు వెచ్చించడం తప్పేనని సీఈవో, ఛైర్మన్ అంగీకరించడం గమనార్హం. ఈ మేరకు నివేదిక సిద్ధం చేసినా విచారణాధికారి తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారికి సమర్పించినట్లు తెలుస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈనెల 12న జరిగే అవిశ్వాసంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

కిడ్నీ వ్యాధితో మృతి

ఎ.కొండూరు, ఫిబ్రవరి 2 : పదిహేనేళ్లుగా కిడ్నీ వ్యాధితో పోరాడుతూ ఓ వ్యక్తి తుదిశ్వాస విడిచాడు. మండలంలోని రేపూడి తండాకు చెందిన వడిత్యా కృష్ణ (47) అనే వ్యక్తి యుక్త వయసులోనే కిడ్నీ వ్యాధికి గురయ్యాడు. వైద్యుల సలహా మేరకు మందులు వాడుతున్నాడు. కియాటిన్ శాతం అధికంగా ఉండటంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పదిహేనేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇందుకోసం తన భూమిని అమ్ముకుని మరీ వైద్యం చేయించుకున్నాడు. కృష్ణకు ఆరోగ్యం క్షీణించడంతో రెండు రోజుల క్రితం విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహానికి సీపీఎం నేతలు ఆనందరావు, వెంకటేశ్వరరావు, అమ్మిరెడ్డి నివాళులర్పించారు.



వి.కృష్ణ (ఫైల్)

6 నుంచి తుమ్మలపల్లిలో భారత్ రంగస్థల మహోత్సవ్

- దేశ విదేశాలకు చెందిన 100 నాటకాల ప్రదర్శన

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ ఢిల్లీరావు వెల్లడి

- 6లో..



అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు

మద్దూరు రేవులో చెలరేగిన ఇసుక మాఫియా

- వేలాది లారీల ఇసుక తరలింపు
- అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- రాత్రి 11 గంటల సమయంలో ఉద్రిక్తత

- 6లో..

శుక్రవారం రాత్రి 11 గంటలకు బోడె నిరసన

ప్రైమరీ టీచర్లకు జీతాలు బంద్

- 150 మందితో ట్రెజరీ, విద్యాశాఖ బంతాట
- నిబంధనల పేరిట కాలయాపన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో 150 మందికిపైగా ప్రైమరీ టీచర్లకు ఇంతవరకు గతనెల జీతాలు పడలేదు. మళ్లీ ఒకటో తారీఖు వచ్చినా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ వ్యవహారాన్ని ఇటు విద్యాశాఖ, అటు ట్రెజరీ శాఖ బంతాటగా మార్చుకుంది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రైమరీ టీచర్ల జీతాలను మొదట్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ చూసేది. ఆ తర్వాత విజయవాడ నగరాన్ని నార్త్, ఈస్ట్, వెస్ట్, సెంట్రల్‌గా విడగొట్టారు. గతంలో మాదిరిగా డీఐ కాకుండా ఒక్కో డివిజన్‌కు కొత్తగా ఎంఈవోలను ఇచ్చారు. ఇలా నాలుగు మండలాలకు నాలుగు ఎంఈవోలను కేటాయించారు. వీరికి సొంతంగా జీతాలిచ్చే అధికారం లేదు. జిల్లా విద్యాశాఖాధికారి ద్వారానే వీరు టీచర్లకు జీతాలివ్వాలి. ఈ క్రమంలో నగరంలోని నాలుగు డివిజన్లకు వేరేచోట పనిచేసే వారికి ఇక్కడ ఎఫ్ఏసీలుగా ఇచ్చారు. నార్త్, వెస్ట్, ఈస్ట్ డివిజన్లకు మాత్రమే ఎంఈవోలను ఎఫ్ఏసీలుగా నియమించారు. సెంట్రల్ డివిజన్‌కు మాత్రం రెగ్యులర్ ఎంఈవోను కేటాయించారు. ఇక్కడే సమస్య తలెత్తింది. విజయవాడ సెంట్రల్ డివిజన్‌కు సంబంధించి ప్రైమరీ టీచర్ల జీతాల బిల్లును ట్రెజరీ శాఖ అంగీకరించటం లేదు. దీంతో ప్రైమరీ ఉపాధ్యాయులు ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు. రెగ్యులర్ ఎంఈవోను ఇచ్చిన నేపథ్యంలో డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో) అధికారాన్ని కలిగి ఉంటాడని, జీతాలు పెట్టే అధికారం రెగ్యులర్ ఎంఈవోకు ఉంటుందని చెప్పి పంపారు. ఈ విషయాన్ని ట్రెజరీ అధికారులు ఒప్పుకోలేదు. తమ రూల్స్ ప్రకారం రెగ్యులర్ ఎంఈవో అయినప్పటికీ ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ఇస్తేనే జీతాలు చేయగలమని చెప్పారు. దీంతో మళ్లీ ఉపాధ్యాయులు డీఈవో దగ్గరకెళ్లారు. రెగ్యులర్ ఎంఈవోకు ఎఫ్ఏసీ ఎలా ఇస్తామని డీఈవో ప్రశ్నించి పంపించారు. జిల్లా విద్యాశాఖాధికారి చెప్పిన విషయాన్ని ట్రెజరీ అధికారులు అంగీకరించటం లేదు. దీంతో విజయవాడ సెంట్రల్ మండలం పరిధిలోని ఎయిడెడ్, మునిసిపల్ టీచర్లు 150 మందికి పైగా జీతాలు రాలేదు. ప్రశాంతంగా డీఐల పర్యవేక్షణలో సాగే వ్యవస్థను నాలుగు డివిజన్ల పేరుతో ఎంఈవోలుగా ప్రభుత్వం విభజించడం వల్లే ఈ సమస్య వచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి.


జగ్గయ్యపేటకు వచ్చిన అమ్మవారు, పరివార దేవతల వాహనాలు

జగ్గయ్యపేటకు చేరిన తిరుపతమ్మ, గోపయ్యల పరివారం

» ఘనంగా స్వాగతం పలికిన భక్తులు, దీక్షాస్వాములు



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 2 : రంగుల మహోత్సవానికి శుక్రవారం సాయంత్రం పెనుగంచిప్రోలు గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతలు జగ్గయ్యపేటకు చేరుకున్నారు. పెనుగంచిప్రోలులో బయల్దేరి మక్కపేట, చిల్లకల్లు మీదుగా ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండ్లపై అమ్మవార్లను సాంప్రదాయబద్ధంగా జగ్గయ్యపేటకు తీసుకువచ్చారు. దేవస్థానం పాలక మండలి సభ్యులు, ఇవో, స్థానిక రంగుబజార్ ఉత్సవ కమిటీ సభ్యులు దేవతామూర్తులను రామాలయంలో ఉంచారు. అనంతరం వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పీఠంపై అధిష్ఠింప చేశారు. దేవతామూర్తులను ఎడ్లబండ్లపై తీసుకువచ్చే సమయంలో తాకేందుకు దీక్షాస్వాములు, భక్తులు ఎగబడ్డారు. ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. హెచ్‌పీ గ్యాస్ డీలర్, అన్నపూర్ణ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రయిటర్ అప్పన రామ్‌కుమార్ భక్తులకు అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఊరేగింపులో దేవస్థానం చైర్మన్ జంగాల వాసు, ఇఓ కె.రమేష్ నాయుడు, ఆకుల బాజీ, దేవస్థాన కమిటీ సభ్యులు దేవరకొండ పద్మ, చిన్ని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


దివ్యసత్ప్రసాదంతో మరియమాత గుహకు చేరుకుంటున్న గురువులు

మత సామరస్యానికి ప్రతీక గుణదల పుణ్యక్షేత్రం

» మూడో రోజుకు నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 2 : గుణదలమాత పుణ్యక్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని గుంటూరు మేత్రాసనం ఫాదర్ గోవిందు రాయన్న అన్నారు. గుణదలమాత నూరు వసంతాల నవదిన ప్రార్థనల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన నవదిన ప్రార్థనల కార్యక్రమానికి ఫాదర్ గోవింద్ రాయన్న ముఖ్యఅతిథిగా విచ్చేశారు. భక్తులను ఉద్దేశించి ఆయన సందేశమిస్తూ.. మరియమాతను దేవుడు ఆధ్యాత్మిక తల్లిగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మరియతల్లిని ఆశ్రయించిన కష్టాలు తీరతాయని చెప్పారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ.. ఈ యేడాది ఉత్సవాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోట సునీల్ రాజు గురువులు దివ్యసత్ప్రసాదంతో కొండపైకి పాదయాత్రగా వచ్చారు. అనంతరం దివ్యపూజాబలి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్స్ కతెడ్రల్, కార్మెల్‌నగర్, రాణిగారితోట తదితర విచారణల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.


భారత్ రంగస్థల మహోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

6 నుంచి తుమ్మలపల్లిలో భారత్ రంగస్థల మహోత్సవ్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 2 : ఈనెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు విజయవాడలో 23వ భారత్ రంగస్థల మహోత్సవ్-ఇంటర్నేషనల్ థియేటర్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా-2023 నాటకాల ప్రదర్శన జరగనుందని, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఢిల్లీరావు, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు, జేసీ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి భారత్ రంగస్థల మహోత్సవ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రంగస్థల కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) దేశ విదేశాల నుంచి 100 నాటకాలను ఎంపిక చేసి దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 6 నుంచి 11 వరకు విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నాటక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి నాటక ప్రదర్శన వుంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు, కళాకారులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నాస్తికోద్యమానికి గోరా సేవలు అమూల్యం : ఢిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 2 : సానుకూలంగా ఆలోచించే ఏ వ్యక్తి అయినా దేవుడు ఉన్నాడు, లేడు అనే విషయంతో సంబంధం లేకుండా సమాజంలోని వ్యక్తుల ప్రయోజనాల కోసమే పనిచేస్తారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. భారతదేశ నాస్తికోద్యమ పితామహుడు గోపరాజు రామచంద్రరావు (గోరా) ఐదు దశాబ్దాల క్రితం 1972లో రచించిన ఆంగ్ల పుస్తకం 'పాజిటివ్ ఆథీజం' తెలుగు అనువాదాన్ని బెంజ్‌సర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో శుక్రవారం జరిగిన సభలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశ నాస్తికోద్యమానికి గోరా గొప్ప చిరునామాగా నిలిచారన్నారు. దైవత్వం వ్యక్తులకు ఆపాదించడాన్ని వ్యతిరేకించడమే నాస్తికత్వానికి ఆలంబన అని గోరా గాఢంగా నమ్మేవారన్నారు. సమాజంలోని వ్యక్తుల ప్రయోజనాలను కాపాడలేని వారిని విగ్రహాల రూపంలో ఆరాధించడం తప్పుడు అభిప్రాయమని నమ్మిన ఎంతోమందిని ఆ రోజుల్లోనే గోరా చాలా ప్రభావితం చేశారని గుర్తు చేశారు. అంతిమంగా సంఘ ప్రయోజనాలను కాపాడటమే నాస్తికత్వానికి వున్న అతి పెద్ద లక్ష్యంగా ఆయన సాధించిన ఉద్యమం నేటికీ నిరాఘాటంగా కొనసాగడం, ఈ ఉద్యమాన్ని వారి కుటుంబసభ్యులు మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమన్నారు.

జీవితం ధన్యమైంది : డాక్టర్ సమరం

పుస్తక అనువాద కర్త డాక్టర్ సమరం మాట్లాడుతూ, నాస్తికత్వాన్ని జీవిత విధానంగా మలుచుకొని ఎంతో శ్రమించి గోరా పాజిటివ్ ఎథీజం పుస్తకాన్ని రచించారని, ఆయన భావాలకు అద్దం పట్టేలా తెలుగులో అనువదించే అవకాశం రావడంతో జీవితం ధన్యమైందని భావిస్తున్నానన్నారు. సామాజిక సమానత్వం మనిషి స్వేచ్ఛ ఆర్థిక సామాజిక వ్యవస్థల మార్పునకు నాస్తికత్వం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గోరా కుటుంబసభ్యులు డాక్టర్ మారు, జి.రష్మి, జి.నియంత, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి గోళ్ల నారాయణరావు, ప్రముఖ నాస్తికులు నార్నే వెంకట సుబ్బయ్య, మోతుకూరి అరుణ్‌కుమార్, స్వాతంత్ర్య సమరయోధులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గోరా అభిమానులు పాల్గొన్నారు.

ప్రముఖ హోమియో వైద్యుడు పద్మనాభం మృతి



గుడివాడ, ఫిబ్రవరి 2 : హోమియో వైద్యరంగ పితామహుడు, అంతర్జాతీయ హోమియో వైద్యుడు డాక్టర్ కేవీపీ పద్మనాభం(85) శుక్రవారం మృతి చెందారు. 64 ఏళ్ల పాటు హోమియోరంగంలో ఆయన సుదీర్ఘ సేవలందించి దేశవ్యాప్తంగా ప్రత్యేకఖ్యాతి గడించారు. హోమియో వైద్యం అభివృద్ధికి అనేక సూచనలు చేసిన ఆయనకు భారత ప్రభుత్వం విశిష్ట అవార్డులతో సత్కరించింది. రాష్ట్రపతి వీవీ గిరి హయాంలో ఏర్పాటు చేసిన వైద్యుల ప్యానల్‌లో డాక్టర్ పద్మనాభం అడ్వైజర్‌గా సేవలందించారు.

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

» కృష్ణా కలెక్టర్ రాజాబాబు



మచిలీపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎంకే మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితాల నవీకరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1763పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు తగు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ వీడియోగ్రఫీ, వెబ్ టెలికాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు చేసేందుకు ఎన్నికల వ్యయం లెక్కింపు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల సమయంలో మద్యం, నగదు రవాణా అరికట్టేందుకు నిఘా ఏజెన్సీలను కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల విభాగం అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కృష్ణలంక : సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో బీహెచ్.భవానీశంకర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి హాజరయ్యారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఓటర్ల తుది జాబితా ప్రచురణ అనంతరం వివిధ ఫారాల పరిష్కారం, అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు, పోలింగ్ స్టేషన్లు, కనీస వసతుల కల్పన, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ తదితర అంశాలపై సీఈవో పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలోని సన్నద్ధతా కార్యకలాపాలను కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎలక్షన్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్, నానిల శ్రద్ధ దోచుకోవడంపైనే..

» వెనిగండ్ల, రావి ఎద్దేవా


బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల, రావి తదితరులు

గుడివాడ, ఫిబ్రవరి 2 : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నానిలకు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంపై లేదని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆరోపించారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండలం కౌతవరంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెనిగండ్ల, రావిలు మాట్లాడుతూ, దోచుకోవడమే లక్ష్యంగా జగన్ అండ్ కో పాలన సాగించిందన్నారు. దగాకోరుల ప్రభుత్వాన్ని పారద్రోలి, ప్రజల మేలుకోరే టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. గుడివాడ అభివృద్ధి పట్ల చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, శాయన పుష్పావతి, కొసరాజు బాపయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

కేశినేని నానీ.. ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలువ్

» ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హితవు

పటమట, ఫిబ్రవరి 2 : కేశినేని నాని ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలవాలని గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాని ఎంపీగా పోటీ చేయడం వల్లే తూర్పులో తాను ఎమ్మెల్యేగా గెలిచానని, నాని లేకపోతే తాను జీరో అని.. అన్న నాని వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. పార్టీ మారితే వ్యక్తిత్వం దిగజారుతుందనడానికి కేశినేని నాని దిగజారుడు వ్యాఖ్యలే నిదర్శనమన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతోనే ఆయన శక్తిని చూసేందుకు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని కోరుతున్నానన్నారు. జగన్‌కు అభివృద్ధి అంటే తెలియదని చెప్పిన మాటలు నాని మర్చిపోయారా అని ప్రశ్నించారు. పదవుల కోసం వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోవద్దని.. ఒక మిత్రుడిలా నానికి సలహా ఇస్తున్నానని అన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ తవ్వకాలు

» అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

చోడవరం/మద్దూరు (కంకిపాడు), ఫిబ్రవరి 2 : అర్ధరాత్రి ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తుంటే అధికారులు నిద్రపోతున్నారా అంటూ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనమలూరు మండలంలోని చోడవరం, కంకిపాడు మండలం మద్దూరు ఇసుక రేవులో అర్ధరాత్రి 11 గంటల సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు ఎమ్మెల్యే చోడవరం వెళ్లి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే అనుచరులు అర్ధరాత్రి సమయంలో పెనమలూరు, కంకిపాడు మండలాల్లో ఇసుక తవ్వకాలు జరుపుతుంటే అధికారులు నిద్ర మొద్దు నిద్ర వహిస్తున్నారా అని మండిపడ్డారు. ఇసుక తరలింపు ఆపే వరకు కదిలేది లేదని భీష్మించుకొని కుర్చున్నారు. అటు మైనింగ్ ఇటు రెవెన్యూ అధికారులు అక్రమ తవ్వకాలకు ఎవరు పాల్పడుతున్నారన్న దానిపై స్పష్టత లేదంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. భారీ పొక్లెయినర్ల సాయంతో అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోగి రమేశ్‌ను ఇన్‌చార్జిగా పెట్టి పది రోజులు కాకుండానే వేల లారీలతో బిల్లులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎటువంటి మైనింగ్ జరగకుండా మంత్రి జోగి అనుచరుడు ఫిరోజ్ ఎందుకు పారిపోయాడని ప్రశ్నించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే అడ్డుకుంటామన్నారు. దీనిపై ఉపేక్షించేది లేదని మంత్రి జోగిని హెచ్చరించారు. సంబంధిత శాఖ అధికారులు వచ్చిన చర్యలు తీసుకునేంత వరకు కదిలేది లేదని హెచ్చరించారు.

మెగా డీఎస్సీ పేరుతో జగన్ రెడ్డి మెగా దగా!


వినతి పత్రం ఇస్తున్న నేతలు

వన్‌టౌన్ ఫిబ్రవరి 2: మెగా డీఎస్సీ హామీతో ఏపీ సీఎం జగన్‌రెడ్డి మెగా దగా చేశాడని తెలుగు యువత నేతలు విమర్శించారు. మెగా డీఎస్సీ అంటూ ఇచ్చిన హామీని తుంగలో తొక్కినందుకు నిరసనగా తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద చెవిలో పూలు, చేతిలో కొబ్బరికాయలు పట్టుకుని టీఎస్ఎన్ఎఫ్, తెలుగు యువత నేతలు శుక్రవారం నిరసన తెలిపారు. తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు నాగూర్‌వలీ మాట్లాడుతూ ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ యువతను జగన్‌రెడ్డి మోసం చేశాడన్నారు. డీఎస్సీ పేరుతో మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యాడన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధికారప్రతినిధి సజ్జా అజయ్, పశ్చిమ తెలుగు యువత నేత ఆర్ మాధవ, నూతలపాటి నాగభూషణం, ఈపూరి వినోద్, చింతోటి మురళి, షేక్ గాలిషా పైలా సతీష్‌బాజీ, కుప్పిలి నాగబాబు, ధనేకుల హరికృష్ణ, శివ, రామచంద్ర,బాను,రాజు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు.

అలరించిన త్యాగరాజస్వామి కీర్తనలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 2: ఎంత నే వర్ణింతు.. దుడుకుగల నన్నే దొర.. తొలినేజేసిన పూజాఫలము.. ఒంటి త్యాగరాజస్వామి కీర్తనలతో సంగీత కళాశాల ఆవరణ పులకించింది. సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధన సంగీతోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం 18 బృందాలు కచేరీలు నిర్వహించాయి. బుర్ర శ్రీ సాయి రాధాకృష్ణ కార్తీక్, తిరుపతికి చెందిన పారుపల్లి ఉజ్వల కార్తికేయ, హైదరాబాద్‌కు చెందిన డీవీఆర్ సీత యశస్విని మేడూరు హంసినీ గాత్రత్రయం, రాజమండ్రికి చెందిన ఎనమండ్ర శ్రీనివాస శర్మ గాత్రం, హైదరాబాద్‌కు చెందిన మంగళంపల్లి స్వర్ణ, ఎంబీఎస్ గీతిక, ఎన్వీఎస్ కీర్తనల గాత్ర యుగళం, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థుల బృంద గాత్ర కచేరీ, గుడివాడకు చెందిన కొత్తపల్లి శ్రీదేవి ప్రవల్లిక గాత్ర కచేరీ, మల్లాది శివానంద, ఎస్ఎస్‌వీ గాత్ర కచేరీ, వేమూరి వెంకట విశ్వనాథ్ గాత్ర కచేరీ, ఎం.అంజనా సుధాకర్ గాత్ర కచేరీలతో శ్రోతలను శ్రవణానంద పరిచారు. శ్రీకాకుళానికి చెందిన సుందరపల్లి శ్రీనివాస్ సాక్సోఫోన్ వాద్య కచేరీ, హైదరాబాద్‌కు చెందిన ఈమని లలితా కృష్ణ గోటు వాయిద్య కచేరీ, ఎ.శృతి, శంకరి, ఎం.సాయిహర్షిని వీణాత్రయ వాద్య కచేరీ, పారుపల్లి విభానం పారుపల్లి ప్రభావం మాండలిన్, వేణు వాద్య కచేరీ, హైదరాబాద్‌కు చెందిన గాయత్రి, వి.హార్షిని వీణాద్వయ కచేరీ, ఎస్.పూర్ణిమ వీణా ద్వయ కచేరీ, టీఎస్ పూర్ణిమ వేణు వాదనం రసజ్ఞులను రంజింపచేశాయి. మోదుమూడి సుధాకర్, జొన్నవిత్తుల ప్రభాకర్ శాస్త్రి, పోపూరి గౌరీనాథ్, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

నేడే వడ్లపూడి బాబా మందిర వార్షికోత్సవం

» పెదవడ్లపూడిలో తిరునాళ్ల వాతావరణం

» సాయి నామస్మరణతో మార్మోగిన గ్రామం

» ఏర్పాట్లను పర్యవేక్షించిన పాతూరి



భగవాన్ శ్రీ సత్య షిరిడీ సాయిబాబా, అన్న సంతర్పణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి, ఫిబ్రవరి 2 : మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిర వార్షికోత్సవం శనివారం జరుగనుంది. ప్రతియేటా ఫిబ్రవరి మూడవ తేదీన మందిర వార్షికోత్సవాన్ని గ్రామంలో భారీ తిరునాళ్లగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. పెదవడ్లపూడి ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచింది. 2006లో అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్‌గా వున్న పాతూరి నాగభూషణం స్వగ్రామమైన పెదవడ్లపూడిలో షిర్డి సాయిబాబా మందిరాన్ని మంగళగిరి-తెనాలి రోడ్డు వెంబడి నిర్మించారు. మందిరంతో పాటు దానిపక్కనే విష్ణ్వేశ్వరస్వామి ఉపాలయాన్ని నిర్మించారు. అప్పటినుంచి బాబావారి ఉత్సవ వేడుకలతోపాటు ప్రతియేటా మందిరాన్ని ఆరంభించిన ఫిబ్రవరి మూడవ తేదీన ఆలయ వార్షికోత్సవం పేరిట గ్రామంలో ఉత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఉత్సవానికి అటు ఆధ్యాత్మికతను, ఇటు సాంస్కృతిక వైభవాన్ని మేళవించి దీనినో భారీ తిరునాళ్ల మాదిరి జరిపిస్తున్నారు. మందిరానికి ఎదురుగా ఓ ప్రత్యేక గోశాలను కూడ ఏర్పాటు చేయించి మందిర విశిష్టతను మరింత ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. భగవాన్ శ్రీసత్య షిరిడి సాయిబాబా మందిర 18వ వార్షికోత్సవానికి అన్నీ ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రానికే పూర్తిచేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం గత రెండు రోజులుగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మందిరానికి ఎదురుగా వున్న ఖాళీస్థలంలో సాంస్కృతిక కళావేదిక ప్రాంగణం, దాని పక్కనే అన్న ప్రసాదశాలను ఏర్పాటు చేయించారు. శనివారం తెల్లవారుజాము అయిదు గంటల నుంచే బాబావారి విగ్రహానికి వివిధ అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. పెద్దఎత్తున అన్నవితరణకు ఏర్పాట్లను చేశారు.



న్యాయవాదుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కేశినేని చిన్ని, గద్దె అనురాధ

భూ హక్కు చట్టంతో సివిల్ కోర్టులకు కాలం చెల్లు

» రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్

» 44వ రోజున 44మంది మహిళా న్యాయవాదుల దీక్ష

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 2 : న్యాయవాదుల నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 44వ రోజుకు చేరగా 44 మంది మహిళా న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ, భూ హక్కు చట్టం-2022 అమల్లోకి వస్తే సివిల్ కోర్టులకు కాలం చెల్లినట్టేనన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు జిల్లాస్థాయి కోర్టులో 151, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులు 131, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు 271లతో కలిపి రాష్ట్రం మొత్తం మీద 553 సివిల్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఈ కోర్టుల్లో సివిల్ కేసులు దాఖలు చేసేందుకు వీలుండదన్నారు. వీటిస్థానంలో ప్రతి జిల్లా కేంద్రంలో ఒక్కొక్క ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి కేవలం 26 ట్రిబ్యునల్స్‌లో కేసులను త్వరితగతిన పరిష్కారం చేస్తామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. శుక్రవారం నాటి దీక్షలో సీనియర్ మహిళా న్యాయవాదులు కిలారు సరళా బెనర్జీ, బోను జయమ్మ, యు.సునీల, పి.జయలక్ష్మి, మొవ్వా చంద్రకుమారి, పద్మజ, అచ్చెమాంబ, కోనేరు జయప్రభ, నిమ్మగడ్డ ఝాన్సీ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రద్దు చేయిస్తాం : కేశినేని చిన్ని

భూ హక్కు చట్టానికి వ్యతిరేకంగా 44 రోజులుగా న్యాయవాదులు చేస్తున్న నిరసన దీక్షలకు శుక్రవారం టీడీపీ నేతలు కేశినేని శివనాథ్ (చిన్ని), మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. సైకో జగన్ ప్రభుత్వానికి పోయేకాలం దగ్గరలోనే ఉందని మండిపడ్డారు. తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే చట్టాన్ని రద్దు చేయిస్తామని హామీ ఇచ్చారు.

సయ్యద్ కార్పొరేషన్ హామీ నెరవేర్చండి

● సయ్యద్ ముస్లిం మతపెద్దలు డిమాండ్

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 2: ఎలాంటి రిజర్వేషన్లకు నోచుకోక వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్న సయ్యద్ ముస్లింలకు సీఎం జగన్ ఇచ్చినమాట తప్పి మోసం చేశాడని సయ్యద్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షా మొహమ్మద్ అక్మల్ పీరాన్ మురాదీ ఆరోపించారు. శుక్రవారం పాత బస్టాండ్ సమీపంలోని హోటల్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం పీఠాధిపతులు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సయ్యద్ సంఘ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఉరవకొండ పీఠాధిపతి సయ్యత్ కుతుబుద్దీన్, పీఠాధిపతులు ఎల్లార్తి సజ్జాదా నషీన్, సయ్యద్ నూర్ బాషా హుస్సేనీ ఖాద్రీ, పామ్స్ ఆలం సజ్జాదా నషీన్ సయ్యద్ కుమైల్ అఫ్రన్ హుస్సేన్, గుత్తి సయ్యద్ అన్వర్ పాషా ఖాదరీ, ఆదోనీ పీఠాధిపతి సయ్యద్ తాహిర్ ఖాదర్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి, కడప, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల సయ్యద్ వర్గానికి చెందిన పెద్దలు సమావేశంలో పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా

ధర్నాచౌక్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు వి.రాధిక, సయ్యద్ ఖాసీం, రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం



» ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు

గుడివాడ, ఫిబ్రవరి 2 : ప్రణాళికబద్ధంగా చదివితే గ్రూపు-1, 2 ఉద్యోగాలను సాధించవచ్చునని కృష్ణా, ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో యూటీఎఫ్ గుడివాడ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గ్రూపు-1, 2 పరీక్షలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు భారత సమాజం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఆంధ్రుల చరిత్ర మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఎ.వి.వరలక్ష్మీ, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు పొంగులేటి జయరాజు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.


జూదరులతో ఎస్ఐ సందీప్, సిబ్బంది

కోడిపందాల బరులపై దాడులు

» పోలీసుల అదుపులో 15 మంది

» రూ.23 వేలు, ఆరు బైక్‌లు స్వాధీనం

కూచిపూడి, ఫిబ్రవరి 2 : చినముత్తేవి, అయ్యంకి కాలువ గట్టు సమీపంలో వేస్తున్న కోడిపందాల బరులపై కూచిపూడి ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. 15 మందిని అరెస్టు చేసి, రెండు కోడిపుంజులు, ఆరు మోటారు సైకిళ్లు, రూ.23,200 స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై సందీప్ తెలిపారు.


యూనియన్ డైరీ ఆవిష్కరిస్తున్న నేతలు

ఏపీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరణ

ధర్నాచౌక్, ఫిబ్రవరి 2 : జర్నలిస్టులకు ఉపయోగపడేలా విస్తృత సమాచారంతో 2024 డైరీని రూపొందించినట్టు ఏపీయూడబ్ల్యూజే నేతలు పేర్కొన్నారు. యూనియన్ ముద్రించిన 2024 డైరీని గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించి వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఆయా పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలని కోరారు. యూనియన్ విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సి.ఛానల్ అధినేత టీవీ.రమేష్‌బాబు, యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్ధన్, ఐజేయూ కార్యదర్శి డి.సోమసుందర్, సభ్యుడు ఎస్‌కే.బాబు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచెల జయరాజ్, కౌన్సిల్ సభ్యుడు దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్ 114, 122, 133
చికెన్ విత్ స్కిన్ 216
చికెన్ స్కిన్‌లెస్ 226



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.28

విద్యార్థుల భవిష్యత్తుతో జగన్ ఆటలు : లుక్కా సాయిరాం

విద్యాధరపురం, ఫిబ్రవరి 2: సీఎం జగన్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం రాజకీయ సభ కారణంగా ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలను రద్దు చేయడాన్ని తాము అభ్యంతరం చెబుతున్నామన్నారు. ఇంతకుముందే నిర్ణయించిన తేదీ మేరకు పరీక్ష జరగాల్సి ఉండగా, దెందులూరులో జరిగే సిద్ధం సభకోసం రద్దు చేసి పది లక్షల మంది విద్యార్థుల జీవితాలతో జగన్‌రెడ్డి ఆడుకుంటున్నాడన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే హక్కు జగన్‌కు ఎవరిచ్చారన్నారు. ఈ సందర్భంగా విద్యా విధానంలో సంస్కరణల పేరిట తీసుకున్న నిర్ణయాలను విమర్శించారు. చంద్రబాబును సీఎం చేయడం ముందున్న మార్గం అన్నారు

పేదలకు అందని సంక్షేమ పథకాలు

-ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 2 : సంక్షేమ పథకాలు అందిస్తున్నానని జగన్ మోహన్‌రెడ్డి ప్రచారం చేసుకోవడమే కానీ వాస్తవంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందటం లేదని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 12వ డివిజన్‌లోని అయ్యప్పనగర్‌లో బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గద్దె ఇంటింటికి తిరిగి జగన్ ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిచిన తర్వాత అమలు చేసే సంక్షేమ కార్యక్రమం వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. అనంతరం సూర్యుడు కుటుంబానికి టిఫిన్ బండిని గద్దె అందజేశారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపిన జగన్‌మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో షాక్ ఇవ్వడానికి చూస్తున్నారని అన్నారు. టీడీపీ హయాంలో పండుగ వస్తే చంద్రన్న కానుక ఇచ్చామని, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు వేయడం తప్ప పండుగ కానుకలు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. జగన్ మోహన్‌రెడ్డిని ఎప్పుడు అధికారంలో నుంచి దించుదామా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమని గద్దె రామ్మోహన్ ధీమా వ్యక్తం చేశారు. నాయకులు పొట్లూరి సాయిబాబు, మాదల చిన్నతల్లి, అబ్దుల్ ఖరీమ్, ఎ. జనార్ధనరావు, కె. రాంబాబు, కోనేరు రాజేష్, కొండపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యుడు కుటుంబానికి టిఫిన్ బండిని అందజేస్తున్న గద్దె రామ్మోహన్

మోసకారి జగన్ సర్కార్‌కు బుద్ధి చెప్పాలి

● బొండా ఉమా

పాయకాపురం: రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేస్తున్న జగన్ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. 63వ డివిజన్ సుందరయ్య మసీద్ వద్ద శుక్రవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సామాన్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి మళ్లీ నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. నేతలు నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, పైడి తులసి, లబ్బా వైకుంఠం, బత్తుల కొండ, పైడి శ్రీను, లబ్బా దుర్గ, బెజ్జం జైపాల్ పాల్గొన్నారు.

● స్థానిక 64వ డివిజన్ కండ్రికలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమా తనయుడు బొండా సిద్ధార్థ ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో 6100 డీఎస్సీ పోస్టులు ఇచ్చి మెగా డీఎస్సీ అంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేయడం నిరుద్యోగ యువతను మోసం చేయడమే అని అన్నారు. యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు.

ప్రజలకు పోలీస్ సేవలు

మరింత చేరువ కావాలనే ఫుట్ పెట్రోలింగ్

సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కర్ రావు

విజయవాడ క్రైమ్, ఫిబ్రవరి 2: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావాలన్న ఆలోచనతో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ జోన్ ఏసీపీ పి.భాస్కర్ రావు తెలిపారు. పటమటలంక, పటమట డొంకరోడ్డు, చేపల మార్కెట్ ఏరియాల్లో సెంట్రల్ జోన్ ఏసీపీ, పటమట పోలీసులు శుక్రవారం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. పోలీసులు అందించే సేవలను ప్రజలకు తెలియజేశారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి సమాచారాన్ని తమకు అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఏసీపీ తెలిపారు. అదే సమయంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువగా ఉన్న ప్రదేశాలను గుర్తించి అటువంటి ప్రదేశాల్లో పెట్రోలింగ్ పెంచుతామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఫుట్ పెట్రోలింగ్‌లో జరుగుతున్న సమయంలో ట్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడ్డ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పటమట సీఐ డి.కె.ఎన్. మోహన్ రెడ్డి, ఎస్ఐలు కె.వి.జి.వి. సత్యనారాయణ, వై.వి.శాతకర్ణి, ఎస్.వల్లి పద్మ, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ ఏసీపీ భాస్కర్‌రావు, పటమట సీఐ

విద్యార్థులూ..ర్యాగింగ్ కేసుల్లో ఇరుక్కోవద్దు

జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్

మొగల్రాజపురం, ఫిబ్రవరి 2: విద్యార్థులు ర్యాగింగ్ కేసుల్లో, మాదక ద్రవ్యాల వినియోగంలో ఇరుక్కుంటే భవిష్యత్ అంధకారం అవుతుందని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్ చెప్పారు. సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో యాంటీర్యాగింగ్ కవిటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే దుష్ప్రభావాలను వివరించడానికి అవగాహన సదస్సు నిర్వహించారు22. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వంటి నేరాలకు విధించే శిక్షలను వివరించారు. గౌరవ అతిథులుగా హాజరైన అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, న్యాయవాది అబ్దుల్ మతీన్ తదితరులు మాట్లాడుతూ ర్యాగింగ్ సంబంధిత సమస్యలు లేని కళాశాల నిర్వహణ గురించి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు, సమన్వయకర్త డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్ తదితరులు

బలహీన వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● బొండా ఉమా, కేశినేని శివనాథ్

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 2 : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, కేశినేని శివనాథ్(చిన్ని)లు అన్నారు. కేశినేని ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు పది మంది పేదలకు తోపుడు బండ్లు అంజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లల్లో జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో పేదల నెత్తిన ఆర్థిక భారాలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.



తోపుడు బండ్లను అందజేసిన కేశినేని చిన్ని, బొండా ఉమా

వ్యక్తి ఆత్మహత్య

పాయకాపురం, ఫిబ్రవరి 2 : స్థానిక శాంతినగర్ ప్రాంతంలో ఉంటున్న గొన్నూరు చందులాల్(38) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం చందులాల్, అతని భార్యకు మనస్పర్థల కారణంగా గత కొంత కాలంగా భార్య చందులాల్‌తో విడిగా ఉంటోంది. గురువారం రాత్రి చందులాల్ బెడ్‌షీట్‌తో ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టీడీపీ నేతల ఆర్థికసాయం

చిట్టినగర్, ఫిబ్రవరి 2: టేనర్‌పేట ఐజాక్‌వీధిలో అనారోగ్యంతో బాధపడుతున్న కట్టారి నాగరాజుకు వైద్య ఖర్చుల నిమిత్తం టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, కె. నాగుల్‌మీరాలు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం టేనర్‌పేటలో ఆయన నివాసానికి బుద్దా వెంకన్న, కె.నాగుల్‌మీరాలు పలువురు టీడీపీ నాయకులతో కలిసి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. బాధితుడి భార్య ధనలక్ష్మికి రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. టీడీపీ డివిజన్ అధ్యక్షుడు నాగోతి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

ట్రైకార్ డైరెక్టర్‌గా రామకృష్ణ కొనసాగింపు

భవానీపురం, ఫిబ్రవరి 2 : ఏపీ ఎస్టీ కార్పొరేషన్ ట్రైకార్ డైరెక్టర్‌గా భవానీపురం ఊర్మిళానగర్‌కు చెందిన మద్దిల రామకృష్ణను కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై పలువురు ఎస్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్టీ, గిరిజన, ఇతర వెనుకబడిన ప్రజల సమస్యలను రామకృష్ణ పరిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయ హుండీ లెక్కింపు 14న

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 2: దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఈనెల 14న ఉదయం 10 గంటలకు చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం హుండీలను లెక్కించడం జరుగుతుందని ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పశ్చిమ కాంగ్రెస్ టికెట్ ఇవ్వండి

● నూకల నాగేశ్వరరావు లేఖ



వన్‌టౌన్, ఫిబ్రవరి 2: వ్యాపార వాణిజ్య వర్గాలు అధికంగా ఉన్న పశ్చిమ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి టికెట్ ఇవ్వాలని మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు శుక్రవారం విజయవాడలోని వీసీసీ కార్యాలయంలోని ఎన్నికల సెల్‌లో లేఖ ఇచ్చారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన వీవీకే నరసింహరావు, మారేమళ్ల సుధాకర్ తదితరులు ఆయనకు మద్దతు పలికారు.

కృష్ణానదిలో ఈతకు వెళ్లి లారీ యజమాని మృతి

విద్యాధరపురం, ఫిబ్రవరి 2: విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన లారీ యజమాని బండి రమేష్‌రెడ్డి కృష్ణానదిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం భవానీఘాట్ వద్ద జరిగింది.

రమేష్‌రెడ్డి భార్య, కుమారుడు, కుమార్తెతో ఉంటున్నారు. లారీ నడుపుతూ జీవనం చేస్తున్నారు. ఇతను ప్రతిరోజూ భవానీఘాట్ నదిలో ఈతకు వెళుతుంటాడు. శుక్రవారం ఉదయం 5.30కు మరికొందరితో కలిసి ఈతకు వెళ్లాడు. నదిలోపలికి ఇద్దరు మిత్రులు వెళుతూ రమేష్‌రెడ్డిని కూడా రమ్మన్నారు. అయితే అతను తనకు ఆరోగ్యం బాగాలేదని, తాను రానని నిరాకరించాడు, అయితే లోతుకు వెళ్లిన ఇద్దరు మిత్రులు ఈత ముగించుకుని ఒడ్డుకు వచ్చి చూడగా రమేష్‌రెడ్డి కనిపించలేదు. సమీపంలో చూడగా అక్కడ ఉన్న ట్యూబ్‌కు అనుసంధానం చేసిన తాడు నడుంకు కట్టుకుని రమేష్‌రెడ్డి చనిపోయి కనిపించాడు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందం స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు పంపారు.మృతుడి భార్య శ్రీవాణి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న గోళ్లమూడి శేఖర్‌బాబు

పాతరాజరాజేశ్వరి పేట, ఫిబ్రవరి 2 : కుటుంబంలోని వ్యక్తులందరూ కలిసికట్టుగా ఉంటేనే కుటుంబ వ్యవస్థ బలంగా ఉంటుందని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు అన్నారు. స్థానిక పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో నవజీన్ పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంలో శేఖర్‌బాబు మాట్లాడుతూ నవజీవన్ బాలభవన్ పూర్వ విద్యార్థుల కుటుంబాలకు అన్ని విధాలుగా సలహాలు, అవసరమైన సహాయాన్ని అందిస్తూ వారి అభివృద్ధికి దోహదపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నవజీవన్ బాలభవన్ కో-ఆర్డినేటర్లు ఎండీ వసంతకుమారి, బి. రమేష్, ఎస్‌కె నజ్మా, కె. ప్రియాంక, కె. శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు వైసీపీ చేసింది శూన్యం

జనసేన నగర అధికార ప్రతినిధి షేక్ గయాజుద్దీన్

భవానీపురం, ఫిబ్రవరి 2 : ముస్లిం మైనార్టీలకు పశ్చిమలో వైసీపీ ప్రభుత్వం చేసింది శూన్యమని, రానున్న ఎన్నికల్లో ముస్లింలను ఓటు అడిగే హక్కు లేదని జనసేన నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ అధినేత షేక్ గయాజుద్దీన్ అన్నారు. 41వ డివిజన్‌లోని అన్నా గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం టిక్కెట్ ముస్లిం సామాజికవర్గానికి చెందిన తనకు కేటాయించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను కోరినట్లు తెలిపారు.నాయకులు రజా మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఖలీల్, సెక్రటరీ సాదిక్, పెద్దలు బాషాలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గయాజుద్దీన్

ముస్లింలకు అండగా జనసేన: పోతిన మహేశ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 2: ముస్లిం మైనార్టీలకు అండగా నిరంతరం జనసేన అందుబాటులో ఉంటుందని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. ఇంటింటికి రాబోయే జనసేన- టీడీపీ ప్రభుత్వం ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం వన్‌టౌన్‌లోని స్పేర్‌పార్టుల వ్యాపారుల వద్ద నిర్వహించారు. ముస్లింల టోపీ ధరించి ఆయన అక్కడ వారిని తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. పశ్చిమలో ముస్లింల కోసం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. నిరంతరం ముస్లింల కోసం పోరాడే ఏకైక వ్యక్తిని తానేనని గుర్తు చేశారు. ఏడు సంవత్సరాలుగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందిస్తున్న విషయాన్ని గమనించాలన్నారు. మదర్సా అభివృద్ధికి పవన్‌కల్యాణ్ ఐదు లక్షల విరాళం ఇచ్చారని, ముస్లింల అభివృద్ధి, సంక్షేమాన్ని పవన్‌కల్యాణ్ పట్టించుకుంటారన్నారు.



ముస్లిం మైనార్టీలతో మహేశ్ భేటీ

వివాహిత కనిపించడం లేదని ఫిర్యాదు

విద్యాధరపురం, ఫిబ్రవరి 2: విద్యాధరపురం చెరువు సెంటర్లో నివాసం ఉంటున్న వివాహిత (24) అదృశ్యమైనట్లు తండ్రి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహిత భర్త ఆటో డ్రైవర్. ఇటీవల వివాహితకు భర్తతో గొడవలు జరిగాయి. దీంతో తన కుమారుడిని తీసుకుని కొత్తపేటలోని పుట్టింటికి వెళ్లింది. జనవరి 24న తల్లిదండ్రులు ఆమెను భర్తకు అప్పగించారు. గొడవలు పడవద్దని హితవు చెప్పారు. అయితే ఈనెల ఒకటో తేదీన భార్యాభర్తలు కుమారుడిని స్కూల్‌లో దించాక, భార్యను భర్త ఆటోలో దింపి కిరాయికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా, భార్య కనిపించలేదు. ఇంట్లో ఉంచిన రూ. 1.65లక్షల నగదు, రెండు బంగారు ఉంగరాలు, చైన్ కనిపించలేదు. భార్య ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు .ఫిర్యాదు చేశారు.

నాయీ బ్రాహ్మణ సంక్షేమ క్యాలెండర్ ఆవిష్కరణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 2: రాష్ట్రమైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ వైసీపీ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్‌ను ఆయన కార్యాలయంలో శుక్రవారం దేవదాయశాఖ కేశఖండనశాలల రాష్ట్ర జేఏసీ గౌరవ అధ్యక్షుడు గుంటుపల్లి సుబ్బారావు, నాయకులు కలిశారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణ సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, సీఎం జగన్ ప్రతి నాయీ బ్రాహ్మణ కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారని తెలిపారు. నాయకులు ఏజీఎల్ నారాయణ, జి హరికిరణ్, ఏ రాంబాబు,రాజేశ్వరరావు, అనిల్, ఏఎస్ బాబు, సంతోష్, ధనుంజయ్, మైలవరపు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


సాఫ్ట్‌బాల్‌లో వీఆర్ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

పెనమలూరు, ఫిబ్రవరి 2 : మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే అంతర కళాశాలల సాఫ్ట్‌బాల్ టోర్నమెంటులో వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచినట్లు కళాశాల పీడీ పోతిన రఘు తెలిపారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, డీన్ పాండురంగారావు అభినందించారు.









2025

జనవరి 10న విశ్వంభర

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా టైటిల్ టీజర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు చిరంజీవి. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ఠ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్‌తో కొత్త ప్రపంచం సృష్టించారు. ఈ సినిమా షూటింగ్‌లో మెగాస్టార్ శుక్రవారం అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకూ నటించిన చిత్రాల్లో ఇదే కాస్ట్లీయస్ట్ ఫిల్మ్. వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర'ను విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: శివశక్తి దత్తా, చంద్రబోస్, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరావు, సంతోష్ కామిరెడ్డి.

అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు

లావణ్య



'వరుణ్‌తేజ్‌తో పెళ్లయిన తర్వాత కెరీర్ పరంగా ఏమీ మార్పు లేదు.. మెగా కుటుంబంలోకి వచ్చాక 'నువ్వు ఇలా చేయాలి.. అలా చేయాలి' అని ఎవరూ నాకు చెప్ప లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మా వరకూ గతంలో లాగానే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగుపెట్టడం మంచి అనుభూతినిచ్చింది. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్‌లో వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్స్‌లో వరుణ్ ఇన్‌వాల్వ్ కాడు. 'మిస్ పర్ఫెక్ట్' స్ర్కిప్ట్ చదివి బాగుందన్నాడు' అని చెప్పారు లావణ్య. తను హీరోయిన్‌గా నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు.

● 'ఈ సిరీస్‌లో మంచి నటులు ఉన్నారు. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన మంచి స్ర్కిప్ట్ ఇది. ఇలాంటి స్ర్కిప్ట్ నా దగ్గరకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నేను 'మిస్ లావణ్య , లక్ష్మి' అనే పాత్రలు చేశాను. అన్ని రకాల ఎమోషన్స్ ఈ పాత్రల్లో ఉన్నాయి. నా పర్సనల్ లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్రలివి. సినిమాలకు, వెబ్ సిరీస్‌కు పెద్ద తేడా కనిపించలేదు. సినిమా షూటింగ్ జరిగినట్టే ఈ వెబ్ సిరీస్ వర్క్ కూడా జరిగింది' అని చెప్పారు లావణ్య.

● 'కొత్త దర్శకులతో పని చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. మా దర్శకుడు విశ్వక్ ఖండేరావు రైటింగ్ యూనిక్‌గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఎవరు సలహా చెప్పినా స్వీకరించేవారు. పర్ఫెక్షనిస్ట్‌గా ఉండడం వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఈ సిరీస్‌లో చూస్తారు' అని ఆమె అన్నారు. నిర్మాత సుప్రియ తనకు మంచి స్నేహితురాలు కావడంతో ఈ సిరీస్ కంఫర్ట్‌గా చేశానని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త హీరోతో నిర్మించే చిత్రంలో నటించనున్నట్లు లావణ్య చెప్పారు. ఇందులో తనది పోలీస్ ఆఫీసర్ పాత్ర అన్నారు. దీంతో పాటు ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నట్లు వెల్లడించారు.

22న గోవాలో రకుల్ పెళ్లి



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి ముహూర్తం ఖరారు అయింది. తన ప్రియుడు, నిర్మాత, నటుడు జాకీ భగ్నానితో ఆమె వివాహం ఈ నెల 22న గోవాలో జరుగనుంది మిడిల్ ఈస్ట్‌లో ధూమ్ ధామ్‌గా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని మొదట రకుల్, ఆమె బాయ్ ఫ్రెండ్ అనుకున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ డెస్టినేషన్ వెడ్డింగ్స్ విదేశాల్లో కాకుండా మన దేశంలోనే నిర్వహించాలని ఇటీవల .విజ్ఞప్తి చేయడంతో రకుల్, జాకీ తమ ఆలోచన మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి తర్వాత ముంబైలో రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి టాలీవుడ్, బాలీవుడ్‌లోని చిత్ర ప్రముఖులందరినీ ఆహ్వానించాలని కూడా వారు అనుకున్నారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబైలో కానీ మరెక్కడ కానీ వీళ్ల పెళ్లి రిసెప్షన్ జరగడం లేదు.

వేసవిలో వస్తున్న ఫ్యామిలీ స్టార్



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విడుదల తేదీని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 5న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ ఉన్నారు. రిలీజ్ డేట్ ప్రకటించిన సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని భుజాన గొనె సంచీ, ఆధార్ కార్డ్‌తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

వేడుకల వేళ...



రాజ్ తరుణ్ హీరోగా ఎ.ఎస్.రవి కుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న 'తిరగబడరసామీ' చిత్రం నుంచి సెలబ్రేషన్ సాంగ్ విడుదల చేశారు. సుద్దాల అశోక్ తేజ రాసిన ఈ పాటను లిప్సికా భాష్యం, అదితి భావరాజు, చైతు సత్సంగి పాడారు. చిత్ర నిర్మాత మల్కాపురం శివకుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'యువతను ఆకట్టుకొనే రొమాన్స్ ఫ్యామిలీ సెంటిమెంట్, యాక్షన్, ఎమోషన్ అంశాలతో చిత్రం రూపుదిద్దుకుంటోంది. హిందీ 'బిగ్‌బాస్'తో యావత్ భారతాన్ని అలరించిన మన్నార చోప్రా ఈ సినిమాలో ఓ విభిన్న పాత్ర పోషిస్తున్నారు. ఆమెపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం అందరినీ అలరిస్తుంది.. ఈ నెల 23న చిత్రాన్ని విడుదల చేస్తాం' అన్నారు. మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత్ ఠాకూర్, పృథ్వీ ప్రగతి, రాజా రవీంద్ర, బిత్తరి సత్తి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: జవహర్ రెడ్డి, సంగీతం: జేబీ.

కోర్టులో మాకు న్యాయం జరుగుతుంది

శ్రీమంతుడు టీమ్ స్పందన

మహేశ్‌బాబు హీరోగా దర్శకుడు కొరటాల శివ రూపొందించిన 'శ్రీమంతుడు' చిత్రం కథ విషయంలో న్యాయస్థానంలో కేసు నడుస్తున్న విషయం తెలిసిందే. తన స్వీయరచన 'చచ్చేంత నవల'ను కాపీ కొట్టి 'శ్రీమంతుడు' సినిమా తీశారని రచయిత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారు. అయితే ఈ కేసులో కొరటాల శివ సుప్రీం కోర్టు వరకూ వెళ్లినా ఫలితం లేకపోయింది. క్రిమినల్ కేసు ఎదుర్కోవాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో శరత్‌చంద్ర ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ' కొంతమంది సినీ పెద్దలు మా మధ్యన రాజీ కుదర్చడానికి ప్రయత్నించారు. రూ. 15 లక్షలు ఇప్పిస్తామన్నారు. కానీ అది నా స్ర్కిప్టే అని దర్శకుడు అంగీకరించాలి' అని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన చిత్రయూనిట్ సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. 'శ్రీమంతుడు' సినిమా, 'చచ్చేంత ప్రేమ' నవల..రెండూ మార్కెట్లో ఉన్నాయి. ఆ నవల చదివి మా సినిమా చూసినాళ్లకు ఆ రెండింటి మధ్య ఎలాంటి పోలిక లేదని అర్థమవుతుంది. ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది కాబట్టి ముందే ఒక అభిప్రాయానికి వచ్చి తీర్పులు ఇవ్వడం తగదు. న్యాయస్థానం తీర్పు కోసం కొంతకాలం ఓపికపట్టండి. న్యాయప్రక్రియపై మాకు నమ్మకం ఉంది' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

యువతను మెప్పించే రేవ్ పార్టీ

క్రిష్ సిద్దిపల్లి

'నేను లేని నా ప్రేమకథ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు క్రిష్ సిద్దిపల్లి. ఆయన కథానాయకుడిగా రూపొందిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రిష్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

● హీరో అవ్వాలనేది నా కోరిక. కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాలకు సహాయ దర్శకుడిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత నటుడిగా చిన్నపాత్రలు పోషించాను. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు



వస్తున్నాయి. నేను హీరోగా నటించిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. యువతను ఆకట్టుకునే వినూత్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు బొనగాని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రితిక చక్రవర్తి, ఐశ్వర్యగౌడ హీరోయిన్లు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఉడుపి, గోవా, బెంగళూరు ప్రాంతాల్లో ఎక్కువగా రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. అందుకే ఆ ప్రాంతంలోని ఒరిజినల్ లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రేవ్‌పార్టీలు ఎలా జరుగుతాయి?, వాటి వెనుక ఎవరు ఉంటారు, యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం.


ఆ మూడూ నచ్చి రవి తేజ ఓకే చేశారు

సంగీత దర్శకుడు దేవ్ జాంద్



'దర్శకుడు కార్తీక్‌తో నాకు అనుబంధం ఉంది. 'ఈగల్' సినిమా ఓకే కాగానే 'రవితేజను ఒప్పించు. ఆయన ఓకే అంటేకానీ నిన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకోలేను' అని చెప్పారు కార్తీక్. నా వంతు ప్రయత్నంగా మూడు ట్రాక్స్ కంపోజ్ చేసి కార్తీక్‌కు ఇచ్చాను. అవి రవితేజకు నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌లోకి అడుగుపెట్టాను' అన్నారు సంగీత దర్శకుడు దేవ్ జాంద్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తయారైన 'ఈగల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా దేవ్ మీడియాతో మాట్లాడారు. 'ఈగల్'లో చాలా కొత్త తరహా సంగీతం అందించాం. రవితేజకు ప్రాపర్ ఇంగ్లీష్ ట్రాక్ చేసే అవకాశం రావడం నా అదృష్టం. ఆయన చాలా మంచి వ్యక్తి. సంగీతం గురించి దాదాపు గంట సేపు మాట్లాడుకున్నాం. ఈ సినిమాలో స్ర్కీన్‌ప్లే, యాక్షన్, దర్శకుడు తీసిన విధానం యూనిక్‌గా ఉంటాయి. 'ఆడు మచ్చా' పాట మెస్మరైజ్ చేస్తుంది.' అని ఆయన తెలిపారు. కార్తిక్ ప్రతిభావంతుడైన దర్శకుడు అని చెబుతూ ఆయన అభిరుచికి తగ్గ సంగీతం అందించానని దేవ్ చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్, సహ నిర్మాత వివేక్ అంతే ప్రోత్సహించారని తెలిపారు.

నాగ్- అక్షయ్ మల్టీస్టారర్?





'నా సామిరంగ' చిత్రం విజయం సాధించడంతో మంచి జోష్‌లో ఉన్నారు నాగార్జున. ప్రస్తుతం ఆయన ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నారు. ఇప్పుడు ఆయన మరో మల్టీస్టారర్ చిత్రానికి పచ్చజెండా ఊపారని సమాచారం. ఓ తమిళ దర్శకుడు చెప్పిన కథ నచ్చడంతో నాగార్జున ఎస్ చెప్పారట. మల్టీస్టారర్‌గా రూపొందబోతోన్న ఈ చిత్రంలో ప్రముఖ బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ కీలకపాత్ర పోషించనున్నారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నాగార్జున అడపా దడపా హిందీ చిత్రాల్లో కనిపిస్తూనే ఉన్నారు. రణ్‌బీర్ కపూర్ హీరోగా వచ్చిన 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నాగార్జున కీలకపాత్రలో నటించారు. ఆ చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా రాజమౌళి-మహేశ్‌బాబు కాంబినేషన్‌లో వస్తున్న చిత్రంలోనూ నాగార్జున ప్రధాన పాత్రలో నటించనున్నారని కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



గ్రామీణ ప్రేమకథ

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్ బాగుందనీ, సినిమా విజయం సాధించాలనీ ఆయన కోరారు. నిర్మాత మాట్లా



డుతూ 'గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న ప్రేమకథ ఇది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, తను అనుకున్న విధంగా సినిమా తీయడానికి నిర్మాత ఎంతో సహకరించారనీ దర్శకుడు తెలిపారు. దీప్తి, మేకా రామకృష్ణ, జయప్రకాశ్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం: చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే.



ఆ రెండేళ్లు నరకం చూశా

పూనమ్ కౌర్

ఫైబ్రోమైయాల్జియా సమస్యతో రెండేళ్లపాటు నరకం చవిచూశానని నటి పూనమ్ కౌర్ అన్నారు. ఈ అరుదైన వ్యాధి గురించి ఆమె జనాల్లో అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫైబ్రోమైయాల్జియాతో తాను చాలా ఇబ్బందులకు గురైనట్లు అందులో ఆమె చెప్పారు. శరీరం సున్నితంగా మారి, కొద్దిపాటి స్పర్శకూ తీవ్రంగా స్పందించేదన్నారు. కండరాల నొప్పులతో కనీసం దుస్తులు కూడా ధరించలేకపోయాననీ, రెండేళ్ల పాటు నరకం చూశానని ఆమె తెలిపారు. ఒక రకంగా చావు అంచుల వరకూ వెళ్లొచ్చినట్లు అనిపించిందన్నారు. రెండేళ్లుగా పలు రకాల వైద్య పద్ధతులు ప్రయత్నించినా అవేవీ తన సమస్యకు సాంత్వన ఇవ్వలేకపోయాయనీ అయితే ప్రకృతి చికిత్స, జీవనశైలిలో మార్పులతో తాను ఆ సమస్యను అధిగమించానని సోషల్ మీడియాలో పూనమ్‌కౌర్ తెలిపారు.

రోగాలను జయించే దబ్బ

సైంధవార్ద్రక సంయుక్తం బీజ పూర కమత్తి యః!
శాకినీభిరివాకృష్టం విశత్యుదరమోద నమ్!!

దబ్బపండుని 'మాతులుంగ, బీజ పూర' అని పిలుస్తారు. 'సిట్రస్ మెడికా' వృక్షనామం. చూపులకు పెద్ద కాయలా కనిపిస్తుంది. కానీ, మందపాటి తోలు, లోపల చిన్నపాటి తొనలూ ఉంటాయి. దీని తోలు, గింజలు, తొనలు వైద్యానికి పనికొస్తాయి. పేగుల్లో వచ్చే వ్యాధుల్లో దీని ప్రయోగం ఎక్కువ. మొలల వ్యాధిలో ఇది ప్రముఖమైన ఔషధం కూడా.



దబ్బపండు తోలు ముడతలుగా, గరుకుగా ఉంటుంది. పుల్లనిదైనప్పటికీ వేడినీ, వాతాన్నీ, కఫాన్ని తగ్గిస్తుంది. సి-విటమిన్‌కు పుట్టిల్లు. వండితే సి-విటమిన్ ఎగిరిపోతుంది. వేడి తగలకుండా దీంతో వంటకాలు చేసుకోవాలి.

బాగా పండిన దబ్బనే ఆహార ప్రయోజనాలకు వాడాలి. వాంతి, వికారాలను తగ్గించే ఔషధ ద్రవ్యాలలో ఇది ప్రముఖమైంది. కడుపులో నొప్పిని, అరుచిని, మలబద్ధకాన్ని నివారించి, విరేచనం అయ్యేలా చేస్తుంది. అజీర్తి సమస్యలన్నిటికీ ఇది నివారకమే. దబ్బ రసం ఇస్తే మద్యం మైకం దిగిపోతుంది. ఆగకుండా వచ్చే ఎక్కిళ్ల ఆగుతాయి. దగ్గు, ఆయాసం తగ్గుతాయి. మొలల వ్యాధిలో విరేచనం అయ్యేలా చేసి, నొప్పిని, రక్తస్రావాన్ని ఆపుతుంది. పులుపుతో కూడిన ఆహార పదార్థాల్ని వాతవ్యాధులున్న వారికి నిషేధం అని చెప్పినా, దబ్బపండుకి వాతాన్ని, కఫాన్ని తగ్గించే గుణం ఉంది. చర్మానికి మంచిది. మంచి రంగునిస్తుంది. ముఖం మీద ముడతలు తగ్గుతాయి.

దీని తోలుని పారేయనవసరంలేదు. కఫాన్ని, వాతాన్ని తగ్గించే ద్రవ్యమే ఇది. కడుపులో పెరిగే నులిపురుగుల్ని చంపి బయటకు వెళ్లగొట్టే గుణం దీనికుంది. ఔషధాలకే కాదు, ఆహార పదార్థాల తయారీకి కూడా దబ్బపండు తొనలు, దూది భాగము, దాని పైనుండే తోలూ ఉపయోగిస్తాయి. దబ్బ పండ్లు ఎముక పుష్టినిస్తాయి. కండరాలు బలసంపన్నం అవుతాయి. కిడ్నీ, లివర్లను శక్తిమంతం చేస్తాయి. గుండెకు టానిక్‌లాగా పని చేస్తాయి. కండరాలు శుష్కించిపోయే వ్యాధిలో ఇది ఉపయోగపడుతుంది.

దబ్బ రసంతో తయారయ్యే ఆయుర్వేద ఔషధాలలో మాదీఫల రసాయనం, ధాత్రీ రసాయనం ముఖ్యమైనవి. గర్భవతుల్లో కలిగే వాంతులు, వికారాలు తగ్గిస్తుంది. పేగులకు ఇది టానిక్. ఇమ్యూనిటీ బూస్టర్ కూడా. బస్సు పడని వారికి వాంతి కాకుండా ఆపుతాయి.

దబ్బ పండును ఒక కూరగాయగా కూడా దీన్ని వాడుకోవచ్చు.

దబ్బపానీయం: దబ్బ తొనల్ని వలిచి, కొద్దిగా సైంధవలవణం, అల్లం రసం కలిపి, కొద్దిసేపు ఉంచితే తొనల లోపల ముత్యాల నుంచి రసం బాగా ఊరుతుంది. దీన్ని తాగితే రోగాలను జయించటం తేలిక అంటాడు క్షేమశర్మ. ఇది కఫవాతాల్ని హరించి జఠరాగ్నిని పెంచుతుంది. గుండెకు మేలు చేస్తుంది. లివర్, స్ప్లీను లాంటి అవయవాలలో కలిగే వాపు, కడుపునొప్పిని తగ్గిస్తుంది. మొలల వ్యాధితో బాధపడే వారికి మంచిదన్నాడు.

దబ్బపప్పు: ఉడికించిన ముద్దపప్పు చల్లారాక దబ్బరసం కలిపి, తాలింపు పెట్టుకుంటే ఈ పప్పు కమ్మగా ఉంటుంది. ఆరోగ్యానికి మంచిది.

దబ్బ పండును వానాకాలంలో సైంధవ లవణంతోనూ, వసంత కాలంలో పంచదారతోనూ, చలికాలంలో ఉప్పు, అల్లం, ఇంగువతోనూ, వేసవి కాలంలో బెల్లంతోనూ కలిపి తీసుకోవాలని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం'లో సూచించాడు. దబ్బ పండు శాకినీ డాకినీల్లా రోగాల్ని జయిస్తుందంటాడు క్షేమశర్మ.



దబ్బ పులిహోర: చింతపండు రసానికి బదులుగా దబ్బరసం కలిపి, పులిహోర తాలింపు పెడితే రుచికరంగా ఉంటుంది. చింతపండు పులిహోర కన్నా ఇది మేలైనది. కొద్దిగా ఆవపిండి, మెంతిపిండి కూడా కలిపితే కమ్మగానూ, మేలుచేసేదిగానూ ఉంటుంది.

దబ్బకారం: ఓ బాండీలో కొంచెం నూనె వేసి, అందులో తగినన్ని ఎండుమిర్చి, తాలింపు గింజల్ని వేగించి మెత్తగా నూరాలి. అందులో ఉప్పు, దబ్బ రసం కలిపితే దబ్బకారం లేదా దబ్బ పచ్చడి తయావుతుంది. దీని తొనలో ఉండే ముత్యాలను నలిపేయకుండా అలానే కలిపితే... కంటికి ఇంపుగా, రుచికరంగా ఉంటుంది. టిఫిన్లలోకి నంజుకోవటానికి బావుంటుంది.

దబ్బ ఊరగాయ: దబ్బను తోలుతో సహా ముక్కలుగా తరిగి, ఉప్పు, పసుపు వేసి మూడు రోజులు ఊరనివ్వాలి. మూడో రోజున తగినంత కారం, మెంతి పిండి కలిపి ఒక సీసాలో భద్రపరచుకోవాలి. కావల్సినప్పుడు కొద్దిగా ఇవతలికి తీసి ఇంగువ తాలింపు పెట్టుకుంటే కమ్మగా ఉంటుంది. దబ్బ రసానికి చెప్పిన గుణాలన్నీ దబ్బ ఊరగాయకీ ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

పొడి చర్మం, చమక్కు

ఒకే రకమైన మేకప్ అందరికీ నప్పదు. చర్మ తత్వాన్ని బట్టి మేకప్ సామాగ్రి, దాన్ని అప్లై చేసుకునే మెలకువలను అనుసరించాలి. పొడి చర్మం కలిగిన వాళ్లు ఇవిగో ఈ మేకప్ టిప్స్ పాటించాలి.

ఎక్స్‌ఫోలియేట్: ఫౌండేషన్‌తో పాటు ఇతరత్రా మేకప్ ఉత్పత్తులు పొడి చర్మం పైన చక్కగా ఇమిడిపోలేవు. కాబట్టి పొడి చర్మ తత్వం కలిగిన వాళ్లు చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేసి, నునుపుగా మార్చుకోవాలి. ఇందుకోసం ఉపయోగించే స్క్రబ్ చర్మానికి హాని కలిగించనిదై ఉండాలి.

హైడ్రేటింగ్ సీరం: చర్మానికి తేమను అందించి, మేకప్‌కు అనువుగా మార్చడం కోసం తప్పనిసరిగా హైడ్రేటింగ్ సీరం వాడుకోవాలి. ఈ సీరంను క్రమం తప్పక వాడితే, చర్మంలో జీవకళ ఉట్టిపడడంతో పాటు, సుతిమెత్తగా, కాంతివంతంగా తయారవుతుంది.

ఫేస్ ప్రైమర్: ఫౌండేషన్ అప్లై చేసే ముందు ముఖానికి ప్రైమర్ పూసుకోవాలి. ఇలా చేయడం వల్ల మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కు చెదరకుండా ఉంటుంది. అలాగే చర్మంలోని తేమ తరిగిపోకుండా కాపాడుతుంది.

ఫౌండేషన్ ఫార్ములా: చర్మానికి తేమనందించే, ద్రవరూప ఫౌండేషన్‌ను మాత్రమే వాడుకోవాలి. అతిగా మ్యాట్ తత్వం కలిగి ఉండే ఫౌండేషన్‌తో చర్మం మరింత పొడిబారుతుంది. క్రీమ్ రూపంలో ఉండే ఫౌండేషన్ వాడాలనుకుంటే, చర్మంలో ఇంకిపోయి, చర్మపు రంగులో కలిసిపోయేలా ఉండే నాణ్యమైన లిక్విడ్ ఫౌండేషన్‌నే ఎంచుకోవాలి.

మేకప్ స్పాంజ్: బ్లష్, ఐ షాడో లాంటి టార్గెటెడ్ అప్లికేషన్స్‌కు బ్రష్‌లే అనువుగా ఉన్నప్పటికీ, పొడి చర్మం కలిగిన వాళ్లు ఫౌండేషన్ అప్లికేషన్ కోసం తడిపిన స్పాంజ్‌ను ఉపయోగించడమే మేలు. తడి స్పాంజితో చర్మానికి అదనపు హైడ్రేషన్ కూడా దక్కుతుంది. అలాగే చర్మపు ముడతల్లో, గీతల్లో మేకప్ ఇరుక్కుపోకుండా ఉండాలంటే తడి స్పాంజ్‌తోనే ఫౌండేషన్ వేసుకోవాలి.

పౌడర్: పొడి చర్మానికి పౌడర్లు నప్పవు. అయితే మేకప్ సెట్ చేయడం కోసం అద్దుకునే పౌడర్ లైట్ వెయిట్ పౌడర్ అయి ఉండేలా చూసుకోవాలి.



వంటిల్లు



రక్తహీనత ఎక్కువశాతం స్త్రీలు, తక్కువ మోతాదులో పురుషులు బాధపడే వ్యాధి. పీసీఓడీ, పీసీఓఎస్, విటమిన్ లోపం, నీరసం.. లాంటివన్నీ రక్తహీనత వల్లనే. కొన్ని బీట్‌రూట్ రైస్, దానిమ్మ పచ్చడి, పాలకూర కూర.. వంటలు తింటే రక్తహీనత తగ్గుముఖం పడుతుంది. ఆ వంటలే ఇవి..

రక్తహీనతకు చెక్

బీట్‌రూట్ రైస్

కావాల్సిన పదార్థాలు

ఆవాలు- అర టీస్పూన్, జీలకర్ర- అర టీస్పూన్, మినప్పప్పు- 1 టీస్పూన్, శనగపప్పు- 1 టీస్పూన్, పసుపు- అర టీస్పూన్, ఉప్పు- ఒకటిన్నర టీస్పూన్, కారం-1 టీస్పూన్, జీడిపప్పు- 2 టేబుల్ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- 1 కట్ట, కరివేపాకు- కొద్దిగా, బీట్‌రూట్ -150 గ్రాములు, బియ్యం లేదా మిల్లెట్ రైస్- 250గ్రాములు, గరం మసాలా- పావు టీస్పూన్, నిమ్మరసం- 1 (మీడియం సైజ్), బ్రెడ్ ముక్కలు-10 క్యూబ్స్ (వేయించినవి)

తయారీ విధానం

ప్యాన్‌లో నూనె వేడికాగానే ఆవాలు, జీలకర్ర, మినప్పప్పు, పచ్చి శనగపప్పు, కరివేపాకుతో పోపు వేసి కొత్తిమీర కలిపి.. వేగగానే కొద్దిగా జీడిపప్పు కూడా వేసి వేయించాలి. తురిమి పెట్టుకున్న బీట్‌రూట్‌ను కూడా వేసి అన్నీ కలుపుతూ రెండు నిముషాల పాటు కుక్ చేస్తే మగ్గుతాయి. పసుపు, ఉప్పు, కారం, బీట్‌రూట్‌కు సరిపడ వేసి ఉడికి చల్లారిన రైస్‌ను యాడ్ చేసి మొత్తం ఒకసారి కలిపాక.. మిగతా ఉప్పు, కారం కూడా కలిపి గరం మసాలా వేసి అన్నీ కలిపి మరికొంత కొత్తిమీర యాడ్ చేసి స్టవ్‌ను ఆఫ్ చేసుకోవచ్చు. వేయించిన బ్రెడ్ ముక్కలతో పాటు నిమ్మరసం చల్లుకోవాలి.

పాలకూర కూర

కావాల్సిన పదార్థాలు

ఎండుమిర్చి- 8, కరివేపాకు- గుప్పెడు, జీలకర్ర- 1 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ-1 (మీడియం సైజ్), పచ్చిమిర్చి- 4, ఆవాలు- అర టీస్పూన్, జీలకర్ర- అర టీస్పూన్, వెల్లుల్లి- 4 రెబ్బలు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- 1 టీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, పాలకూర- పది ఆకులు



తయారీ విధానం

ముందుగా పాలకూరలోకి పొడిని సిద్ధం చేసుకోవాలి. మీరు తినే కారంకి అనుగుణంగా కొద్దిగా నూనెలో ఎండుమిర్చి, కరివేపాకు, జీలకర్రను వేయించి పొడి చేసి ఉంచుకోవాలి.

కడాయ్‌లో ఆయిల్ తీసుకుని ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి పోపు వేశాక.. ఉల్లిపాయ పచ్చిమిర్చి వేసి బాగా వేయించి పాలకూరను వేసి, 4 నిముషాల పాటు కలిపి మగ్గించాలి. పసుపు, ఉప్పు కూడ వేసి మరొక 4 నిముషాల పాటు వేయించాలి. స్టవ్ కట్టేసి ముందుగా సిద్ధం చేసుకున్న కారంపొడిని కలిపి.. మరొక రెండు నిముషాలు మూతపెట్టి అలానే ఉంచి దించేయాలి.

అద్భుతమైన రుచితో ఘుమఘుమలాడే పాలకూర కూర సిద్ధం.



దానిమ్మ పచ్చడి

కావాల్సిన పదార్థాలు

దానిమ్మ గింజలు- 200 గ్రాములు, పచ్చిమిర్చి- 10, ఉప్పు- ఒకటి ముప్పావు టీస్పూన్, పసుపు- పావు టీస్పూన్, ఇంగువ- చిటికెడు, జీలకర్రపొడి- 1 టీస్పూన్, పంచదార- ఒకటిన్నర టీస్పూన్, కరివేపాకు- కొద్దిగా, వేయించి దంచిన నువ్వుల పొడి- 40 గ్రాములు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- 1 కట్ట, ఆవాలు- అరటీస్పూన్, జీలకర్ర- అరటీస్పూన్, మినప్పప్పు- అరటీస్పూన్, శనగపప్పు- అరటీస్పూన్

తయారీ విధానం

ముందుగా మిక్సీలో దానిమ్మ గింజలు, పచ్చిమిర్చి, ఉప్పు, పసుపు, ఇంగువ, జీలకర్ర, పంచదార, కరివేపాకు వేయించి దంచిన నవ్వుల పొడి, కొత్తిమీర వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. మరీ పేస్ట్‌లా వద్దు. ఆటుపై నూనె లేదా నెయ్యిలో ఆవాలు, జీలకర్రపొడి, మినప్పప్పు, శనగపప్పుతో తాలింపు చేయాలి. కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని భేషుగ్గా వడ్డించాలి.



శైలజ
సైలాస్ కిచెన్,
యూట్యూబ్ ఛానల్
asksailaw@gmail.com

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/dvvhzfB
లో చదవండి.

ఈ ప్రొటీన్ ఫుడ్.. మంచిదే!

మంచి ప్రొటీన్ ఫుడ్ తింటే కండ గట్టిగా ఉంటుంది. అంతేనా... కణజాల వ్యవస్థను నిర్మించటానికి, ఎంజైమ్‌ల ఉత్పత్తికి దోహదపడుతుంది. కండరాలతో పాటు ఎముకలు, చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రొటీన్ ఫుడ్ తినటం అవసరం.

- ప్రొటీన్ అంటేనే మనకు గుర్తొచ్చేది కోడి గుడ్లు. ఒక్కో కోడి గుడ్డులోని తెల్లసొనలో నాలుగు గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. పచ్చసొనతో పోలిస్తే తెల్లసొనలో మంచి ప్రొటీన్ ఉంటుంది.
- సాల్మన్ చేపల్లో 22 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇవి తినటం వల్ల శరీరంలో కొవ్వు పెరగదు.
- ఇరవై ఎనిమిది గ్రాముల ఆల్మండ్స్‌లో ఆరు గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. అందుకే వీటిని ప్రతిరోజూ రాత్రి నానబెట్టి కనీసం రెండు లేదా మూడు ఆల్మండ్స్‌ను తినటం మంచిది. జీడిపప్పును కూడా తింటే ప్రొటీన్లు శరీరానికి అందుతాయి.
- పాలు, పెరుగు, వెన్నల్లో కూడా ప్రొటీన్ ఉంటుంది. అందుకే పిల్లలయినా, పెద్దలయినా పాల ఉత్పత్తులను తినటం మంచిదే.
- చికెన్, మటన్‌లో కూడా హై ప్రొటీన్స్ ఉంటాయి. అయితే వీటితో పాటు శాకాహారంలో కూడా మంచి ప్రొటీన్లు ఉంటాయి. అవే గుమ్మడి గింజల్లో మంచి ప్రొటీన్లు ఉంటాయి. వంద గ్రాముల వేరుశనగల్లో 25 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.
- సోయా ఉత్పత్తులైన సోయా పాలు, సోయా పెరుగు, సోయా బీన్స్‌లో ప్రొటీన్ల శాతం ఎక్కువే.
- వంద గ్రాముల పనీర్‌లో 18 గ్రాములు ప్రొటీన్లు ఉన్నాయి. సన్‌ఫ్లవర్ విత్తనాలు కూడా ప్రొటీన్లు కలిగి ఉంటాయి.
- నూనెలో వేయించిన చీజ్, బటర్‌ను తినకూడదు. ప్రొటీన్లు అధికంగా తింటే కొవ్వు పదార్థాలు వచ్చి గుండె సంబంధ వ్యాధులు వస్తాయనే మాట అపోహ మాత్రమే. అయితే మరీ మితిమీరి ప్రొటీన్ ఫుడ్ తినొద్దు. ప్రొటీన్ ఫుడ్ తీసుకున్నాక సరైన వ్యాయామం చేయాలి. దీని వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.



సెలబ్ ఫిట్

కంగనా రనౌత్...
ఆ పేరే ఒక బ్రాండ్...
చిత్రసీమలో అయినా... రాజకీయాల్లో అయినా!
తన అద్భుతమైన నటనతో ఎంతలా ప్రేక్షకుల మనుసు దోచుకుందో...
కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడి అంతే స్థాయిలో వివాదాలు కొనితెచ్చుకుంది.
పాత్ర కోరుకొంటే బరువు పెరగడానికైనా... తగ్గడానికైనా ఆమె ఎప్పుడూ సిద్ధం.
పదిహేడేళ్లకే తెరంగేట్రం చేసిన కంగనా... ఇప్పుడు ముప్ఫై ఆరేళ్ల వయసులోనూ ముగ్ధ మనోహరిలా ఆకట్టుకుంటోంది.

సహజ సౌందర్యం

'గ్యాంగ్‌స్టర్'తో హిందీ పరిశ్రమలో అడుగుపెట్టిన కంగనా... కొన్ని దక్షణాది చిత్రాల్లోనూ నటించింది. కథ నచ్చితే భాష ఏదన్నది ఆమె పట్టించుకోదు. పదిహేడేళ్లకు షైబడిన కెరీర్... నాలుగు పదులు దాటిన సినిమాలు... వేటికవే ప్రత్యేకత గల పాత్రలు... నటిగా ఆమెను మరో స్థాయిలో నిలబెట్టాయి. హిమాచల్‌ప్రదేశ్ మండి జిల్లాలోని భంబ్లా అనే చిన్న పట్టణంలో పుట్టిన కంగనా... చిన్నప్పటి నుంచి స్వతంత్ర భావాలతో పెరిగింది. ఆమె తండ్రి అమర్‌దీప్ రనౌత్ వ్యాపారవేత్త. తల్లి ఆశా ఉపాధ్యాయురాలు. తాత సర్జూసింగ్ రనౌత్ మాజీ ఎమ్మెల్యే. ఉమ్మడి కుటుంబం. కూతుర్ని డాక్టర్‌ను చేయాలన్నది తల్లితండ్రుల కోరిక. కానీ పన్నెండో తరగతి యూనిట్ టెస్ట్‌లో కెమిస్ట్రీలో పాస్ కాలేకపోయింది. దాంతో ఎంబీబీఎస్ చదవాలనే ఆలోచన విరమించుకుంది. ఒకరిపై ఆధారపడకూడదన్న ఆలోచనతో పదహారేళ్ల వయసులోనే ఢిల్లీకి వెళ్లింది. మెడిసిన్ వద్దనుకోవడం, ఆ వయసులో స్వతంత్రంగా జీవించాలనుకోవడం కంగన తల్లితండ్రులకు అస్సలు నచ్చలేదు. తన మాట కాదని ఇల్లు వదిలి వెళ్లిపోయినందుకు కూతురుకు ఎలాంటి సాయం అందించకూడదని అమర్‌దీప్ నిర్ణయించుకున్నారు.



కంగనా నివాసం ఢిల్లీకైతే మారింది కానీ... అప్పటికి ఏ కెరీర్ ఎంచుకోవాలనే స్పష్టత ఆమెకు లేదు. ఆమె రూపాన్ని చూసిన ఓ ఏజెన్సీ మోడలింగ్ చేయమని సలహా ఇచ్చింది. అలా కొన్ని ప్రాజెక్ట్‌లు చేసింది. అయితే అందులో సృజనకు అవకాశం లేదని మోడలింగ్ వదిలేసింది. నటన వైపు చూపు మళ్లింది. 'అస్మిత థియేటర్ గ్రూప్'లో చేరి, నటనలో ఓనమాలు నేర్చుకుంది. తరువాత గిరీష్ కర్నాడ్ తదితర ప్రముఖులు రచించిన పలు నాటకాల్లో నటించి, ప్రశంసలు అందుకుంది. ఢిల్లీకి వెళ్లినప్పటి నుంచి కంగనా ఎన్నో అవస్థలు పడింది. చాలీచాలని సంపాదన. బ్రెడ్, పచ్చడి... ఇవే చాలా రోజులు ఆమెకు ఆహారం. థియేటర్ ఆర్టిస్ట్‌గా పలు ప్రదర్శనలు ఇచ్చాక... కంగన మనసు సినిమాల వైపు మళ్లింది. ముంబయికి వెళ్లి, అక్కడ యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంది. తొలి చిత్రంతోనే విమర్శకుల ప్రశంసలు అందుకున్న కంగనా... ఆ తరువాత వరుస అవకాశాలతో దూసుకుపోయింది. ఏడాదికి రెండు... మూడు... ఆరు సినిమాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

పాత్ర ఏదైనా అందులో ఆమె లీనమైపోతుంది. తెర మీద దాన్ని పండించేందుకు ఎన్ని వ్యయప్రయాసలకైనా వెనకాడదు. కథ డిమాండ్ చేస్తే బొద్దుగా మారిపోతుంది... సన్నజాజి తీగలానూ మురిపిస్తుంది. అంతలా తన శరీరాన్ని సాన పెట్టింది. 'తలైవి' కోసం బరువు పెరిగిన ఆమె... రాబోయే 'ఎమర్జెన్సీ' కోసం జిమ్‌లో తీవ్ర కసరత్తులు చేసింది.

వర్కవుట్ ఇలా...

'సహజ సౌందర్యవతి'గా బాలీవుడ్‌లో పేరు పొందిన కంగనా రనౌత్... దానికి తగ్గట్టుగానే శరీరాన్ని ఎప్పటికప్పుడు అదుపులో పెట్టుకుంటుంది. తినే తిండి విషయంలో జాగ్రత్తలు ఎన్నో పాటిస్తుంది. వారానికి కనీసం ఐదు రోజులు జిమ్‌కు వెళుతుంది. వ్యక్తిగత ట్రైనర్ లీనా మోర్గే పర్యవేక్షణలో కఠోర వ్యాయామాలు చేస్తుంది. వీటిల్లో కార్డియో మొదలు యోగా వరకు అన్నీ ఉంటాయి. కేవలం యోగా కోసమే రోజూ ముప్పావు గంట కేటాయిస్తుంది ఈ భామ. చివరగా పది నిమిషాల ధ్యానంతో ముగిస్తుంది. ఒకవేళ రెగ్యులర్ వర్కవుట్స్‌తో బోర్ కొడితే డ్యాన్స్‌తో కేలరీలు కరిగిస్తుంది.

- రోజూ ఉదయం రన్నింగ్. కుదిరినప్పుడల్లా పర్వత ప్రాంతాల్లో పరుగెడుతుంది.
- జిమ్‌లో గంటల తరబడి గడుపుతుంది. కార్డియోతో పాటు పుల్ అప్స్, పుషప్స్, స్క్వాట్స్, వెయిట్ ట్రైనింగ్ ఉంటాయి.
- కంగనా ఫిట్‌నెస్ ట్రైనింగ్‌లో యోగా కూడా భాగం. తన శరీరానికి యోగా కీలకమని ఆమె భావిస్తుంది. క్లిష్టమైన ఆసనాలు సులువుగా వేయగలదు.
- మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కోసం రోజూ తప్పనిసరిగా ధ్యానం.
- రోజువారీ వ్యాయామాలకు భిన్నంగా అప్పుడప్పుడు కిక్ బాక్సింగ్. దీన్ని ఆమె బాగా ఆస్వాదిస్తుంది.
- వ్యాయామాలకు విరామం ఇచ్చినప్పుడు స్విమ్మింగ్, డ్యాన్స్.



ఇదీ మెనూ...

కంగనా పూర్తి శాకాహారి. ఆరోగ్యకరమైన, పుష్కలంగా పోషక విలువలు కలిగిన తాజా ఆహారం తీసుకొంటుంది.

- ఉదయం లేవగానే గ్లాసుడు నీళ్లు
- బ్రేక్‌ఫాస్ట్‌లో గంజి, తృణధాన్యాలతో పాలు.
- మధ్యాహ్న భోజనానికి ముందు తాజా పండ్లు, ప్రొటీన్ షేక్, బ్రౌన్ బ్రెడ్
- లంచ్‌లో అన్నం, రోటీ, పప్పు, ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు, సలాడ్
- రాత్రి భోజనంలో తేలికపాటి ఆహారం. వెజిటబుల్ సూప్, ఉడకబెట్టిన కూరగాయ ముక్కలు, సలాడ్

యశస్వీభవ

జైస్వాల్ అజేయ శతకం

భారత్ తొలి ఇన్నింగ్స్ 336/6

ఇంగ్లండ్‌తో రెండో టెస్టు


యశస్వీ జైస్వాల్ (257 బంతుల్లో 179 బ్యాటింగ్)

2 ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టుల్లో ఒకే రోజు అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా గవాస్కర్ (179)తో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచిన యశస్వీ జైస్వాల్. కరుణ్ నాయర్ (232) టాప్‌లో ఉన్నాడు. అలాగే ఏ జట్టుపై అయినా ఓవరాల్‌గా ఆరో భారత బ్యాటర్.

4 23 ఏళ్లు రాకముందే ఇంటా, బయటా టెస్టు సెంచరీలు సాధించిన నాలుగో భారత బ్యాటర్‌గా జైస్వాల్. రవిశాస్త్రి, సచిన్, వినోద్ కాంబ్లీ ముందున్నారు.

విశాఖపట్నం (స్పోర్ట్స్): విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన భారత జట్టు ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో తొలి రోజే ఆధిపత్యం కనబరచింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (257 బంతుల్లో 17 ఫోర్లు, 5 సిక్సర్లతో 179 బ్యాటింగ్) అంతులేని ఆత్మవిశ్వాసంతో అంతా తానై రోజంతా బరిలో నిలిచాడు. ఈ క్రమంలో కెరీర్‌లో రెండో అజేయ శతకంతో పాటు ఒంటిచేత్తో జట్టుకు భారీ స్కోరు అందించాడు. అయితే బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న ఈ పిచ్‌పై మిగతా బ్యాటర్లు కనీసం అర్ధసెంచరీ చేయకపోవడం గమనార్హం. శుక్రవారం ఆట ముగిసే సరికి భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 93 ఓవర్లలో 6 వికెట్లకు 336 పరుగులు సాధించింది. గిల్ (34), రజత్ (32) పర్వాలేదనిపించారు. క్రీజులో జైస్వాల్‌తో పాటు అశ్విన్ (5) ఉన్నాడు. రెండో రోజు జట్టు 450-500 పరుగుల స్కోరు లక్ష్యంగా బ్యాటింగ్ సాగించాల్సి ఉంటుంది. ఆదివారం నుంచి వికెట్ బౌన్స్ అయ్యే చాన్సుండడంతో ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచవచ్చు. స్పిన్నర్లు షోయబ్ బషీర్, రెహాన్ అహ్మద్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. అయితే ఇంగ్లండ్ బౌలర్లు ఒకే ఒక్క ఎక్స్‌ట్రా (నోబ్) ఇవ్వడం విశేషం. భారత తుది జట్టులో కుల్దీప్, రజత్, ముకేశ్‌లకు చోటు దక్కింది.



1 భారత్‌లో టెస్టు ఆడిన అతిపెద్ద వయస్సు (41 ఏళ్లు) పేసర్‌గా అండర్సన్.

ఆరంభం..నిదానం: టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్‌కు దిగగా.. ఫ్లాట్ వికెట్‌ను సద్వినియోగం చేసుకుంటూ యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ అదరగొట్టాడు. అద్భుత భాగస్వామ్యాలతో సెంచరీతో పాటు జట్టుకు విలువైన పరుగులు అందిస్తూ డబుల్ సెంచరీకి చేరువయ్యాడు. 6.4 అడుగుల ఎత్తున్న అరంగేట్ర స్పిన్నర్ బషీర్ బౌన్స్‌ను రాబడుతూ ఇబ్బందిపెట్టాడు. తొలి గంట ఓపెనర్లు జైస్వాల్, రోహిత్ (14) నిదానంగా ఆడుతూ 16 ఓవర్లలో 40 పరుగులే అందించారు. 41 ఏళ్ల పేసర్ అండర్సన్ కచ్చితమైన బంతులతో పరుగులను నియంత్రించాడు. స్పిన్నర్ బషీర్ తన తొలి వికెట్‌గా రోహిత్‌ను అవుట్ చేశాడు. ఆ తర్వాత జైస్వాల్ స్వీప్, కట్ షాట్లతో బౌండరీలు బాదాడు. గిల్ ఆత్మవిశ్వాసంతో కనిపించినా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. రెండో వికెట్‌కు 49 రన్స్ చేరాక గిల్‌ను అండర్సన్ అవుట్ చేశాడు. లంచ్ బ్రేక్‌కల్లా జట్టు స్కోరు 103/2.

జైస్వాల్ శతకం: రెండో సెషన్‌లో గేరు మార్చిన యశస్వీ చక్కటి స్ట్రోక్‌ప్లేతో ఎదురుదాడికి దిగాడు. దీంతో ఈ సెషన్‌లో జట్టు 122 పరుగులు సాధించింది. మరోసారి విఫలమైన శ్రేయాస్ అయ్యర్ వికెట్‌ను మాత్రమే ఇంగ్లండ్ బౌలర్లు తీయగలిగారు. తొలి ఫిఫ్టీని 89 బంతుల్లో సాధించిన జైస్వాల్ సెంచరీని మాత్రం మరో 62 పరుగుల్లోనే అందుకున్నాడు. లెగ్‌స్పిన్నర్ హార్ట్లీ ఓవర్‌లో ముందుకువచ్చి లాంగాన్‌లో సంధించిన సిక్సర్‌తో శతకం పూర్తి చేశాడు. ఈ సెషన్‌లో తను ఎక్కువగా డ్రైవ్ షాట్లు ఆడాడు. హార్ట్లీని లక్ష్యంగా చేసుకుంటూ 45వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో సత్తా చూపాడు. అలాగే శ్రేయాస్ (27)తో కలిసి మూడో వికెట్‌కు 90 పరుగులు జోడించడం విశేషం. అనంతరం తొలి టెస్టు ఆడుతున్న రజత్ పటీదార్ తడబాటు లేకుండా బ్యాటింగ్ సాగించాడు. రివర్స్ స్వీప్ షాట్లతోనూ ఆకట్టుకున్నాడు.

నిరాశపర్చిన భరత్: ఆఖరి సెషన్‌లో ఇంగ్లండ్ బౌలర్లు కాస్త పుంజుకుని మూడు వికెట్లు పడగొట్టారు. 68వ ఓవర్‌లో జైస్వాల్ 6,4తో ఆకట్టుకున్నా, కాసేపటికే రజత్ వికెట్‌ను రెహాన్ తీయడంతో నాలుగో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే అక్షర్ (27)తోనూ ఐదో వికెట్‌కు 52 పరుగులు జోడించడంతో జట్టు స్కోరు 300 దాటింది. అయితే లోకల్ బాయ్ కేఎస్ భరత్ నిరాశ పరిచాడు. 90వ ఓవర్‌లో సిక్సర్ బాదిన అతను ఉన్న కాసేపు వేగం చూపాడు. కానీ మరో రెండు ఓవర్లలో తొలి రోజు ఆట ముగుస్తుందనగా రెహాన్ ఓవర్‌లో వెనుదిరిగాడు.

తొలిరోజు హాజరు 15,600

మ్యాచ్ మొదటిరోజు సుమారు 15,600 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. రెండు వేల మంది విద్యార్థులతోపాటు ఏసీఏ పరిధిలోని క్లబ్ క్రికెటర్లకు కూడా ఉచిత ప్రవేశం కల్పించిన నేపథ్యంలో గ్యాలరీలలో ప్రేక్షకుల తాకిడి కనిపించింది. అలాగే ఇంగ్లండ్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడం విశేషం. కాగా స్టేడియం పూర్తి సామర్థ్యం 27 వేలు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 179; రోహిత్ (సి) పోప్ (బి) బషీర్ 14; గిల్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 34; శ్రేయాస్ (సి) ఫోక్స్ (బి) హార్ట్లీ 27; రజత్ (బి) రెహాన్ 32; అక్షర్ (సి) రెహాన్ (బి) బషీర్ 27; భరత్ (సి) బషీర్ (బి) రెహాన్ 17; అశ్విన్ (బ్యాటింగ్) 5; ఎక్స్‌ట్రాలు: 1; **మొత్తం: 93 ఓవర్లలో 336/6; వికెట్ల పతనం:** 1-40, 2-89, 3-179, 4-249, 5-301, 6-330; **బౌలింగ్:** అండర్సన్ 17-3-30-1; రూట్ 14-0-71-0; హార్ట్లీ 18-2-74-1; బషీర్ 28-0-100-2; రెహాన్ 16-2-61-2.

సిరాజ్‌కు విశ్రాంతి

విశాఖపట్నం: సుదీర్ఘ సిరీస్ కావడంతో పని ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని పేసర్ మహ్మద్ సిరాజ్‌కు రెండో టెస్టు నుంచి విశ్రాంతినిచ్చినట్టు బీసీసీఐ ప్రకటించింది. కొన్ని నెలలుగా సిరాజ్ అవిశ్రాంతంగా క్రికెట్ ఆడుతున్నాడు. అతడి స్థానంలో రంజీ కోసం విడుదల చేసిన పేసర్ అవేశ్‌ను తిరిగి జట్టులోకి రప్పించారు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి ఉన్న సిరాజ్ ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు అందుబాటులో ఉంటాడు.

అస్మిత అదరహో

'థాయ్‌లాండ్' నుంచి గాయత్రి జోడీ అవుట్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వాలిఫయర్‌గా అడుగుపెట్టిన అస్మిత సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో అస్మిత 21-14, 19-21, 21-13తో 44వ ర్యాంకర్ ఎస్తర్ వార్దాయో (ఇండోనేసియా)ను ఓడించింది. మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో గాయత్రి గోపీచంద్/ట్రిసా జాలీ జంట 12-21, 21-17, 21-23తో ఇండోనేసియా జోడీ ఫెబ్రియానా/అమేలియా చేతిలో ఓడగా, పురుషుల సింగిల్స్‌లో మిథున్ మంజునాథ్ 19-21, 15-21తో మార్క్ కాలిజౌ (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

గిరినాథ్ పాంచ్ పటాక

బిహార్ 182 ఆలౌట్ ● ఆంధ్రతో రంజీ



పట్నా: పేసర్ గిరినాథ్ రెడ్డి (5/23) ఐదు వికెట్లతో చెలరేగడంతో ఆంధ్రతో శుక్రవారం మొదలైన ఎలిట్ గ్రూప్ 'బి' రంజీ మ్యాచ్‌లో బిహార్ 182 పరుగులకే కుప్పకూలింది. ప్రతాప్ సింగ్ (92) అర్ధ శతకంతో సత్తా చాటాడు. నితీశ్ కుమార్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఇక..మిజోరంతో ప్లేట్ మ్యాచ్‌లో తొలిరోజే హైదరాబాద్ పైచేయి సాధించింది. హైదరాబాద్ బౌలర్ల ధాటికి మిజోరం 199 పరుగులకే ఆలౌటైంది. అనంతరం శుక్రవారం ఆఖరికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 120/1 స్కోరు చేసింది.

సెమీస్‌లో మన కుర్రాళ్లు

- సచిన్, ఉదయ్ శతకాలు
- నేపాల్‌పై ఘనవిజయం
- అండర్-19 వరల్డ్‌కప్


సచిన్, ఉదయ్

బ్లూమ్‌ఫొంటీన్: ఓటమనేదే లేకుండా దూసుకెళుతున్న భారత కుర్రాళ్లు అండర్-19 వరల్డ్‌కప్ సెమీఫైనల్లో ప్రవేశించారు. శుక్రవారం నేపాల్‌తో జరిగిన రెండో సూపర్ సిక్స్ మ్యాచ్‌లో భారత్ 132 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కిది వరుసగా ఐదో గెలుపు. సెమీస్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాతో తలపడుతుంది. సచిన్ దాస్ (116), కెప్టెన్ ఉదయ్ సహరన్ (100) సెంచరీలతో చెలరేగి నాలుగో వికెట్‌కు రికార్డు స్థాయిలో 215 పరుగులు జోడించారు. దీంతో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 297/5 స్కోరు సాధించింది. ఛేదనలో నేపాల్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 165 పరుగులు చేసి ఓడింది. కెప్టెన్ దేవ్ ఖనాల్ (33) టాప్ స్కోరర్. లెఫ్టామ్ స్పిన్నర్ సౌమీ పాండేకు 4, అర్షిన్‌కు 2 వికెట్లు దక్కాయి. ఇతర మ్యాచ్‌ల్లో శ్రీలంకపై 119 రన్స్‌తో సౌతాఫ్రికా గెలవగా.. ఆసీస్-విండీస్ మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది.

కామెంట్రీ మధ్యలోనే వెళ్లిపోయాడు..

భారత్-ఇంగ్లండ్ రెండో టెస్టుకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తొలి రోజు ఆట మధ్యలోనే వెళ్లిపోయాడు. తన అత్తయ్య పుష్ప మెహ్రోత్రా మృతి చెందారన్న వార్తతో అతడు శుక్రవారం మధ్యాహ్నమే హుటాహుటిన విశాఖ నుంచి కాన్పూర్ బయలుదేరాడు. 2022 డిసెంబరులో భారత్-బంగ్లాదేశ్ టెస్టు సందర్భంగా సన్నీ కామెంట్రీ విధుల్లో ఉన్నప్పుడే అతడి తల్లి కూడా మరణించడం గమనార్హం.

భారత్ 'ఎ'కి ఆధిక్యం

అహ్మదాబాద్: ఇంగ్లండ్ లయన్స్‌తో మూడో, చివరి అనధికార టెస్ట్‌లో భారత్ 'ఎ' పైచేయి సాధించింది. లయన్స్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 199 పరుగులకే ఆలౌట్ చేసిన భారత్ 'ఎ'..అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆఖరికి 148/3 స్కోరు చేసింది. ప్రస్తుతం ఆతిథ్య జట్టు 141 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 98/1తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లయన్స్ మరో 101 రన్స్ చేసి మిగిలిన 9 వికెట్లు చేజార్చుకుంది. భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 192 రన్స్ చేసిన సంగతి తెలిసిందే.

వారియర్స్, స్టీలర్స్ జోరు

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్‌లో బెంగాల్ వారియర్స్, హరియాణా స్టీలర్స్ జోరు కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పోరులో వారియర్స్ 45-38తో దబాంగ్ ఢిల్లీపై, స్టీలర్స్ 34-30తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచాయి.

చెలరేగిన బార్ట్‌లెట్

తొలి వన్డేలో ఆసీస్ గెలుపు

మెల్‌బోర్న్: యువ పేసర్ జేవియర్ బార్ట్‌లెట్ (4/17) అరంగేట్రంలో అదరగొట్టగా, గ్రీన్ (2/40, 77 నాటౌట్) ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకోవడంతో వెస్టిండీస్‌తో శుక్రవారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా ఎనిమిది వికెట్లతో నెగ్గింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన పర్యాటక జట్టు 48.4 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కార్టీ (88), చేజ్ (59) అర్ధ శతకాలు చేశారు. ఛేదనను ఆస్ట్రేలియా 38.3 ఓవర్లలో 232/2 స్కోరుతో పూర్తి చేసింది. స్మిత్ (79 నాటౌట్), ఇంగ్లిస్ (65) హాఫ్ సెంచరీలతో చెలరేగారు.

ఫేవరెట్ భారత్

పాక్‌తో డేవిస్ కప్ నేటినుంచి



డ్రా ఇలా..

శనివారం	
మొదటి సింగిల్స్	రామ్‌కుమార్ x ఖురేషి
రెండో సింగిల్స్	అఖీల్ x శ్రీరామ్
ఆదివారం	
డబుల్స్	బర్కతుల్లా/ముర్తజా x యుకీ /సాకేత్
తొలి రివర్స్ సింగిల్స్	రామ్‌కుమార్ x అఖీల్ ఖాన్
రెండో సింగిల్స్	ఖురేషి x శ్రీరామ్

ఇస్లామాబాద్: అరవై సంవత్సరాల తర్వాత దాయాది గడ్డపై అడుగుపెట్టిన భారత డేవిస్ కప్ జట్టు శనివారం నుంచి పాకిస్థాన్‌తో జరిగే చారిత్రక డేవిస్ కప్ గ్రూప్-1 ప్లేఆఫ్ పోరులో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డేవిస్ కప్‌లో ఇప్పటిదాకా ఇరు జట్లు ఏడుసార్లు తలపడగా..అన్నిసార్లూ భారత్‌దే విజయం. ఈసారి సింగిల్స్‌లో స్టార్ ఆటగాళ్లు లేకున్నా భారత జట్టు బలీయంగానే ఉంది.

అఫ్ఘానిస్థాన్ 198 ఆలౌట్


కొలంబో: శ్రీలంక పేసర్ల ధాటికి శుక్రవారం మొదలైన ఏకైక టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. రెహ్మత్ షా (91) ఒక్కడే రాణించాడు. విశ్వ ఫెర్నాండో 4, అసిత ఫెర్నాండో, ప్రభాత్ చెరి మూడేసి వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ చేపట్టిన లంక తొలి రోజు ఆఖరికి వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది.

బిజినెస్

నిఫ్టీ సరికొత్త రికార్డు

ఇంట్రాడేలో 22,126 పాయింట్లను తాకిన సూచీ ..

73,000 మార్క్ దాటిన సెన్సెక్స్



ఆల్‌టైం గరిష్ఠానికి మార్కెట్ సంపద ..

రూ.382.77 లక్షల కోట్లకు చేరిక..

ముంబై: దలాల్‌స్ట్రీట్‌లో మళ్లీ రికార్డుల మోత మోగింది. శుక్రవారం ట్రేడింగ్‌లో నిఫ్టీ ఆల్‌టైం రికార్డు స్థాయికి ఎగబాకింది. అంతర్జాతీయ మార్కెట్లు ర్యాలీ తీయడంతో దేశీయంగానూ మదుపరులు రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి మార్కెట్ దిగ్గజ షేర్లలో జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. ఒక దశలో 1,444 పాయింట్లు ఎగబాకి 73,089.40 వద్దకు చేరుకున్న సెన్సెక్స్. చివరికి 440.33 పాయింట్ల లాభంతో 72,085.63 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 156.35 పాయింట్ల వృద్ధితో 21,853.80 వద్ద క్లోజైంది. సూచీ ఒక దశలో 429.35 పాయింట్ల లాభంతో 22,126.80 వద్ద సరికొత్త ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కొనుగోళ్ల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం ఒక్క రోజులో రూ.3.34 లక్షల కోట్లు వృద్ధి చెంది సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.382.77 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 లాభపడ్డాయి. పవర్‌గ్రిడ్ 4.10 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎన్‌టీపీసీ 3.34 శాతం, టీసీఎస్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, విప్రో, ఇన్ఫోసిస్, రిలయన్స్, టెక్ మహీంద్రా షేర్లు రెండు శాతానికి పైగా పుంజుకున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ మాత్రం ఒక శాతానికి పైగా క్షీణించాయి. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 1,384.96 పాయింట్లు (1.95 శాతం), నిఫ్టీ 501.2 పాయింట్లు (2.34 శాతం) బలపడ్డాయి.

ఆధార్ హౌసింగ్ రూ.5,000 కోట్ల ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా ఈ ఫైనాన్స్ కంపెనీ రూ.1,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్‌కు చెందిన రూ.4,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించాలనుకుంటోంది. దీంతో పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.5,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ నెల 7న 3 ఐపీఓలు షురూ

ఫిబ్రవరి 7న రెండు స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లతో పాటు ఐసీటీ ఉత్పత్తుల డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఐపీఓలు ప్రారంభం కానున్నాయి. రూ.523 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఇష్యూకు వస్తున్న క్యాపిటల్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.445-468గా నిర్ణయించింది. కాగా, జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.393-414గా ఖరారు చేసింది. ఇష్యూ ద్వారా గరిష్ఠంగా రూ.570 కోట్లు సమీకరించాలనుకుంటోంది. రాశి పెరిఫెరల్స్ ఇష్యూ ధరల శ్రేణిని రూ.295-311గా నిర్ణయించింది. తద్వారా రూ.600 కోట్ల వరకు సమీకరించనుంది.

రూ.20 లక్షల కోట్లకు చేరువలో రిలయన్స్

స్టాక్ మార్కెట్లో అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు ధర సరికొత్త జీవితకాల గరిష్ఠానికి ఎగబాకింది. బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక దశలో 3.40 శాతం లాభంతో రూ.2,949.90 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 2.18 శాతం లాభంతో రూ.2,914.75 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.41,860.54 కోట్లు పెరిగి మొత్తం రూ.19,72,028.45 కోట్లకు చేరుకుంది. ఈ ఏడాదిలో ఇప్పటికే 12.76 శాతం వృద్ధి చెందిన రిలయన్స్ షేరు ధర.. ముమ్ముందు సెషన్లలో రూ.3,000 దిశగా దూసుకెళ్లనుందని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లెక్కన కంపెనీ మార్కెట్ విలువ త్వరలోనే రూ.20 లక్షల కోట్ల మైలురాయిని దాటే అవకాశాలున్నాయి.

కొత్త ఐటీ రిటర్న్ ఫామ్స్ : సీబీడీటీ

న్యూఢిల్లీ: 2024-25 పన్ను మదింపు సంవత్సరానికి (ఏవై) సంబంధించి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ.. ఐటీఆర్ 2,3,5 పేరుతో కొత్త ఐటీ రిటర్న్ ఫామ్స్ విడుదల చేసింది. వ్యాపార లేదా వృత్తిపరమైన ఆదాయం లేని వ్యక్తులు, అవిభక్త హిందూ కుటుంబాలు (హెచ్‌యూఎఫ్).. ఐటీఆర్-2 ద్వారా, వ్యాపార లేదా వృత్తిపరమైన ఆదాయం ఉన్న వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు ఐటీఆర్-3 ద్వారా, భాగస్వామ్య సంస్థలు, ఎల్ఎల్‌పీలు ఐటీఆర్-5 ద్వారా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. ఈ రిటర్న్‌లు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తెలిపింది. ఐటీఆర్-1, ఐటీఆర్-6 ఐటీ శాఖ ఇంతకు ముందే విడుదల చేసింది. వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉన్న వ్యక్తులు ఐటీఆర్-1 ద్వారా, కంపెనీలు ఐటీఆర్-6 ద్వారా తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలి.

బీఓఐ లాభంలో 62% వృద్ధి

Bank of India

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ).. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో 1,870 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.1,151 కోట్లతో పోల్చితే ఇది 62 శాతం అధికం. ఇదే కాలంలో బ్యాంక్ ఆదాయం రూ.12,728 కోట్ల నుంచి రూ.14,160 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు (మొండి బకాయిలు) 7.66 శాతం నుంచి 5.35 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.61 శాతం నుంచి 1.41 శాతానికి తగ్గాయి. డిసెంబరు చివరి నాటికి బ్యాంక్ సీఏఆర్ 16.06 శాతం ఉంది. ఈ త్రైమాసికంలో బ్యాంక్ రూ.10 ముఖ విలువ గల 44,91,01,796 అదనపు ఈక్విటీ షేర్లు రూ.100.20 ధరకు జారీ చేయడం ద్వారా రూ.4,500 కోట్లు సమీకరించింది. దీంతో డిసెంబరు 31 నాటికి బ్యాంకులో ప్రభుత్వ వాటా 73.38 శాతానికి తగ్గింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,600 ▲	58,300 ▲	78,000 ▲
ముంబై	63,142 ▲	57,838 ▲	71,864 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ		విజయవాడ	528
హైదరాబాద్	525	విశాఖపట్నం	550
3వ తేదీ		వరంగల్	527
చిత్తూరు	573		
గోదావరి	528	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	గోదావరి	108
వరంగల్	99		
కరీంనగర్	99	విజయవాడ	108
మహబూబ్‌నగర్	99	గుంటూరు	109
		ఒంగోలు	109
కర్నూలు	99		
విశాఖపట్నం	105	చిత్తూరు	113

ఫిబ్రవరి 29 తర్వాత కూడా పేటీఎం యాప్ సేవలు కొనసాగుతాయ్..

ముంబై: డిజిటల్ చెల్లింపుల వేదికైన పేటీఎం యాప్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని, ఫిబ్రవరి 29 తర్వాత యాప్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని కంపెనీ సీఈఓ విజయ్ శేఖర్ శర్మ శుక్రవారం ఎక్స్ (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)పై ఆర్‌బీఐ కఠిన ఆంక్షల నేపథ్యంలో పేటీఎం యాప్ సేవల కొనసాగింపుపై యూజర్లలో ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో ఆయన స్పష్టత నిచ్చారు. ఈ నెలాఖరు తర్వాత నుంచి పీపీబీఎల్ డిపాజిట్లు స్వీకరించకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతో పాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు (ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆర్‌బీఐ బుధవారం ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, క్యాష్ బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమ చేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ ట్రాన్సాక్షన్లు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందించడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది.

పేటీఎం షేరు మరో 20 శాతం డౌన్: ఆర్‌బీఐ ఆంక్షల ప్రభావంతో పేటీఎం బ్రాండ్ మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేరు ధర శుక్రవారం మరో 20 శాతం క్షీణించి రూ.487.05కు పడిపోయింది. క్రితం (గురువారం) సెషన్లోనూ కంపెనీ షేరు ఇరవై శాతం పతనమైంది. ఈ రెండ్రోజుల్లో షేరు 40 శాతం నష్టపోవడంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17,378 కోట్లు తగ్గి రూ.30,931 కోట్లకు పడిపోయింది.

రూ.244 కోట్ల షేర్లను కొనుగోలు చేసిన మోర్గాన్ స్టాన్లీ

అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ శుక్రవారం పేటీఎంకు చెందిన రూ.244 కోట్ల విలువైన షేర్లను బహిరంగ మార్కెట్ ద్వారా కొనుగోలు చేసింది.

ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీల్లో మరింత వాటాల విక్రయం

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)తో పాటు చమురు, సహజవాయువు ఉత్పత్తి దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)లో మరింత వాటాల విక్రయానికి సిద్ధంగా ఉన్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఒక బిజినెస్ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయం వెల్లడించారు. ఈ రెండు కంపెనీల ఈక్విటీలో 50 శాతం కంటే తక్కువ వాటా కలిగి ఉండేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం బ్లూచిప్ కంపెనీలుగా పరిగణించే ఓఎన్‌జీసీ ఈక్విటీలో 58.89 శాతం, ఎస్‌బీఐలో 57.47 శాతం వాటా కలిగి ఉంది. వృత్తిపరమైన నైపుణ్యాలు పెంచడం ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులు (పీఎస్‌బీ), ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) మార్కెట్ విలువ పెంచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక మంత్రి సీతారామన్ స్పష్టం చేశారు.

ప్రైవేటీకరణ తప్పదు

వచ్చే ఆర్థిక సంవత్సరం ఎట్టి పరిస్థితుల్లోనూ ఐడీబీఐ బ్యాంక్ ప్రైవేటీకరణ పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి తుహిన్ కాంత పాండే ఈ విషయం చెప్పారు. వచ్చే ఏడాది పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం ఇంతని బడ్జెట్‌లో పేర్కొనకపోయినా ఈ మొత్తం రూ.50,000 కోట్ల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.30,000 కోట్ల వరకు సమకూరే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ మౌలిక సదుపాయాల ఆస్తుల నగదీకరణ ద్వారా రూ.1.75 లక్షల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది రూ.1.5 లక్షల కోట్లు మించే అవకాశం లేదన్నారు.

నవ లిమిటెడ్ లాభం రూ.465 కోట్లు

హైదరాబాద్: నవ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి గాను కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.995 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.465 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఒక త్రైమాసికంలో ఈ స్థాయి లాభం ఆర్జించటం ఇదే తొలిసారని కంపెనీ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.362.80 కోట్లు)తో పోల్చితే లాభం 28.2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో ఎనర్జీ విభాగం పనితీరు మెరుగ్గా ఉండటం ఎంతగానో కలిసి వచ్చిందని పేర్కొంది. మరోవైపు మైనింగ్ డివిజన్ అమ్మకాలు ఆశించిన స్థాయిలో ఉండటంతో పాటు బొగ్గు విక్రయాలు పెరగటంతో లాభదాయకత పెరిగిందని తెలిపింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ డిసెంబరు త్రైమాసికంలో రూ.335.80 కోట్ల ఆదాయంపై రూ.45.1 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మరోవైపు డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ కన్సాలిడేటెడ్ దీర్ఘకాలిక రుణ భారం ఏకంగా 87 శాతం తగ్గుదలతో రూ.3,356 కోట్ల నుంచి రూ.761.30 కోట్లకు చేరింది.

టాటా మోటార్స్ లాభంలో భారీ వృద్ధి

ముంబై: డిసెంబరు త్రైమాసికంలో టాటా మోటార్స్ 133.32 శాతం వృద్ధితో రూ.7,100 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.3,043 కోట్లు. త్రైమాసిక సమీక్షా కాలంలో కన్సాలిడేటెడ్ ఆదాయం 25 శాతం పెరిగి రూ.1,10,600 కోట్లకు చేరింది. సీజనల్ డిమాండ్, కొత్త వాహనాలు ప్రవేశపెట్టడం, జేఎల్ఆర్ సరఫరాల మెరుగుదల ఫలితంగా నాలుగో త్రైమాసికంలో మరింత మెరుగైన పనితీరు ప్రదర్శించగలమన్న విశ్వాసం కంపెనీ ప్రకటించింది. డిసెంబరు త్రైమాసికంలో రుణ భారాన్ని రూ.9,500 కోట్లకు తగ్గించుకోగలిగామని కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ పీబీ బాలాజీ చెప్పారు.

- **తగ్గిన కావేరీ సీడ్స్ లాభం**

కావేరీ సీడ్స్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.1,42.63 కోట్ల రెవెన్యూపై రూ.11.78 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.144 కోట్లుగా ఉండగా నికర లాభం (రూ.38.09 కోట్లు) ఏకంగా 69 శాతం తగ్గింది.

మెడ్‌ప్లస్ లాభంలో స్వల్ప వృద్ధి

హైదరాబాద్: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ లాభం స్వల్పంగా పెరిగింది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,451.26 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.13.73 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1,201.67 కోట్ల ఆదాయంపై రూ.13.38 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఆదాయం పెరిగినప్పటికీ ఖర్చులు, పన్ను వ్యయాలు పెరిగిపోవటం పనితీరుపై ప్రభావం చూపించిందని పేర్కొంది. ఈ కాలంలో కంపెనీ మొత్త వ్యయాలు 20 శాతం పెరిగి రూ.1,431 కోట్లుగా నమోదయ్యాయి. డిసెంబరు త్రైమాసికంలో కొత్తగా 144 స్టోర్లను ప్రారంభించటంతో మొత్తం స్టోర్ల సంఖ్య 4,233కు చేరిందని మెడ్‌ప్లస్ వెల్లడించింది.

జగనన్నా... నీకు బాధ్యత లేదా?



(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత లేదా అని నిలదీశారు. 'చేస్తున్నది మా వాళ్ల కాదు' అని చేతులు దులుపుకొంటే సరిపోతుందా అని జగన్‌ను ప్రశ్నించారు. సోషల్ మీడియాలో ఇలాంటి ప్రచారాలు చేసే మూర్ఖులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. చేసే వాళ్లకంటే చేయించే వాళ్ల బాధ్యతే ఎక్కువని... స్పష్టం చేశారు. చివరికి... వైఎస్ షర్మిల పుట్టుకనూ ప్రశ్నించేలా పోస్టింగులు పెట్టడమేమిటని ఆక్రోశించారు. "సోషల్ మీడియాలో తనతోపాటు షర్మిల, విజయలక్ష్మిపై జరుగుతున్న దాడి, దూషణలు, బెదిరింపులపై శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే అంశంపై సునీతా రెడ్డి 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' చర్చలో పాల్గొన్నారు. సునీతా రెడ్డి ఆవేదన, ఆక్రోశం, ఆగ్రహం... ఆమె మాటల్లోనే!

ఇంత దారుణమా...

నాపై గతంలోనూ సోషల్ మీడియాలో వేదికగా దాడి జరిగింది. ఇప్పుడు మరింత శ్రుతి మించింది. చంపేస్తాం అని కూడా బెదిరిస్తున్నారు. అన్యాయంపై ఎదిరించి ప్రశ్నిస్తే ఇంత అసభ్యంగా దాడి చేస్తారా? అసలు సోషల్ మీడియాకు బాధ్యత ఉండదా? దీనిని ఎంతమాత్రం సహించకూడదు. మనదాకా వచ్చాక కూడా మౌనంగా ఉండకూడదు. అందుకే... పోలీసులకు ఫిర్యాదు చేశాను.

జగన్ ఏం చేస్తున్నట్లు?

ఇదంతా ఎవరు చేయిస్తున్నారో నాకు తెలియదు. కానీ... చేస్తున్నది ఎవరో గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చివరికి... 'షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదు' అని కూడా పోస్టులు పెట్టారు. ఇది తెలిసి కూడా కుమారుడు (జగన్) ఏం చేస్తున్నారు? ఆయన కూడా ఒక నాయకుడే కదా? ఇదేనా మనం నేర్చుకున్న సంస్కారం! ఒక లీడర్‌గా ఆయన బాధ్యత ఏంటి? మన పిల్లలకు మనం ఏం నేర్పిస్తున్నాం? ఆడవాళ్లను గౌరవించాలి. కనీసం సాటి మనుషులుగా అయినా చూడాలి కదా! షర్మిలకూ, నాకే ఇలా జరుగుతుంటే ఇక ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిన వారి పరిస్థితి ఏమిటి?

పులివెందుల ఎమ్మెల్యే ఎవరు?

(ఫేస్‌బుక్ అకౌంట్‌లో జగన్ భార్య భారతి పీఏ పేరుపైనే షర్మిలను దూషించే పోస్టులు వచ్చాయన్నప్పుడు...)

ఆ ఫేస్‌బుక్‌లో అకౌంట్ పేరున్న వ్యక్తి పులివెందులలో పోలీసులకు ఫిర్యాదు చేశారట! ఆ పోస్టులతో తనకు సంబంధం లేదని చెప్పారట! పులివెందులలో కేసు పెడితే ఏమవుతుంది? పులివెందుల ఎమ్మెల్యే ఎవరు? ఆ ఎమ్మెల్యేకు బాధ్యత ఉండదా? తల్లి, తండ్రి, కొడుకు, బంధుత్వం సంగతి వదిలేయండి! ఒక లీడర్‌గా, ఎమ్మెల్యేగా బాధ్యత ఉంటుంది కదా? మీ వాళ్లా, మా వాళ్లా నాకు అనవసరం. ఒక క్రైం జరిగింది, ఒక తప్పు జరిగింది! అది ఎవరు చేశారో కనుక్కోవాల్సిన బాధ్యత మీకు ఉంది కదా! మన ఇంట్లో వాళ్లకే మనం రక్షణ ఇవ్వలేకపోతే ఇక ప్రజల గురించి ఏం మాట్లాడతాం! ఇంకెక్కడా ఇలాంటి పరిస్థితి లేదు. ఏపీలోనే చూస్తున్నాం!

షర్మిల కులం అప్పుడు గుర్తులేదా?

(షర్మిల 'రెడ్డి' కాదు, ఆమె కులం వేరు అంటూ పెడుతున్న పోస్టులపై స్పందిస్తూ)

జగన్ జైల్లో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసింది. ఆమె పేరు, ఎవరిని పెళ్లి చేసుకున్నారో వీళ్లకు తెలియదా? పెళ్లిచేసుకున్నంత మాత్రాన పేరు మార్చుకోవాలా? షర్మిల రాజ్యాంగ పరిధిలో రాజకీయ పోరాటం చేస్తోంది. నేను న్యాయపోరాటం చేస్తున్నా. మా ఇద్దరి పోరాటాలు, లక్ష్యాలు వేర్వేరు. షర్మిల నాకు మద్దతు ఇచ్చింది. ఇపుడు షర్మిల చేస్తున్న పోరాటానికి నేను సంఘీభావం ప్రకటిస్తున్నా.

నాకు సామర్థ్యం లేదా?

(తమ వెనుక చంద్రబాబు ఉండి కుట్రలు చేయిస్తున్నారంటూ జగన్ రోత పత్రికలో వచ్చిన కథనంపై స్పందిస్తూ)

ఒకరు చెబితే చేస్తున్నానని అనడం ఏమిటి? ఇది నా సామర్థ్యాన్ని, మేధస్సును అవమానించడమే! నా కుటుంబం నా వెనుకే ఉంది. నాకు బయటివారు సపోర్ట్ అవసరం లేదు. అదృష్టమో, దురదృష్టమో... జగన్ నాకు అన్నే! 'జగనన్న' అనే అంటాను. అయితే... తప్పు ఎవరు చేసినా చెప్పాలి. కుటుంబ సభ్యులు చేస్తే ఇంకా కచ్చితంగా చెప్పాలి. ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు అంటుంటావే! ఇపుడు ఏమైంది? 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనే నేను' అని ఐదేళ్ల కిందట జగన్ సీఎంగా ప్రమాణం చేశారు. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా న్యాయం చేస్తానన్నారు. ఇప్పుడు... ఈ తప్పు జరుగుతోంది. 'మా వాళ్లు చేయలేదు' అని చేతులు కడిగేసుకుంటే సరిపోతుందా? సాకులు చెప్పడం, ఇతరులపై నెపం నెట్టడం ముఖ్యమంత్రి దగ్గరైనా ఆగిపోవాలి!

ఫోన్లున్నాయిగా... ఇడుపులపాయకే పోవాలా?

(ఇటీవల ఇడుపులపాయలో షర్మిలను కలిసి రాజకీయాంశాలపై చర్చించారా... అని అడిగినప్పుడు)

షర్మిలతో రాజకీయాల గురించి మాట్లాడేందుకు ఇడుపులపాయకే వెళ్లాలా? ఫోన్లు లేవా? హైదరాబాద్‌లో కలిసి మాట్లాడుకోలేమా? ఇంకా... నాకు ఇంకెవరో సలహాలు ఇస్తున్నారని, వెనుక ఉండి నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఇదీ నా ఉద్దేశం...

పులివెందులలో హత్యా రాజకీయాలు జరగకూడదు. అక్కడి పరిస్థితులు మెరుగుపడాలి. కడప అంటే బాంబులు అనే అభిప్రాయం పోవాలి. అందుకు నేనేం చేయాలో అది చేస్తాను. న్యాయ పోరాటంలో నా త్యాగం వృథా కాదు! సోషల్ మీడియాలో అసభ్యత పోవాలి. ఇలా చేస్తున్న వాళ్లను ప్రజలు తిరస్కరించాలి. తగిన బుద్ధి చెప్పాలి. ఇందుకు... ఎన్నికల రూపంలో ప్రజలకు మంచి అవకాశం వస్తోంది.

నీకూ మీ నాన్న గతే!

సోషల్ మీడియాలో బెదిరిస్తున్నారు

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో తనపై అసభ్యకర, బెదిరింపు పోస్టులు పెడుతున్నారంటూ పులివెందులకు చెందిన వర్ర రవీంద్ర రెడ్డిపై వివేకా కుమార్తె సునీతా రెడ్డి సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీస్‌లకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అసభ్యకర, బెదిరింపు పోస్టులు ఎక్కువయ్యాయని తనకు ప్రాణహాని ఉందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనతోపాటు షర్మిల, విజయమ్మనూ లక్ష్యంగా చేసుకుని బెదిరిస్తున్నారని తెలిపారు. "బాబాయ్‌కి (వివేకా) పట్టిన గతే నీకూ పడుతుంది. అవసరమైతే షర్మిల, విజయమ్మనూ వదలం. షర్మిల వాళ్ల నాన్నకు పుట్టలేదు"... ఇలా అసభ్య పదజాలంతో పోస్టులు పెట్టారని ఫిర్యాదులో తెలిపారు. ఇటీవల తాను షర్మిలను ఇడుపులపాయలో కలిసిన ఫొటోను పోస్ట్ చేసి... "అందుకే పెద్దలన్నారు శత్రు శేషం ఉంచకూడదని! లేపేయ్ అన్నాయ్ ఇద్దర్నీ. ఈ ఎన్నికలకు పనికొస్తారు" అంటూ పోస్టు పెట్టారని చెప్పారు. 'షర్మిల మీద జాలిపడాల్సిన అవసరం లేదు. గట్టిగా మింగండి. గేరు మార్చండి...అన్న జోలికొస్తే ఎవడినీ వదలం... సోషల్ మీడియా దెబ్బ రుచిరా పిస్తాం... ఇంత జరుగుతున్నా పెద్దావిడ నోరు మెదపడంలేదంటే చూస్తుంటే ఇదంతా తల్లీ కూతుళ్లు కలిసి చేస్తున్న కుట్రలాగా కనిపిస్తోంది" అని వర్ర రవీంద్ర రెడ్డి చేసిన పోస్ట్‌తోపాటు తనకు వచ్చిన బెదిరింపు, అసభ్యపోస్టుల వివరాలను పోలీసులకు అందించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి తెలిపారు.

ఏపీలో బీజేపీ రాజ్యం

- బీజేపీకి రాష్ట్రాన్ని బానిసను చేశారు
- రాష్ట్రాన్ని మోదీ హీనంగా చూస్తున్నారు
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజం
- ఢిల్లీలో హోదాపై ధర్నా







ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వినతిపత్రం ఇస్తున్న వైఎస్ షర్మిల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రజలు ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటు ఇవ్వకపోయినా రాష్ట్రంలో బీజేపీ రాజ్యం చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రాన్ని ప్రధాని మోదీ హీనంగా చూస్తున్నారని, ఆంధ్రులను బీజేపీ పురుగులుగా చూస్తోందన్నారు. 25 మంది ఎంపీలు బీజేపీకి గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్, చంద్రబాబు బీజేపీకి గులాంగిరీ చేస్తూ ఏపీని మోదీకి బానిసగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఏపీలోని వైసీపీ, టీడీపీ ద్రోహం చేస్తున్నాయని, ఏపీ హక్కులను కాలరాస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేస్తూ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం ఏపీసీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ భవన్‌లో ధర్నా నిర్వహించారు. ప్రత్యేక హోదా ఐదేళ్లు అయితే సరిపోదని, పదేళ్లు ఇస్తామని తిరుపతి సభలో ఆంధ్రులకు ప్రధాని మోదీ వాగ్దానం చేశారని షర్మిల గుర్తు చేశారు. "పోలవరాన్ని పూర్తి చేస్తామన్నారు. సీమాంధ్రను స్వర్ణాంధ్ర చేస్తామని మోదీ చెప్పారు. విభజన హామీలను నెరవేరుస్తామని, రాజధాని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ, రాజధాని అని చెప్పుకోవడానికి ప్రజలకు ఏమీ లేకుండా పోయింది. విశాఖలో రైల్వే జోన్, కడపలో స్టీల్ ప్లాంట్, దుగరాజపట్నంలో పోర్టు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని విభజన చట్టంలో చెప్పారు. రాష్ట్రవిభజనకు బీజేపీ మద్దతు పలికింది. రాష్ట్రవిభజన సమయంలో ఏపీకి ఐదేళ్ల ప్రత్యేక హోదా ఇస్తామని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది. కానీ, బీజేపీ తన 2014 మేనిఫెస్టోలో పదేళ్లు ఇస్తామని హామీ ఇచ్చింది. వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తామని తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది" అని షర్మిల అన్నారు. రాష్ట్రంలో 25 మంది ఎంపీలున్నారని, అందరూ మూకుమ్మడి రాజీనామాలు చేసి ఉంటే ఏపీకి ప్రత్యేకహోదా వచ్చేదని వ్యాఖ్యానించారు. " ఏపీలో వైసీపీ, టీడీపీ నేతలు ఒకసారైనా నిజమైన ఉద్యమం చేశారా? ప్రజల కోసం కొట్లాడారా? ఒకసారైనా మోదీని నిలదీసే దమ్ము లేకపోయింది" అంటూ చంద్రబాబు, జగన్ గతంలో హోదా అంశంపై మాట్లాడిన వీడియోలను ప్రదర్శించారు. హోదాపై మాట తప్పితే ఏపీ ప్రజలకు ద్రోహం చేసిన వారు కారా అని ప్రశ్నించారు. ప్రత్యేకహోదా ఏపీకి సంజీవని అని నాడు అన్నారని, హోదా కోసం పెద్ద పెద్ద మీటింగ్‌లు పెట్టి దంచి దంచి చెప్పారని ఎద్దేవా చేశారు. "అమరావతి రైల్వే లైన్‌కు వెయ్యి రూపాయలు కేటాయించారు. ఏపీ ఎంపీలందరూ కలిసి తలా 33 రూపాయలు చొప్పున తీసుకువచ్చారు. ఇంతకంటే సిగ్గుమాలిన పని ఏదైనా ఉందా?" అని షర్మిల నిలదీశారు. ప్రత్యేక హోదా కోసం కొట్లాడి ఉంటే ఎంపీల జన్మ సార్థకమయ్యేదని వ్యాఖ్యానించారు. ప్రజల చేత ఓట్లు వేయించుకున్నామన్న ఇంగితజ్ఞానం కూడా లేకుండా స్వలాభం కోసం ప్రజలను తాకట్టుపెట్టారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ఆంధ్ర రాష్ట్రానికి అవసరమని, హోదా కోసం కాంగ్రెస్ మొదటి నుంచీ కొట్లాడుతోందని.. కోటి సంతకాల ఉద్యమాన్ని చేపట్టిందని తెలిపారు. రాహుల్ తాను ప్రధాని అయిన వెంటనే హోదాపై మొదటి సంతకం పెడతానని మాట ఇచ్చినట్లు గుర్తు చేశారు. హోదాపై కాంగ్రెస్ పార్టీకి మాత్రమే చిత్తశుద్ధి ఉందన్నారు. హోదా కోసం కొట్లాడుతూనే ఉంటామని.. విభజన హామీలను సాధించేవరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించదని చెప్పారు. ఎంతవరకైనా వెళతామన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంలో ప్రత్యేక హోదా కోసం మాట్లాడాలని అడిగితే కనీసం లెక్క చేయలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలన్నా టీడీపీ, వైసీపీ ఎంపీలన్నా బీజేపీకి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.



ఏపీ భవన్‌లో ధర్నాకు అనుమతి లేదంటూ అడ్డుకుంటున్న పోలీసులు

వదిలిపెట్టం.. గళమెత్తుతాం

- మాణిక్యం ఠాకూర్

విభజన హామీలపై శుక్రవారం పార్లమెంటులో గళమెత్తినట్లు కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్యం ఠాకూర్ తెలిపారు. ప్రత్యేక హోదాపై కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందన్నారు. ఇండియా కూటమి నేతలను ప్రత్యేక హోదా అంశంపై కలిసి, మద్దతు పొందినట్టు ఆయన చెప్పారు. పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రత్యేక హోదా అంశంపై హామీ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే తొమ్మిదేళ్లు గడిచిపోయిందని ఈ ఏడాదిలోనైనా ఏపీకి న్యాయం చేయాలని కోరారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుపై మోదీని పార్లమెంటులో నిలదీస్తామని ఠాకూర్ అన్నారు. ఏపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, రాజ్యసభ మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు, కొప్పుల రాజు, తులసిరెడ్డి, రఘువీరారెడ్డి, ఎన్ఎస్‌యూఐ స్టేట్ ప్రెసిడెంట్ మధు యాదవ్, ఏపీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు తదితరులు ధర్నాలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆయన నివాసంలో షర్మిల, గిడుగు రుద్రరాజు, ఇతర కాంగ్రెస్ నాయకులు కలిశారు. ధర్నాకు ముందు ఎన్సీపీ అధినేత శరద్‌పవార్, సీపీఎం జనరల్ సెక్రటరీ సీతారాం ఏచూరీ, డీఎంకే నేత తిరుచ్చిశివను ఏపీకి ప్రత్యేక హోదాపై కలిసి మాట్లాడారు. కాగా, ఏపీ భవన్‌లో ధర్నాకు సిద్ధమైన కాంగ్రెస్ శ్రేణులు, నేతలను భవన్ అధికారుల ఆదేశాలతో పోలీసులు అడ్డుకున్నారు. అనుమతి లేదని నిలువరించారు. అరగంటకుపైగా తీవ్ర వాగ్వాదం తర్వాత ఎట్టకేలకు అనుమతి ఇచ్చారు.

జీతాలు సరిపోక.. గంజాయి స్మగ్లర్లుగా ఇద్దరు పోలీసులు

- నిందితులు ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది
- సిక్‌లీవ్ పెట్టి ఏపీ నుంచి హైదరాబాద్‌కు సరఫరా
- బాచుపల్లి వద్ద 22 కిలోల గంజాయి స్వాధీనం
- భారీగా అప్పులై అక్రమ మార్గంలోకి అడుగులు
- నిందితుల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), ప్రత్తిపాడు/సర్పవరం జంక్షన్/కాకినాడ క్రైం, ఫిబ్రవరి 2: గంజాయి స్మగ్లింగ్‌ను అరికట్టాల్సిన పోలీసులే అక్రమ బాటపట్టారు. ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు ఇదే పనిచేశారు. భారీగా అప్పులపాలై, జీతం సరిపోక.. గంజాయి స్మగ్లింగ్‌ను ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు కారులో 22 కిలోల గంజాయిని తరలిస్తూ సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులకు దొరికిపోయారు. నిందితులను కాకినాడలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సాగర్ పట్నాయక్ (35), కానిస్టేబుల్ పప్పల శ్రీనివాస్ (32)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్నాయక్ సెకండ్ హ్యాండ్ కార్లు విక్రయించే వ్యాపారం ప్రారంభించాడు. అది సరిగా నడవక అప్పులపాలయ్యాడు. శ్రీనివాసులు కాజు, బాదం సరఫరా చేసే వ్యాపారం ప్రారంభించాడు. అనుకున్న స్థాయిలో వ్యాపారం సాగక అప్పులు చేశాడు. ఇద్దరికీ వచ్చే జీతంలో ఈఎంఐలు కటింగ్‌లు పోగా అటూ ఇటుగా రూ. 18వేలు చేతికి అందేది. ఈ డబ్బుతో కుటుంబం గడవక, అప్పులు తీరక.. ఇద్దరూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్నుంచి బయటపడేందుకు ఇద్దరూ కలిసి ఒక నిర్ణయానికొచ్చారు. హైదరాబాద్‌లో గంజాయికి చాలా డిమాండ్ ఉందని, కొద్దిరోజులు గుట్టుగా గంజాయిని చేరవేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బు వస్తుందని, దాంతో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడొచ్చని ప్లాన్ చేశారు. ఇద్దరూ ఆరోగ్యం బాగోలేదని చెప్పి సెలవు పెట్టారు. తమకున్న పరిచయాలతో మచిలీపట్నంలో ఒక గంజాయి సరఫరాదారుడి వద్ద గంజాయిని కొన్నారు. అక్కడి నుంచి కారులో హైదరాబాద్ నగర శివారులోని బాచుపల్లి ప్రాంతానికి చేరుకున్నారు. పారిశ్రామిక వాడల్లో విక్రయించే క్రమంలో బాచుపల్లి ప్రధాన రహదారిపై వెళ్తున్నారు. సమాచారం అందుకున్న బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు బాచుపల్లి పోలీసులతో కలిసి ప్రధాన రహదారిపై ఉన్న మారుతి వాహనాన్ని పట్టుకున్నారు. అందులో రెండు కేజీల చొప్పున ఉన్న 11 ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసులు, పట్నాయక్‌ను బాచుపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.



సైబరాబాద్ పోలీసులకు చిక్కిన హెడ్‌కానిస్టేబుల్ పట్నాయక్, కానిస్టేబుల్ శ్రీనివాస్

ఉలిక్కిపడ్డ ఉద్దండ జగన్నాథపురం

ఏపీకి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు గంజాయి అక్రమ రవాణా చేస్తూ హైదరాబాద్‌లో పోలీసులకు పట్టుబడడంతో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉద్దండ జగన్నాథపురం వాసులు ఉలిక్కిపడ్డారు. దొరికిపోయిన ఇద్దరు కానిస్టేబుళ్లలో పప్పల శ్రీనివాస్ స్వగ్రామం ఉద్దండ జగన్నాథపురం (యుజేపురం). కాకినాడ ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఉన్న అతడు గంజాయితో పట్టుబడ్డాడన్న వార్తతో గ్రామస్తులు షాక్ అయ్యారు. విధులకు సెలవుపెట్టి మరీ అతడు ఈ అక్రమ రవాణాకు పాల్పడడం స్వగ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

గంజాయి ఘటనలో సూత్రధారి ఎవరు?: బాబు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): దురదృష్టవశాత్తు గత నాలుగున్నరేళ్లుగా ఏపీ అభివృద్ధికి కంటే డ్రగ్స్ అంశమే ఎక్కువ హెడ్‌లైన్స్‌లో నిలిచిందని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇటీవల హైదరాబాద్‌లో మాదక ద్రవ్యాల నిరోధక చట్టంలో కాకినాడకు చెందిన ఇద్దరు పోలీస్ అధికారులు పట్టుబడటం, ఆ విచారకర సంఘటన వెలుగులోకి రావడం మన రాష్ట్రానికి తీవ్ర ఆందోళన, ఇబ్బంది కలిగించే విషయం. వైసీపీ ప్రభుత్వం ఒక కీలకమైన ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఈ రాకెట్ వెనుక సూత్రధారి ఎవరు? ఈ ఘటనలో పాల్గొన్న నాయకులు ఎవరు?' అని శుక్రవారం ఎక్స్ వేదికగా చంద్రబాబు ప్రశ్నించారు.

జగన్‌కు వసంత షాక్!

- వైసీపీకి కృష్ణప్రసాద్ గుడ్‌బై
- మైలవరానికి ఇన్‌చార్జిగా తిరుపతిరావు
- అవనిగడ్డ ఇన్‌చార్జి ఫోన్ స్విచాఫ్
- ఆయన పోటీ చేయరని ప్రచారం

(విజయవాడ/అవనిగడ్డ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి కృష్ణాజిల్లాలో వైసీపీకి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి(పెనమలూరు), రక్షణనిధి(తిరువూరు) అధికారికంగా గుడ్‌బై చెప్పగా.. తాజాగా సీఎంజగన్‌కు సన్నిహితుడైన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కూడా అదే దారిపట్టారు. వైసీపీని వీడతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతున్నా ఆయన మాత్రం పెదవి విప్పలేదు. అయితే జగన్ అనూహ్యంగా మైలవరం వైసీపీ ఇన్‌చార్జిగా సర్నాల తిరుపతిరావును ప్రకటించింది. దీంతో కృష్ణప్రసాద్ వైసీపీని వీడడం ఖాయమైంది. ఆయన 8వ తేదీ తర్వాత టీడీపీలో చేరనున్నట్లు సమాచారం. మైలవరంలో మంత్రి జోగి రమేశ్ జోక్యం చేసుకుంటున్నారని, ఈ కారణంగా వైసీపీ శ్రేణుల్లో గందరగోళం ఏర్పడుతోందని ఎన్నోసార్లు వసంత సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కానీ ఆయన జోగికే మద్దతివ్వడంతో ఆయన మనస్తాపానికి గురయ్యారు. టీడీపీ లో చేరతారని ప్రచారం జరగడంతో జగన్ ఆయన్ను తాడేపల్లి పిలిపించి బుజ్జగించేందుకు యత్నించారు. కానీ ఆయన మెత్తబడలేదు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో ఆయన సమావేశమైనట్లు సమాచారం. కాగా.. అవనిగడ్డ వైసీపీ ఇన్‌చార్జిగా ప్రముఖ కేన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్‌రావును జనవరి 31న వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. అయితే ఆయన పోటీ చేయడం అనుమానమేనంటున్నారు. ఆయన హైదరాబాద్‌లో కేన్సర్ వైద్యుడిగా నాలుగున్నర దశాబ్దాలుగా సేవలందిస్తూ మంచి పేరు సంపాదించారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజారాజ్యం అభ్యర్థిగా ఆయనకు సీటు ఖరారైందన్న ప్రచారం జరిగినా.. చివరి నిమిషంలో ఆయన పోటీలో నిలువలేదు. తండ్రి సింహాద్రి సత్యనారాయణరావు టీడీపీ సీనియర్ నేత.



ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలలో 'దేవుడి మంత్రి'గా మంచి పేరుంది. చంద్రశేఖర్‌రావు మాత్రం రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. ఈ పరిస్థితుల్లో అనూహ్యంగా జనవరి 31 రాత్రి ఆయన పేరును వైసీపీ ప్రకటించింది. అయితే గురువారం సాయంత్రం నుంచి ఆయన ఫోన్ స్విచాఫ్ వస్తోంది. వైసీపీ వాళ్లకు సైతం ఆయన టచ్‌లో లేరని తెలిసింది. జగన్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత నెలకొన్న ఈ పరిస్థితుల్లో ఆయన పోటీచేయరని ఆయన సన్నిహితులే స్పష్టం చేస్తున్నారు.

పడిపోతున్న వైసీపీ వికెట్లు..

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సర్వేల సాకుతో సీఎం జగన్ తమకు టికెట్లు నిరాకరించడంపై మండిపడుతున్న వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. ఇప్పటికే కర్నూలు, నరసరావుపేట ఎంపీలు సంజీవ్‌కుమార్, లావు శ్రీకృష్ణదేవరాయలు, మంగళగిరి, రాయదుర్గం, పెనమలూరు, తిరువూరు, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, రక్షణనిధి, కోనేటి ఆదిమూలం దూరమయ్యారు. తాజా వంతు మైలవరం ఎమ్మెల్యే

తికమక.. మకతిక!

(మొదటి పేజీ తరువాయి)

(ఎస్సీ) లోక్‌సభ ఎంపీగా తొలుత ప్రకటించిన ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామికి తిరిగి గంగాధర నెల్లూరు(ఎస్సీ) స్థానమే కేటాయించారు. అక్కడ ఇన్‌చార్జిగా ప్రకటించిన ప్రస్తుత ఎంపీ రెడ్డప్పను తిరిగి లోక్‌సభ అభ్యర్థిగా ఖరారుచేశారు. వాస్తవానికి చిత్తూరు లోక్‌సభ పరిధిలో సిటింగ్ ఎస్సీ ఎమ్మెల్యేలెవరికీ టికెట్లు ఇవ్వకపోవడంతో.. నారాయణస్వామి సహా వారంతా బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందని జగన్ ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో నారాయణస్వామి, రెడ్డప్పలను తిరిగి పాత స్థానాలకు పంపారు. అలాగే గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు మరోసారి టికెట్ ఇచ్చేందుకు జగన్ తొలుత నిరాకరించారు. ఇప్పుడు ఆయనను గిద్దలూరు బదులు మార్కాపురం పంపారు. మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డిని గిద్దలూరుకు మార్చారు. ఇక ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కాదని ఆయన అనుచరుడు వెంకటేశ్‌ను ఇన్‌చార్జిగా మొదట ప్రకటించారు. అయితే స్థానికంగా వ్యతిరేకత రావడంతో ఇప్పుడు ఆయన స్థానంలో మాజీ ఎంపీ బుట్టా రేణుకను ఖరారు చేశారు. రాజమండ్రి ఎంపీగా స్థానిక వైద్యుడు గూడూరి శ్రీనివాస్, నరసాపురం లోక్‌సభకు న్యాయవాది గూడూరి ఉమాబాల, గుంటూరు లోక్‌సభ స్థానానికి సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కుమారుడు వెంకటరమణను ఇన్‌చార్జులుగా ప్రకటించారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే స్థానం ఇన్‌చార్జిగా నెల్లూరు డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌ను నియమించారు.

ఆరో జాబితాలో వైసీపీ అభ్యర్థులు వీరే..

నియోజకవర్గం	ఇన్‌చార్జి
రాజమండ్రి లోక్‌సభ	గూడూరి శ్రీనివాస్
నరసాపురం లోక్‌సభ	గూడూరి ఉమాబాల
గుంటూరు లోక్‌సభ	ఉమ్మారెడ్డి వెంకటరమణ
చిత్తూరు లోక్‌సభ (ఎస్సీ)	ఎన్.రెడ్డప్ప
మైలవరం	సర్నాల తిరుపతిరావు
మార్కాపురం	అన్నా రాంబాబు
గిద్దలూరు	కె.నాగార్జునరెడ్డి
నెల్లూరు సిటీ	ఎండీ ఖలీల్
గంగాధర నెల్లూరు (ఎస్సీ)	కె.నారాయణస్వామి
ఎమ్మిగనూరు	బుట్టా రేణుక



అనంతపురంలో సమావేశమైన వైసీపీ శింగనమల అసమ్మతి నాయకులు

శింగనమల అభ్యర్థిని మార్చాల్సిందే!

- లేకుంటే టీడీపీ అభ్యర్థికి 50 వేల మెజారిటీ
- వైసీపీ అసమ్మతి నేతల స్పష్టీకరణ.. సీఎంతోనే తేల్చుకుంటామని వెల్లడి

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 2: అనంతపురం జిల్లా శింగనమల (ఎస్సీ) నియోజకవర్గంలో వైసీపీలో అసమ్మతి భగ్గుమంటోంది. సిటింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి వ్యతిరేకంగా సర్వే రిపోర్ట్ రావడంతో.. పార్టీ అధిష్ఠానం వీరాంజనేయులును ప్రకటించింది. అయితే ఎమ్మెల్యే భర్త ఆలూరు సాంబశివారెడ్డి సిఫారసుతో ఆయన్ను నియమించడంతో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అనంతపురంలో పలువురు సీనియర్ నాయకులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు సమావేశమయ్యారు. సాంబశివారెడ్డి చెప్పారని.. వార్డు మెంబర్ కూడా పనికిరాని వ్యక్తిని తీసుకొచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి నిలబెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థిని మార్చకపోతే శింగనమలలో టీడీపీ అభ్యర్థి ఇంట్లో కూర్చున్నా 50 వేల మెజారిటీతో గెలుస్తారని స్పష్టం చేశారు. ఈ మేరకు నాయకత్వానికి అల్టిమేటం జారీచేశారు. గత ఎన్నికల్లో పద్మావతిని గెలిపించడానికి ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టామని, అయినా ఒరిగింది ఏమీ లేదని శింగనమల కన్వీనర్ నాగేశ్ అన్నారు. అనంతపురం జిల్లా పర్యటనకు ఈ నెల 11న సీఎం జగన్ వస్తున్నారని, ఆ రోజున ఆయనతోనే శింగనమల అభ్యర్థి విషయాన్ని తేల్చుకుంటామని అసమ్మతి నాయకులు ప్రకటించారు.

కడపకు మాధవి..!

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు సీట్లలో తుది కసరత్తు జరుగుతోంది. సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులలో బీటెక్ రవి(మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి)ని నిలపాలని టీడీపీ నిర్ణయించింది. గతంలో ఎమ్మెల్సీగా ఉన్న ఆయన.. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. గత ఎన్నికల్లో జగన్‌పై పోటీ చేసిన సతీశ్‌రెడ్డి ఆ తర్వాత వైసీపీలో చేరడంతో నియోజకవర్గ పగ్గాలు రవి చేతికి వచ్చాయి. ఇదే నియోజకవర్గానికి చెందిన భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఇటీవల పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తరపున గెలుపొందడంతో నియోజకవర్గ నేతల్లో ఉత్సాహం పెరిగింది. జిల్లా కేంద్రం కడపలో టీడీపీ ఈసారి మహిళను నిలుపబోతోంది. పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసులరెడ్డి సతీమణి మాధవిని అభ్యర్థిగా ఖరారు చేసింది. ఆమె ఇప్పటికే ప్రచారంలోకి దిగిపోయారు. జగన్ మేనమామ రవీంద్రనాథ్‌రెడ్డి వైసీపీ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కమలాపురంలో టీడీపీ ఈసారి కూడా పుత్తా కుటుంబాన్నే నిలపనుంది. పోయినసారి పుత్తా నరసింహారెడ్డి పోటీ చేశారు. ఈసారి ఆయన గానీ, ఆయన కుమారుడు చైతన్యరెడ్డి గానీ పోటీ చేస్తారని, టికెట్ ఆ కుటుంబానికేనని టీడీపీ వర్గాలు స్పష్టం చేశాయి. మైదుకూరులో మళ్లీ టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్‌కే అవకాశం ఇస్తున్నారు. జమ్మలమడుగులో చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డిని ఖరారుచేశారు. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అన్న కుమారుడైన ఈయన ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమై ఉన్నారు. బద్వేలు(ఎస్సీ) స్థానంలో రోశన్న అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈ నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుటుంబం సిఫారసుతో ఈయన ఎంపిక జరిగింది. కడప పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఒక్క ప్రొద్దుటూరులోనే ఇంకా టీడీపీ అభ్యర్థిని ఖరారుచేయాల్సి ఉంది. ప్రవీణ్ రెడ్డి, వరదరాజులురెడ్డి, సీఎం సురేశ్ ఇక్కడ రేసులో ఉన్నారు. ఇంకా కసరత్తు నడుస్తోంది. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మూడు అసెంబ్లీ స్థానాలు ఉమ్మడి కడప జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ మూడింటిలో ఇంకా అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. రాయచోటి టికెట్ రేసులో మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్ రెడ్డి, పార్టీ నేత రాంప్రసాద్ రెడ్డి, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి బావమరిది ద్వారకానాథరెడ్డి ఉన్నారు. శ్రీనివాసులరెడ్డికి అన్న అయిన రమేశ్‌రెడ్డి ముందంజలో ఉన్నా ఒక కుటుంబానికి ఒకటే టికెట్ విధానం అమలైతే అవకాశం దక్కకపోవచ్చని అంటున్నారు. రాజంపేట నియోజకవర్గానికి కూడా పోటీ బలంగా ఉంది. గంటా నరహరి, జగన్మోహన రాజు, సుబ్బారెడ్డి, చెంగల్రాయుడు రేసులో ఉన్నారు. రైల్వే కోడూరు(ఎస్సీ)కు మహిళా అభ్యర్థిని నిలిపే యోచనలో టీడీపీ ఉంది. అనితా దీప్తి, రేవతి ఇక్కడ పోటీపడుతున్నారు. మొదట్లో దీప్తి వైపు పార్టీ నాయకత్వం మొగ్గు చూపింది. తర్వాత ప్రవాసాంధ్రురాలు రేవతి రేసులోకి వచ్చారు. మిత్రపక్షం జనసేనకు ఇవ్వడానికి పరిశీలిస్తున్న స్థానాల్లో ఇది కూడా ఉందని టీడీపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో రాజంపేటకు సుగవాసి బాల సుబ్రమణ్యం పేరును నాయకత్వం ఖరారుచేసింది. ఆయన మాజీ ఎమ్మెల్యే పాలకొండరాయుడి కుమారుడు. కడప లోక్‌సభ స్థానంపై ఇంకా నిర్ణయానికి రాలేదు. శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుమారుడు రితేశ్‌రెడ్డి, మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి.

కడప జిల్లాలో ఖరారైన టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు..

నియోజకవర్గం	అభ్యర్థి
కడప	రెడ్డప్పగారి మాధవి
కమలాపురం	పుత్తా కుటుంబం
పులివెందుల	బీటెక్ రవి
మైదుకూరు	పుట్టా సుధాకర్ యాదవ్
బద్వేలు(ఎస్సీ)	రోశన్న
జమ్మలమడుగు	చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి

బిడ్డ బెయిల్ కోసం వేడుకున్నా..

- గవర్నర్ కాళ్లు పట్టుకొని ప్రాధేయపడ్డా
- కోడికత్తి కేసు నిందితుడు శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ

విజయవాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): "నా కుమారుడు అన్యాయంగా ఐదేళ్లుగా జైలులో మగ్గుతున్నాడు. సీఎం జగన్ కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబితే బెయిల్‌పై బయటకు వస్తాడు. వాడిని బెయిల్‌పై బయటకు తీసుకురావాలని గవర్నర్ కాళ్లపై పడి ప్రాధేయపడ్డా" అని కోడికత్తి కేసులో నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావు తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు చెప్పారు. జైలులో ఉన్న శ్రీనివాసరావుకు బెయిల్ ఇప్పించాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం వారు విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. వారివెంట టీడీపీ నేత వర్ల రామయ్య, ముస్లిం మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూర్ షబ్లీ, సీపీఎం నేత దోనేపూడి శంకర్, దళిత, బహుజన జేఏసీ నేత పోతుల బాలకోటయ్య తదితరులు ఉన్నారు. గవర్నర్‌తో సుమారుగా పది నిమిషాల భేటీ అనంతరం బయటకు వచ్చాక వారు మీడియాతో మాట్లాడారు. దేశ చరిత్రలోనే కోడికత్తి కేసు లాంటిదాన్ని ఇప్పటి వరకు చూడలేదని వర్ల రామయ్య చెప్పగా గవర్నర్ నవ్వుతూ తలఊపారని పేర్కొన్నారు. విజయవాడలో తాము ఆమరణ నిరాహార దీక్ష చేస్తే పోలీసులు భగ్నం చేశారని సావిత్రమ్మ, సుబ్బరాజు చెప్పడంతో ఆ విషయాన్ని తాను పత్రికల్లో చూసి తెలుసుకున్నానని గవర్నర్ చెప్పారన్నారు.

8న జంతర్‌మంతర్ వద్ద ధర్నా

కోడికత్తి కేసులో జనుపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 8న ధర్నా చేస్తామని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షబ్లీ తెలిపారు. ఇప్పటి వరకు అన్ని పోరాటాలు చేశామని, చివరి అస్త్రంగా గవర్నర్ వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించామని తెలిపారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతిపత్రం ఇస్తున్న కోడి కత్తి శ్రీను తల్లి, సోదరుడు, టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నాయకులు

నచ్చని వాళ్లు వెళ్లిపోండి.. బాధపడను: రాహుల్



కోల్‌కతా, ఫిబ్రవరి 2: పదవులు అనుభవించిన నాయకులు ఒకరివెంట ఒకరు వెళ్లిపోతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ భావజాలం నచ్చనివారు నిర్మొహమాటంగా బయటకు వెళ్లిపోవచ్చని.. దానికి తానేమీ బాధపడనని అన్నారు. అసోం సీఎం హిమంత విశ్వశర్మ, కేంద్ర మాజీ మంత్రి మిలింద్ దేవ్‌రా పేర్లను ప్రస్తావిస్తూ మరీ ఆయన మాట్లాడారు. హిమంత ఓ తరహా రాజకీయాలకు ప్రతినిధి అని.. అలాంటివి కాంగ్రెస్‌కు సరిపడవని పేర్కొన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఉన్న రాహుల్ గురువారం రాత్రి పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ డిజిటల్ మీడియా వారియర్స్‌తో సమావేశమయ్యారు. పార్టీ సిద్ధాంతాలను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. "మీరెప్పుడైనా ముస్లింలపై హిమంత చేసిన వ్యాఖ్యలను గమనించారా? అలాంటివి నేను చేయలేను. ఎందుకంటే నేను కొన్ని విలువలను రక్షించాల్సి ఉంది. సమాజాన్ని మతపరంగా చీల్చేందుకు పౌరసత్వ సవరణ చట్టం బీజేపీకి ఓ ఆయుధంగా మారింది. దేశాన్ని మతపరంగా విభజించి ఉద్రిక్తలు రేపడమే వారి మౌలిక సిద్ధాంతం" అని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో టీఎంసీతో పొత్తు ఉంటుందని.. సీట్ల పంపకంపై చర్చలు నడుస్తున్నట్లు, సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అతి తక్కువ సీట్లిస్తామన్న సీఎం మమతకు ఎందుకంత ప్రాధాన్యం ఇస్తున్నారంటూ కార్యకర్తలు అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధామిచ్చారు. "మమతాజీ ఇంకా ఏమీ చెప్పలేదు. ఆమె ఇండియా కూటమిలో ఉన్నారు. ఆ కూటమి నుంచి మన పార్టీ ఏమీ బయటకు రాలేదు" అని చెప్పారు.

కాంగ్రెస్ దమ్ము నిరూపించుకోవాలి: మమతా

ఇప్పటికే బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేసిన మమతా బెనర్జీ.. ఇండియా కూటమిలో విభేదాలు మరింత ముదిరేలా వ్యాఖ్యలు చేశారు. ముర్షిదాబాద్ బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ.. దమ్ముంటే వారాణసీలో బీజేపీని ఓడించాలని కాంగ్రెస్‌ను కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లు గెలుస్తుందని కూడా తాను భావించడం లేదని, ఈ మాత్రానికే ఆ పార్టీకి అంత అహంకారం ఎందుకని వ్యాఖ్యానించారు. "మా పార్టీ యూపీలో లేదు. మీరు రాజస్థాన్‌లో గత ఎన్నికల్లో ఒక్క సీటూ నెగ్గలేదు. ముందు అక్కడ గెలవండి. అప్పుడు మీ పార్టీ దమ్మేంటో తెలుస్తుంది. ఈ రోజుల్లో రాజకీయాల్లో ఫొటో షూట్ అనే కొత్త స్టైల్ నడుస్తోంది. ఎన్నడూ టీ షాప్‌నకు వెళ్లనివారు బీడీ కార్మికులతో భేటీ అవుతున్నారు. వీరంతా వలస పక్షులు" అంటూ రాహుల్ గాంధీని ఉద్దేశించి మమతా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

జోడో యాత్రకు కిలోమీటర్‌కు లక్షన్నర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రకు కాంగ్రెస్ పార్టీ రూ.71 కోట్లు ఖర్చు పెట్టింది. ఎన్నికల ముందు నిర్వహించిన సర్వేలకు మరో 40 కోట్ల రూపాయలు అయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పార్టీ ఆడిట్ నివేదికను కాంగ్రెస్ ఎన్నికల సంఘానికి సమర్పించి, మీడియాకు విడుదల చేసింది. అందులోని వివరాల ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఆ పార్టీ రూ.467 కోట్లు ఖర్చు పెట్టింది. అందులో ఆరోవంతు అంటే 15 శాతం భారత్ జోడో యాత్రకే ఖర్చయింది. కన్యాకుమారి నుంచి కశ్మీరు దాకా తెలుగు రాష్ట్రాలు సహా మొత్తం 14 రాష్ట్రాల్లో ఈ యాత్ర సాగింది. 2022 సెప్టెంబరు నుంచి 2023 జనవరి వరకు ఐదు నెలలపాటు 4,000 కిలోమీటర్లు రాహుల్‌గాంధీ నడిచారు. కర్ణాటక, తెలంగాణ విజయాలకు ఈ యాత్రే కారణమని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటారు. ఆయన యాత్రకు రోజుకు రూ.50 లక్షలు ఖర్చయింది. కిలోమీటర్‌కు సగటున రూ.1.59 లక్షలు అయ్యింది. గత ఆర్థిక సంవత్సరంలో పార్టీ ఆదాయం రూ.452 కోట్లకు తగ్గింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే రూ.90 కోట్లు తక్కువ. ప్రీపోల్ సర్వేలకు ఖర్చు బాగా పెరిగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం రూ.23 కోట్లు ఖర్చు పెట్టగా గత సంవత్సరం ఏకంగా రూ.40 కోట్లు పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో కాంగ్రెస్ గుజరాత్ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోగా ఒక్క హిమాచల్‌లో గెలిచింది.

కొత్తగా 4,000 కోట్ల అప్పు

- 2023-24లో ఆర్‌బీఐ నుంచి ఇదే అత్యధికం

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇంకో రూ.4,000 కోట్ల అప్పు తేవడం కోసం సిద్ధమైంది. రిజర్వు బ్యాంకు ఈ నెల 6న (మంగళవారం) నిర్వహించే వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలు విక్రయించి ఈ అప్పు తీసుకొస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి మంగళవారం రోజు అధికంగా తెచ్చిన అప్పు ఇదే. 2023 మే నెలలో రూ.3,500 కోట్లు తెచ్చారు. ఇప్పుడు ఏకంగా ఒకేసారి రూ.4,000 కోట్లు తెస్తున్నారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అస్మదీయులకు పెండింగ్ బిల్లులు ఇవ్వడం కోసమేనని బిల్లు బాధితులు భావిస్తున్నారు. ఖజానాకు రూ.లక్షల కోట్ల ఆదాయం వస్తున్నా, మరోవైపు రూ.లక్షల కోట్ల అప్పులు తెస్తున్నా తమకు ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించడం లేదని, ప్రభుత్వ పెద్దలకు కావాల్సిన వారికి మాత్రం చెల్లింపులు జరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న ప్రైవేటు భవనాలకు అద్దెలతో పాటు ప్రభుత్వం వాడుతున్న ప్రైవేటు వాహనాల అద్దెలను ఏడాది నుంచి చెల్లించడం లేదు. వీరంతా బిల్లుల కోసం ఆయా శాఖల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్రం అనుమతించిన అప్పుల పరిమితి దాటిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కొత్త రుణాలకు అనుమతి తెచ్చుకుంది. 6వ తేదీన తీసుకురాబోయే రూ.4,000 కోట్ల అప్పుతో కలిపి మంగళవారం తెచ్చిన అప్పులే రూ.66,000 కోట్లకు చేరాయి. ఇవి కాకుండా నాబార్డు, ఈఏపీ, కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చిన రుణాలు, ఉద్యోగుల కటింగ్‌లు రూ.15,000 కోట్లు, వివిధ కార్పొరేషన్ల నుంచి తెచ్చిన అప్పులు రూ.25,000 కోట్లు కలిపితే 10నెలల్లో జగన్ సర్కారు చేసిన అప్పు రూ.1,06,000 కోట్లకు చేరింది.

22సార్లు అప్పుల పరిమితి దాటారు: టీడీపీ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం 22సార్లు అప్పులకు విధించిన పరిమితి దాటిందని టీడీపీ అధికార ప్రతినిధి జీవీ. రెడ్డి శుక్రవారం విమర్శించారు. 'రిజర్వు బ్యాంక్ ద్వారా రూ.4వేల కోట్ల అప్పు తేవడానికి ఈ వారం ఇండెంట్ పెట్టింది. కేవలం ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.లక్షా 2వేల కోట్లు. రాష్ట్రం మొత్తం అప్పు రూ.12లక్షల కోట్లకు చేరింది. దేశ చరిత్రలో ఇది కనీవినీ ఎరుగని ఘోరం.' అని పేర్కొన్నారు.

రైల్వేజోన్ భూమిపై ప్రతిష్టంభన



జీవీఎంసీ రైల్వేకు ఇస్తామంటున్న భూమి

- ఇచ్చేశామంటున్న విశాఖ జిల్లా కలెక్టర్
- చర్చల దశలోనే ఉందన్న రైల్వే వర్గాలు
- జీవీఎంసీ ఇస్తామన్న భూమిలో దాదాపు 40% రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా
- అటువంటిచోట నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధం
- రైల్వే అభ్యంతరాలు పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'తాంబూలాలు ఇచ్చేశాం... తన్నుకు చావండి' అన్నట్టుగా ఉంది విశాఖపట్నంలోని రైల్వేజోన్ భూముల పరిస్థితి. జోన్ కోసం అడిగిన భూములు ఇచ్చేశామని విశాఖ జిల్లా అధికారులు చెబుతున్నారు. భూములు అప్పగించలేదని, ఇస్తామన్న వాటిపై సంయుక్త సర్వే జరగకుండా ఇచ్చేశామని ఎలా చెబుతారని రైల్వే వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య భూవివాదం కారణంగా రైల్వే జోన్ పనులు మొదలు కావడం లేదు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు చేయాలనుకున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు భూములు అవసరం. విశాఖపట్నంలో బీఆర్‌టీఎస్ రహదారుల నిర్మాణం కోసం మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) గతంలో రైల్వే నుంచి 26.11 ఎకరాలు తీసుకుంది. దాని విలువకు తగ్గట్టు 52.22 ఎకరాలు ఇస్తామని చెప్పింది. జోనల్ కార్యాలయం నిర్మించుకోవడానికి ఆ భూములు ఇవ్వాలని కొన్నేళ్ల నుంచి రైల్వే కోరుతోంది. అక్కడ... ఇక్కడ... అని కొంతకాలం నాన్చిన జీవీఎంసీ... చివరికి ముడసర్లోవలో 52.22ఎకరాలు ఇవ్వడానికి ఒప్పుకుంది. స్థల పరిశీలనకు వెళ్లిన రైల్వే అధికారులను ఆ భూమిలో ఉన్న ఆక్రమణదారులు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. ఆక్రమణకు గురైన భూమిని ఎలా ఇస్తారని రైల్వే అధికారులు ప్రశ్నించినా జిల్లా అధికారులు పట్టించుకోలేదు. అనేకసార్లు అడిగిన తరువాత, విమర్శలు పెరుగుతున్న నేపథ్యంలో ఇటీవల (నెల రోజుల క్రితం) రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి ఆక్రమణదారులను తరిమేశారు. ఆ భూములు అప్పగింతకు సిద్ధంగా ఉన్నాయని, జాయింట్ సర్వేకు రావాలని రైల్వే అధికారులకు ఈ జనవరి 2న జీవీఎంసీ కమిషనర్ లేఖ రాశారు. ముడసర్లోవ పాత సర్వే నం.26లో 52.22 ఎకరాలు ఉన్నాయని, పరిశీలించుకోవాలని సూచించారు. ఆ భూముల క్లాసిఫికేషన్‌లో 20 ఎకరాలు నీటి వనరులు ఉన్నట్లు పేర్కొన్నారు. దాంతో నీటి వనరులున్న ప్రాంతం భవన నిర్మాణాలకు ఉపయోగపడుతుందా?, దానికి నిబంధనలు ఏమైనా వర్తిస్తా యా?... స్పష్టత ఇవ్వాలని కోరుతూ రైల్వే అధికారులు మరో లేఖ రాశారు. దానికి జీవీఎంసీ నుంచి సమాధానం లేదు. సమాధానం చూసిన తరువాత సంయుక్త సర్వేకు వెళ్లాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు.



హద్దులు నిర్ణయిస్తూ ట్రెంచులు తవ్విన దృశ్యం

రైల్వే మంత్రి ప్రకటనతో హడావుడి

మధ్యంతర బడ్జెట్ సందర్భంగా రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. విశాఖ రైల్వేజోన్ విషయం ఏపీ ప్రభుత్వాన్నే అడగాలని సూచించారు. జోనల్ కార్యాలయం కోసం 53 ఎకరాలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అప్పగించలేదని, అందుకే పనులు ప్రారంభం కాలేదని స్పష్టంచేశారు. తప్పంతా రాష్ట్ర ప్రభుత్వానిదే అని తేల్చారు. దీంతో ప్రభుత్వం ఈ భూమిపై మీడియాకు స్పష్టత ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు సూచించింది. ఆయన శుక్రవారం ఆగమేఘాలపై విలేకరులను పిలిచి.. ఆ భూములపై ఎటువంటి వివాదం లేదని, హద్దులు నిర్ణయిస్తూ ట్రెంచులు కూడా తవ్వించామని చెప్పారు. భూములు నెల క్రితమే ఇచ్చేశామని, దీనిపై జీవీఎంసీ కమిషనర్ జనవరి 2నే లేఖ రాశారంటూ దానిని పత్రికలకు విడుదల చేశారు. ఒకటి, రెండు రోజుల్లో రైల్వే అధికారులు సంయుక్త సర్వేకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

వాస్తవం ఇదీ

ఈ భూములకు సంబంధించి ఎనిమిదేళ్లుగా సాగుతున్న ప్రాసెస్ ఇంకా పూర్తికాలేదు. ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. భూమిని అప్పగించలేదు. వెళ్లి చూసుకోవాలని మాత్రమే చెప్పారు. రైల్వేకు ఇస్తున్న భూమి ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉంది. సమీప కొండలపై కురిసిన వర్షం నీరంతా ఈ భూముల్లోకి వచ్చి చేరుతుంది. దీన్ని 'నీటి వనరుల ప్రాంతం'గా క్లాసిఫికేషన్ చేశారు. ఇప్పుడు దీనిపైనే రైల్వే అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో భవన నిర్మాణాలు చేపట్టడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం. జీవీఎంసీ కూడా ఇక్కడ భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం లేదు. తమకు ఇచ్చే 52.22 ఎకరాల్లో 20 ఎకరాలు నిర్మాణాలకు ఉపయోగపడకపోతే వాటిని తామేం చేసుకుంటామని రైల్వే అధికారులు ప్రశ్నిస్తున్నారు. తాము రాసిన లేఖకు జీవీఎంసీ కమిసనర్ నుంచి సమాధానం రాలేదని రైల్వే వర్గాలు తెలిపాయి. లేఖ రాస్తే.. భూములు ఇచ్చినట్టు కాదని, సంయుక్త సర్వే ముగిసిన తరువాత అంగీకారమైతే, టైటిల్ డీడ్‌ను రైల్వే పేరిట మారిస్తే అప్పుడు ఆ భూములు రైల్వేకు ఇచ్చినట్టు అవుతుందని పేర్కొంటున్నాయి. కేవలం లేఖ రాసేసి, భూములు ఇచ్చేశామని చెబితే కుదరదని స్పష్టం చేస్తున్నాయి.

జ్ఞాన్‌వాపీ మసీదు కమిటీకి చుక్కెదురు

- అప్పీలుపై విచారణను 6కు వాయిదా వేసిన అలహాబాద్ హైకోర్టు
- నమాజ్‌కు పోటెత్తిన భక్తులు.. ప్రశాంతంగా ముగిసిన బంద్



జ్ఞానవాపీ మసీదు వద్ద భారీ సంఖ్యలో ముస్లింలు

ప్రయాగ్‌రాజ్, వారణసి, ఢిల్లీ ఫిబ్రవరి 2: వారణాసిలోని జ్ఞానవాపీ మసీదును నిర్వహిస్తున్న అంజుమన్ ఇంతెజామియా మస్జీద్ కమిటీకి శుక్రవారం అలహాబాద్ హైకోర్టులో ఎలాంటి తక్షణ ఊరట లభించలేదు. మసీదు దక్షిణ సెల్లారులోని వేద వ్యాస్ పీఠ్‌లో ఉన్న హిందూ దేవత విగ్రహాలకు పూజారి పూజలు జరుపుకోవచ్చంటూ బుధవారం వారణసి జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ అప్పీలును పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ ఎలాంటి తక్షణ ఉత్తర్వులు ఇవ్వడానికి సుముఖత తెలపలేదు. తదుపరి విచారణను ఈ నెల 6(మంగళవారం)కి వాయిదా వేశారు. జిల్లా కోర్టు తీర్పును సవాలు చేస్తూ మసీదు కమిటీ గురువారం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే ముందుగా హైకోర్టులో పిటిషన్ వేయాల్సి ఉంటుందని ప్రధాన న్యాయమూర్తి చెప్పడంతో వెంటనే కొద్ది గంటల వ్యవధిలోనే అలహాబాద్ హైకోర్టులో అప్పీలు సమర్పించింది. మసీదు కమిటీ తరఫున న్యాయవాది ఎస్.ఎఫ్.ఎ. నక్వీ వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టు చాలా ఆతురతతో హడావిడిగా నిర్ణయాన్ని వెలువరించిందని చెప్పారు. జిల్లా జడ్జి అజయ్ కృష్ణ విశ్వేశ రిటైరైన రోజునే తీర్పు ఇచ్చారని తెలిపారు. జనవరి 31(బుధవారం)న ఆయన పదవీ విరమణ చేశారని, అదే రోజున ఆయన నిర్ణయాన్ని వెలువరించారని తెలిపారు. తాము సమర్పించిన పత్రాలను పరిగణనలోకి తీసుకోలేదని చెప్పారు. హిందూ పక్షం తరఫున విష్ణు శంకర్ జైన్ వాదిస్తూ నిజానికి ఆ ఆస్తిని స్వాధీనం చేసుకోవడానికి జిల్లా కలెక్టర్‌ను రిసీవర్‌గా నియమిస్తూ జనవరి 17నే జిల్లా కోర్టు ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఆ మేరకు ఆయన జనవరి 24న దానిని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. జనవరి 17న ఇచ్చిన ఆదేశాలకు అభ్యంతరం చెప్పనందున ప్రస్తుతం చేసిన అప్పీలుకు విచారణార్హత లేదని తెలిపారు. కాగా, జిల్లా కోర్టు హడావిడిగా తీర్పు ఇచ్చిందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర ముస్లిం సంఘాలు తెలిపాయి. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం-1991ని విస్మరించిందని పేర్కొన్నాయి. పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రహమని ఇతర ముస్లిం నాయకులతో కలిసి ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ కోర్టు నిర్ణయం ముస్లింలతో పాటు, ఇతర మతాల వారికి, లౌకికవాదంపై నమ్మకం ఉన్న వ్యక్తులకు బాధ కలిగించిందని వ్యాఖ్యానించారు. శుక్రవారం కావడంతో జ్ఞాన్‌వాపీ మసీదు వద్ద నమాజ్ చేయడానికి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. కోర్టు తీర్పు నేపథ్యంలో గతంలోకన్నా రెట్టింపు సంఖ్యలో వచ్చారు. దాంతో ఇతర మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేయాలంటూ పోలీసులు వారిని తిప్పి పంపించారు. మరోవైపు మసీదు కమిటీ పిలుపు మేరకు వారాణసిలోని ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో బంద్ పాటించారు. అధికార యంత్రాంగం భారీ బందోబస్తు నిర్వహించడంతో అంతా ప్రశాంతంగా సాగింది.

ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి

- సీఎంకు నివేదిక అందజేసిన కమిటీ.. ఎల్లుండి అసెంబ్లీ భేటీ

డెహ్రాడూన్, ఫిబ్రవరి 2: ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి అమలుకు రంగం సిద్ధమవుతోంది. దీనిపై అధ్యయనం చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ శుక్రవారం సీఎం పుష్కర్ సింగ్ ధామీకి నివేదిక అందజేసింది. దీనిపై చర్చించి, బిల్లును ఆమోదించేందుకు రాష్ట్ర అసెంబ్లీ సోమవారం ప్రత్యేకంగా సమావేశంకానుంది. 4 రోజులు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. శనివారం మంత్రివర్గ సమావేశంలో ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రాష్ట్రంలో గిరిజనులకు ప్రత్యేక హోదా ఉన్నందున వారిని ఉమ్మడి పౌర స్మృతి నుంచి మినహాయింపు ఇస్తూ సిఫార్సులు చేసింది. ఈ నివేదిక అమలైతే ముస్లిం పర్సనల్ లా ప్రకారం వివాహం, విడాకుల కోసం ఉద్దేశించిన హలాలా, ఇద్దత్, ముమ్మారు తలాక్‌లను శిక్షార్హమైన నేరాలుగా పరిగణించనున్నారు. బహుభార్యత్వాన్ని నిషేధించనున్నారు. మొదటి భార్య ఉండగా రెండో వివాహం చేసుకోవడానికి వీల్లేదు. సహజీవనాన్ని తప్పనిసరిగా వెల్లడించాలన్న నిబంధన తీసుకురానున్నారు.

భారత్‌లో క్యాన్సర్ విజృంభణ

2022లోనే 14 లక్షల కేసులు.. 9.1 లక్షల క్యాన్సర్ మరణాల నమోదు

- 2023లో 3.4 లక్షల సర్వైకల్ క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి: కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో క్యాన్సర్ విజృంభిస్తోంది. ఆ మహమ్మారి కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఒక్క 2022లోనే మనదేశంలో 14 లక్షల క్యాన్సర్ కేసులు.. 9.1 లక్షల క్యాన్సర్ మరణాలు నమోదయ్యాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)కు చెందిన క్యాన్సర్ విభాగం 'ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్‌సీ) వెల్లడించింది. పురుషుల్లో నోటి (లిప్, ఓరల్ క్యావిటీ) క్యాన్సర్ (మొత్తం క్యాన్సర్ కేసుల్లో 15.3%), ఊపిరితిత్తుల క్యాన్సర్ (8.5%).. మహిళల్లో రొమ్ము (27%), గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు (18%) ఎక్కువగా నమోదవుతున్నట్టు పేర్కొంది. భారతదేశంలో 75 ఏళ్లలోపు వారు క్యాన్సర్ బారిన పడే ముప్పు 10.6 శాతం, ఆ మహమ్మారి కారణంగా మరణించే ముప్పు 7.2 శాతంగా ఉందని.. అంతర్జాతీయంగా ఈ రెండింటి సగటు వరుసగా 20 శాతం, 9.6 శాతం ఉన్నాయని ఐఏఆర్‌సీ వివరించింది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 2కోట్ల క్యాన్సర్ కేసులు, 97 లక్షల మరణాలు నమోదు అవుతున్నాయని వెల్లడించింది. డబ్ల్యూహెచ్‌వో మొత్తం 115 దేశాల్లో సర్వే నిర్వహించి.. వరల్డ్ క్యాన్సర్ డే (ఫిబ్రవరి 4) సందర్భంగా ఆ ఫలితాలను వెలువరించింది. మహిళల్లో నమోదవుతున్న అత్యధిక కేసుల్లో రెండో స్థానంలో రొమ్ము క్యాన్సర్ (11.6 శాతం) ఉన్నప్పటికీ.. దానివల్ల మరణాల ముప్పు (7 శాతమే) తక్కువగా ఉందని వివరించింది. అలాగే ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో ఎక్కువగా నమోదవుతున్న క్యాన్సర్లలో ఎనిమిదో స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉందని.. క్యాన్సర్ మరణాల్లో 9వ స్థానంలో ఉందని వెల్లడించింది. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏటా 3.5 కోట్ల క్యాన్సర్ కేసులు నమోదు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. క్యాన్సర్ కేసుల పెరుగుదల సామాజిక ఆర్థికాభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది.



ప్రపంచవ్యాప్తంగా..

ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు డబ్ల్యూహెచ్‌వో వెల్లడించింది. సర్వైకల్ క్యాన్సర్ ఎలిమినేషన్ ఇనిషియేటివ్ ప్రోగ్రామ్ ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నిర్మూలించవచ్చని డబ్ల్యూహెచ్‌వో అభిప్రాయపడింది. కాగా, మనదేశంలో 2023 సంవత్సరంలో 3.4 లక్షలకు పైగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కేసులు నమోదైనట్టు భారత వైద్య పరిశోధన మండలికి చెందిన జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ తెలిపింది. ఈ విషయాన్ని కేంద్రం శుక్రవారం లోక్‌సభలో వెల్లడించింది. ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సాంకేతిక ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్టు కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ తెలిపారు.

మహిళలూ జరభద్రం

దేశంలో నానాటికీ పెరుగుతున్న సర్వైకల్ క్యాన్సర్ ముప్పు

హైదరాబాద్, అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ క్యాన్సర్ హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ద్వారా సోకుతుంది. ఇది లైంగిక సంపర్కం ద్వారా సంక్రమించే ఒక సాధారణ వైరస్. సాధారణంగా ఇది శరీరంలోకి ప్రవేశించాక క్యాన్సర్‌గా అభివృద్ధి చెందడానికి 15-20 ఏళ్లు పడుతుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే మహిళల్లో 5-10 ఏళ్లకే క్యాన్సర్ కణాలు అభివృద్ధి చెందుతాయి. ఎక్కువమందితో లైంగిక చర్యల్లో పాల్గొనడం, గర్భనిరోధక మాత్రలు ఎక్కువగా వినియోగించడం వల్ల కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. అలాగే వంశపారంపర్యం, ధూమపానం వంటి కారణాల వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది.

లక్షణాలేమిటి..?

- గర్భాశయ క్యాన్సర్ వచ్చిన వారికి నెలసరి సమయంలో అధిక రక్తస్రావం అవుతుంది.
- పొత్తి కడుపులో నొప్పి.. తరచూ కడుపు ఉబ్బరంగా అనిపిస్తుంది.
- పదే పదే మూత్ర విసర్జనకు వెళ్తారు. ఆ సమయంలో మంట, నొప్పిగా అనిపిస్తుంది.
- శృంగారంలో పాల్గొన్నప్పుడు, ఆ తర్వాత యోని దగ్గర నొప్పి, మంటగా ఉంటుంది.
- మెనోపాజ్ తర్వాత శృంగారంలో పాల్గొన్నప్పుడు సంభోగం తర్వాత రక్తస్రావం అవుతుంది.
- దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జ్ అవుతుంది.
- అలసట, నీరసం, బరువు తగ్గడం, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

'పాప్ స్మియర్ టెస్ట్'తో గుర్తించవచ్చు

గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించడానికి వైద్యులు 'పాప్ స్మియర్ టెస్ట్' నిర్వహిస్తారు. ఒక పరికరం సహాయంతో గర్భాశయ ముఖద్వారం నుంచి కొన్ని కణాలను సేకరించి వాటిని పరీక్షించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను గుర్తిస్తారు. పెల్విక్ ఎగ్జామినేషన్, బయాప్సీ విధానాల ద్వారానూ దీన్ని గుర్తించవచ్చు.

ముందు జాగ్రత్త చర్యలతో కట్టడి..

మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా ముందస్తు వ్యాక్సిన్లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. 9 నుంచి 26 ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయిలకు ఈ వైరస్ సోకకుండా వ్యాక్సిన్ వేస్తారు. అలాగే.. పాప్ స్మియర్ పరీక్ష ద్వారా ముందుగానే దీన్ని గుర్తించి ప్రీ క్యాన్సర్ దశలోనే చిన్నపాటి చికిత్సతో నిర్మూలించవచ్చని వైద్యులు చెబుతున్నారు. 29-45 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ప్రతి రెండు-మూడేళ్లకోసారి, 50-60 ఏళ్ల మధ్య వయస్కులు ఐదేళ్లకోసారి స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉండాలని అంటున్నారు. అలాగే అసురక్షిత లైంగిక చర్యల్లో పాల్గొనకూడదని, తరచూ గర్భనిరోధక మాత్రలు మింగకూడదని సూచిస్తున్నారు.

వ్యాక్సిన్లపై చర్చలు..

గర్భాశయ క్యాన్సర్ నివారణకు సీరం ఇనిస్టిట్యూట్ స్వదేశీయంగా 'సర్వావాక్' అనే వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో ఇది రూ.2వేలకు అందుబాటులో ఉంది. ఎంఎస్‌డీ ఫార్మా కంపెనీ కూడా గార్డాసిల్ 4 అనే వ్యాక్సిన్‌ను విక్రయిస్తోంది. ఇది ఒక్కో డోసు రూ.3,927కి లభిస్తుంది. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీలతో చర్చలు జరుపుతోంది.



సెప్టెంబరులో వ్యాక్సినేషన్..

గర్భాశయ క్యాన్సర్ ప్రమాదాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 9-14 ఏళ్ల బాలికలు దీని బారిన పడకుండా ఉండేందుకు వ్యాక్సినేషన్‌ను ప్రోత్సహిస్తామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనికోసం సీరం సంస్థ ఆరు కోట్ల డోసులు కేంద్రానికి అందించనుందని ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. అవి అందగానే ఈ ఏడాది సెప్టెంబరులో కేంద్రం ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగా 9 నుంచి 14 ఏళ్ల వయసున్న బాలికలకు ఈ వ్యాక్సిన్ రెండు డోసులు ఉచితంగా ఇవ్వొచ్చని భావిస్తున్నారు. ఫార్మా కంపెనీలతో కేంద్రం చర్చలు ఫలించి ఈ వ్యాక్సిన్ విరివిగా అందుబాటులోకి వస్తే ఒక్కో డోసు ధర రూ.200 నుంచి రూ.250 వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

పట్టణ ప్రాంతాల్లో రొమ్ము, గ్రామీణ ప్రాంతాల్లో సర్వైకల్ క్యాన్సర్ కేసులెక్కువ

మన దేశంలో పట్టణ ప్రాంత మహిళల్లో రొమ్ము క్యాన్సర్, గ్రామీణ ప్రాంతాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. సర్వైకల్ క్యాన్సర్ కేసుల్ని పాప్‌స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించే అవకాశం ఉంది. తద్వారా మరణాలను కూడా గణనీయంగా తగ్గించవచ్చు. 2020తో పోల్చితే 2025 నాటికి మన దగ్గర క్యాన్సర్ కేసుల 12.8 శాతం మేరకు పెరిగే ప్రమాదం ఉంది. ఈముప్పును తప్పించుకోవాలంటే.. మన శరీరంపై అవగాహన ఉండాలి. ఏమాత్రం మార్పు కనిపించినా దాన్ని గుర్తించాలి. మన శరీరంలో నొప్పి లేని గడ్డలు ఏమి కనిపించినా నిర్లక్ష్యం చేయవద్దు. తక్షణం వైద్యుడి సంప్రదించాలి. జీవనశైలి మార్చుకోవాలి. మద్య ధూమపానం మానుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి. ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు కలిగి ఉండాలి.

డాక్టర్ గీతనాగశ్రీ నీరుకొండ,
సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, కేర్ క్యాన్సర్ సెంటర్, గచ్చిబౌలి, హైదరాబాద్.

పూనమ్ పాండే కన్నుమూత

- 32 ఏళ్లకే గర్భాశయ కేన్సర్‌తో మృతి
- ఇన్‌స్టా వేదికగా ఆమె మేనేజర్ వెల్లడి



ముంబై, ఫిబ్రవరి 2: ప్రముఖ నటి, మోడల్ పూనమ్ పాండే అకాల మరణం చెందారు. కొంతకాలంగా గర్భాశయ కేన్సర్‌తో బాధపడుతున్న 32 ఏళ్ల పూనమ్ గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆమె మేనేజర్ శుక్రవారం ఉదయం ధ్రువీకరించారు. 'ఈ రోజు చాలా బాధకర విషయాన్ని తెలియజేయాల్సి వచ్చినందుకు చింతిస్తున్నాము. మన ప్రియతమ నటి పూనమ్ పాండే గర్భాశయ కేన్సర్‌తో గురువారం రాత్రి కన్నుమూశారు. ఈ విషాద సమయంలో ఆమెను స్మరించుకుంటూ.. వారి కుటుంబ గోప్యతకు భంగం కలిగించవద్దని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. అయితే మరణానికి సంబంధించిన వివరాలు వెల్లడించడానికి ఆమె కుటుంబం అందుబాటులో లేదు.

వివాదాస్పద వ్యాఖ్యలతో పాపులర్

పూనమ్ పాండే ప్రముఖ మోడల్. 2013లో తొలిసారిగా ఆమె నషా అనే హిందీ చిత్రంలో నటించారు. వివాదాస్పద వ్యాఖ్యలతో తరచూ వార్తల్లో నిలిచేవారు. 2011 వన్డే ప్రపంచకప్ సందర్భంగా టీమిండియా ఫైనల్లో గెలిస్తే నగ్నంగా కనిపిస్తానని ప్రకటించి అందరి దృష్టినీ ఆకర్షించారు. ఆమె చివరగా.. నటి కంగనారనౌత్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన 'లాక్ అప్' మొదటి సీజన్‌లో కనిపించారు. షోలో విజయం సాధించలేకపోయినప్పటికీ అభిమానుల సంఖ్యను పెంచుకున్నారు. 2020లో శామ్ బాంబేను వివాహం చేసుకున్న పూనమ్ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. అయితే.. వారి వైవాహిక జీవితం ఎంతోకాలం కొనసాగలేదు. పెళ్లయిన కొద్దిరోజులకే శామ్‌పై ఆమె గృహహింస ఆరోపణలు చేశారు. తర్వాత విడిపోయారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

తేలని డీఎస్సీ లెక్క!

- 6100 పోస్టులు ప్రకటించిన ప్రభుత్వం
- గుర్తించిన ఖాళీలు 4,057.. మరిన్ని వివరాలు పంపాలని ఆదేశాలు
- ఇప్పట్లో నోటిఫికేషన్ వచ్చేనా?

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వానికి లెక్క తేలడం లేదు. ఇప్పటికే అంతా స్పష్టత వచ్చినట్లుగా 6,100 పోస్టులు భర్తీ చేయబోతున్నామంటూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. కానీ ఇప్పటికీ ఎన్ని ఖాళీలున్నాయి? ఎన్ని భర్తీ చేయాలనేదానిపై పాఠశాల విద్యాశాఖకే స్పష్టత రాలేదు. ఇప్పటి వరకు 4,057 పోస్టులను మాత్రమే పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. వీటిలో 1,728 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులున్నాయి. మిగిలిన పోస్టులు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నాయి. ఈ మేరకు జిల్లాల వారీగా లెక్కలు రూపొందించిన అధికారులు, ఇంకా మిగిలిన ఖాళీల వివరాలను ఆదివారంలోగా పంపాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఇప్పటి వరకు గుర్తించిన ఖాళీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కువగా ఉన్నాయి. కర్నూలులో 2,217 పోస్టులు అవసరమని అంచనా వేశారు. వీటిలో 1,646 పోస్టులు ఎస్జీటీనే. విజయనగరం జిల్లాలో అత్యల్పంగా 27 పోస్టులు మాత్రమే అవసరమని తేల్చారు. ఇప్పటి వరకు ఉన్న లెక్కల ప్రకారం భాషా పండితుల్లో తెలుగు ఖాళీలు 231, హిందీ ఖాళీలు 269, ఇంగ్లిష్ 422, గణితం 356, ఫిజికల్ సైన్స్ 113, బయలాజికల్ సైన్స్ 167, సోషల్ 104, పీఈటీ 667 పోస్టులున్నాయి. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే అనేకసార్లు టీచర్ పోస్టుల ఖాళీలపై లెక్కలేసింది. ఒకసారి వేసిన లెక్కలకు మరోసారి వేస్తున్న గణాంకాలకు పొంతన ఉండడం లేదు. దీంతో స్వయంగా విద్యాశాఖ మంత్రే రకరకాల ప్రకటనలు చేశారు. ఒక దశలో పోస్టులే లేవన్నారు. ఇక గత అసెంబ్లీ సమావేశాల్లో 18 వేల ఖాళీలున్నట్టు తెలిపారు. వీటిలో 8 వేల పోస్టులు భర్తీ చేస్తే సరిపోతుందన్నారు. తీరా 6,100 పోస్టులు భర్తీ చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇప్పుడు మళ్లీ కొత్తగా డీఎస్సీ లెక్కలు తేల్చాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పట్లో నోటిఫికేషన్ వచ్చేనా అనే అనుమానం కలుగుతోంది.

6న సర్పంచుల 'చలో అసెంబ్లీ'

విజయవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల కోసం రాష్ట్రానికి పంపిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8629 కోట్లను దారి మళ్లించటాన్ని నిరసిస్తూ ఈ నెల 6వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు చెల్లించాల్సిన నిధులను దొంగిలించిందని ఓ ప్రకటనలో ఆయన ఆరోపించారు. దొంగిలించిన నిధులను తిరిగి సర్పంచుల ఖాతాలలో జమ చేయాలన్నది తమ ప్రధాన డిమాండ్ అని పేర్కొన్నారు. దీంతో పాటు గ్రామ సచివాలయాలను, వలంటీర్లను గ్రామ పంచాయతీలు, సర్పంచుల పర్యవేక్షణలో పనిచేయించాలన్నది తమ రెండవ డిమాండ్ అన్నారు. ఉపాధి హామీ నిధులను చట్ట ప్రకారం గ్రామ పంచాయతీలకు ఇచ్చి సర్పంచుల చేత ఖర్చు చేయించాలని కోరారు. గతంలో మాదిరిగా పంచాయతీలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సర్పంచులకు, ఎంపీటీసీలకు రూ.15 వేలు, ఎంపీపీలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తిరుమలలో మంత్రి రోజాకు అమరావతి సెగ



రోజా వెనుక నినాదాలు చేస్తున్న శ్రీవారి సేవకులు

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన మంత్రి రోజాకు నిరసన సెగ తగిలింది. శుక్రవారం ఉదయం అభిషేక సేవలో పాల్గొని రోజా ఆలయం వెలుపలకు వచ్చారు. ఈ క్రమంలో ఆమెను చూసిన కొంత మంది మహిళా శ్రీవారి సేవకులు దగ్గరకు వెళ్లారు. వారిలో కొంతమంది 'జై అమరావతి.. జై అమరావతి' అంటూ నినాదాలు మొదలుపెట్టారు. 'ఒకే రాష్ట్రం, ఒకటే రాజధాని.. చెప్పండి మేడం' అంటూ నినదించారు. దీంతో రోజా ఉలికిపాటుకు గురయ్యారు. కొంతమంది మహిళలు రోజా దగ్గరకు వచ్చే ప్రయత్నం చేయగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. కాగా.. జై అమరావతి నినాదాలు చేయడంపై రాత్రి వారు మాట్లాడిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. అందులో.. 'మేము అమరావతి నుంచి శ్రీవారిసేవకు వచ్చాం. మంత్రి రోజాను చూడగానే ఎమోషన్‌తో జై అమరావతి అంటూ నినాదాలు చేయడంతో పాటు ఆమెనూ చేయమని కోరాం. తిరుమలలో నినాదాలు చేయడకూడదని మాకు తెలియదు. అనుకోకుండా జరిగినందుకు మమల్ని మన్నించాలని కోరుతున్నాం' అంటూ మాట్లాడారు. అయితే టీటీడీ అధికారులే వారితో వీడియోలో ఇలా చెప్పించారనే ప్రచారం జరుగుతోంది.

శ్రీవారి సేవకు ముస్లిం భక్తుల అనుమతిపై పరిశీలిస్తాం: టీటీడీ ఈవో

తిరుమల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారిసేవకు అన్యమత భక్తులను అనుమతించే అంశాన్ని పరిశీలిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం జరిగింది. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. నాయుడుపేటకు చెందిన హుసేన్‌బాషా అనే భక్తుడు ఫోన్ చేసి తమ మతంలో చాలామంది స్వామి భక్తులున్నారని, శ్రీవారిసేవ చేసుకునే అనుమతి ఇస్తే వచ్చి చేస్తామని కోరారన్నారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. తిరుమలలో అగ్నిప్రమాదాలను నివారించేందుకు టీటీడీ వంటశాలలు, హోటళ్లు, స్థానికుల ఇండ్లు, మఠాలలోని వంటశాలలకు ఎల్‌జీ పైపులైన్ ద్వారా గ్యాస్ అందించేందుకు బోర్డు సమావేశంలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

భర్తకాదు...శాడిస్టు...!

- ప్రేమించి పెళ్లాడిన భార్యకు శిరోముండనం
- పెదకొండేపూడిలో ఘటన.. నిందితుడు అరెస్ట్



బాధితురాలు ఆశ



జుట్టు చూపిస్తున్న అభిరామ్

రాజమహేంద్రవరం/సీతానగరం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భార్యకు శిరోముండనం చేసి, ఆమెను ఈడ్చి పడేసి, జుట్టు చూపిస్తూ ఆగ్రహంతో ఊగిపోయిన ఓ భర్త ఉదంతమిది. హైదరాబాద్‌కు చెందిన షేక్ ఆశ, తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పెదకొండేపూడికి చెందిన కర్రి అభిరామ్ ప్రేమ వివాహం చేసుకున్నారు. కుమారుడు పుట్టిన తర్వాత దంపతుల మధ్య విబేధాలు పొడచూపాయి. నాలుగేళ్ల క్రితం అభిరామ్ భార్యను, కుమారుడిని హైదరాబాద్‌లో వదిలి పెదకొండేపూడి వచ్చేశాడు. తర్వాత ఆమె వచ్చి పెద్దమనుషులతో చెప్పించినా, కాపురం కుదరక పోవడంతో సీతానగరం పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టింది. కానీ ఇంతవరకూ పోలీసులు చర్యలు తీసుకోలేదు. రెండు నెలల కిందట ఆశ స్థానిక వైసీపీ పెద్దలను ఆశ్రయించింది. వారు నచ్చచెప్పినా అభిరామ్ కాపురం చేసేందుకు అంగీకరించలేదు. ఇటీవల ఆమె ఇంటికి రావడంతో తన తల్లిదండ్రులను వేరే చోటుకు మార్చేశాడు. ఆమె తాళం పగలగొట్టి అక్కడే ఉంటోంది. ఈ విషయం తెలిసి శుక్రవారం ఉదయం వచ్చిన అభిరామ్ ఆమెతో గొడవ పడ్డాడు. ఆమెను కింద పడేసి మెడమీద కాలు పెట్టి, ట్రిమ్మర్‌తో శిరోముండనం చేశాడు. ఆమె ఆర్తనాదాలు విని ఇరుగుపొరుగు వారు వచ్చేసరికి ఆమెను ఈడ్చుకుంటూ వచ్చి జుట్టు అందరికీ చూపిస్తూ వెళ్లిపోయాడు. "గుండు గీశాను.. అవసరమైతే కేసు పెట్టుకో అని" అతను హెచ్చరిస్తున్నట్టు వీడియో హల్‌చల్ చేస్తోంది. ఆ తర్వాత పోలీసు స్టేషన్‌కు వెళ్లి బాధితురాలు ఫిర్యాదు చేసింది. సీతానగరం ఎస్ఐ రామకృష్ణ ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అభిరామ్‌ను అదుపులోకి తీసుకున్నామని, రిమాండ్‌కు పంపిస్తున్నామని తెలిపారు. బాధితురాలు తనకు న్యాయం కావాలని డిమాండ్ చేస్తోంది. కాగా, జీజీహెచ్‌లో బాధితురాలిని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు.

ప్యాకేజ్డ్ డ్రింకింగ్‌కు నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి: బీఐఎస్ జేడీ

గుణదల, ఫిబ్రవరి 2: ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ విషయంలో వినియోగదారుల సంతృప్తి, సామూహిక వినియోగంలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ కె.రాజశేఖర్ తెలిపారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్దగల ఓ హోటల్‌లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌పై రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ శ్రేయస్సు, మన శరీరాలు, ఆర్థిక వ్యవస్థ, ప్రజల సురక్షితను దృష్టిలో పెట్టుకుని ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నాణ్యతను పాటించడం తప్పనిసరి అని చెప్పారు. రెండు దశల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని, మొదట అవగాహన సదస్సులు, తర్వాత క్షేత్రస్థాయిలో ప్లాంట్లలో శిక్షణ ఉంటుందన్నారు. స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి.కృష్ణవీర్ వర్మ, బిఐఎస్ అధికారి ఎంఏజెవినోద్ పాల్గొన్నారు.

నగరంలోని జక్కంపూడి కాలనీ సమీపంలో ఇన్నర్‌రింగ్‌ను ఆనుకుని నడుపుతున్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఎక్సైజ్ శాఖ అధికారుల అసమర్థతను ప్రశ్నిస్తోంది. కొత్త వాళ్లు ఎవరైనా చూస్తే అది బారా.. బెల్ట్ షాపా? అనే అనుమానం కలగకమానదు. పూర్తిగా జనావాసాల మధ్య నడుపుతున్న ఈ బార్ అండ్ రెస్టారెంట్‌తో అక్కడి ప్రజలు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అనధికారికంగా నిర్వహిస్తున్న సదరు మద్యం అమ్మకందారుల పలుకుబడి ముందు స్థానికుల గగ్గోలు దిగదుడుపే అయింది.

– అజిత్‌సింగ్‌నగర్/విజయవాడ రూరల్:



వెనుక గేట్ నుంచి మద్యం అమ్మకాలు



రోడ్లపైనే అడ్డ దిడ్డంగా వాహనాలను పార్క్ చేసిన మందుబాబులు

బారా.. బెల్టా..?

- ప్రధాన గేటు మూయించినా దొడ్డిదారిన విక్రయాలు
- జనావాసాల ముందే పార్కింగ్
- రాత్రిళ్లు అటు వెళ్లాలంటే హడల్
- ఎక్సైజ్ శాఖ ఉదాసీనతపై స్థానికుల ఆగ్రహం



బార్ ప్రధాన గేట్‌ను మూసివేసిన నిర్వాహకులు

జక్కంపూడి కాలనీ చనమోలు వెంకట్రావు బ్రిడ్జి దిగువన ఇన్నర్‌రింగ్‌ను ఆనుకుని మూడేళ్ల క్రితం అను బార్ అండ్ రెస్టారెంట్ పేరుతో బార్ నడుస్తోంది. జక్కంపూడి పంచాయతీ పరిధిలో ఎక్సైజ్ శాఖ మద్యం అమ్మకాలకు పర్మిషన్ ఇచ్చింది. అయితే ప్రధాన గేటు కార్పొరేషన్ రోడ్డు పరిధిలోకి రావడం, పైగా ఇన్నర్ రింగ్‌ను ఆనుకుని ఉండటంతో బార్ నిర్వాహణపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. నిత్యం రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు జరుగుతుండటంతో అధికారులు ప్రధాన గేట్‌ను మూయించారు. దీంతో నిర్వాహకులు వెనుక గేటు గుండా అమ్మకాలు మొదలుపెట్టారు. అటువైపు పూర్తిగా జనావాసాలుండటంతో మందుబాబుల తాకిడి ఎక్కువైపోయింది. ఇళ్ల ముందే రోడ్లకడ్డంగా వాహనాలను పెట్టి వెళుతున్న మందుబాబులు వాటినెప్పుడు తీస్తారో తెలియదు. అడిగితే ఏం చేస్తారోనన్న భయంతో మిన్నకుండిపోతున్నారు.

రాత్రిళ్లు మరీ దారుణం

రాత్రి, పగలు తేడా లేకుండా జరుగుతున్న మద్యం అమ్మకాలతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రిళ్లు బయటకు రావాలంటే ఆడవాళ్లే కాక మగవాళ్లు సైతం ఒకటికి పదిసార్లు ఆలోచించుకునే పరిస్థితి. కనీసం రోడ్డుకడ్డంగా పెట్టిన వాహనాలను తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఏం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జనావాసాల మధ్య దొడ్డిదారిన జరుగుతున్న మద్యం అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రైతుల ప్రత్యామ్నాయ ప్లాట్లపై అపోహలొద్దు!

ఏపీ సీఆర్‌డీఏ స్పెషల్ ల్యాండ్స్ కలెక్టర్

కృష్ణలంక, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను ఏపీ సీఆర్‌డీఏకి అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన, వాణిజ్య స్థలాలు భూ సేకరణలో ఉన్నందున రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ సీఆర్‌డీఏ ల్యాండ్స్ స్పెషల్ కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ప్లాట్లు భూ సేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లుగా గుర్తించి రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు పొందాలని నోటీసులు జారీచేసినట్లు పేర్కొన్నారు. గతంలో పొరపాట్లను సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ఈ-లాటరీ జరుగుందన్నారు. ఈ-లాటరీకి హాజరయ్యే రైతులకు ఆయా గ్రామాలకు లే అవుట్ ప్లాన్లు విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు సందేహాలుంటే నివృత్తి చేస్తామన్నారు. అయినా సందేహాలున్నా నివృత్తి చేసేందుకు ఐనవోలు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు-1&2, అనంతవరం, కురగల్లు-1&2, నెక్కల్లు, నిడమర్రు 1&2, వెలగపూడి, ఉద్దండరాయనపాలెం, మందడం -1&2, కొండమరాజపాలెం, నవులూరు-1&2, లింగాయపాలెం, వెంకటపాలెం, రాయపూడి-1&2 గ్రామాల రైతులకు ఫిబ్రవరి 3, 4న సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ-లాటరీలో పాల్గొనే రైతులు విజయవాడలోని కార్యాలయానికి వచ్చి సందేహాలను నివృత్తి తెలుసుకోవచ్చన్నారు.

నవులూరు, లింగాయపాలెం ఈ-లాటరీ 8కి వాయిదా

ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకు అప్పగించిన రైతులకు కేటాయించబడిన నివేశన, వాణిజ్య స్థలాలు భూ సేకరణలో ఉన్నందున, అదింకా పూర్తికానందున రైతులకు కేటాయించేందుకు ఫిబ్రవరి 2న జరగాల్సిన నవులూరు, లింగాయపాలెం గ్రామాల మూడో విడత ఈ-లాటరీ ఫిబ్రవరి 8కి వాయిదా వేసినట్టు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండుసార్లు నోటీసులిచ్చినా రైతులు హాజరు కాకపోవడంతో వారికి మరో అవకాశం ఇచ్చి ఫిబ్రవరి 8న బుధవారం ఉదయం 11 గంటలకు నవులూరు 1&2, మధ్యాహ్నం 12గంటలకు లింగాయపాలెం గ్రామాలకు లాటరీ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

దారికోసం నీడనిచ్చే చెట్ల నరికివేత

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



పార్కు స్థలంలో నరికివేసిన చెట్లు, ఉసిరి చెట్టును పూర్తిగా తొలగించడంతో మిగిలిన మోడు, కొంత భాగం నరికిన రావిచెట్టు ఆనవాళ్లు

లబ్బీపేట, ఫిబ్రవరి 2: ఎన్నో ఏళ్లుగా నీడనిస్తున్న పచ్చని చెట్లను నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 8వ డివిజన్‌లోని ఆచార్య రంగా నగర్‌లోని ఉన్న పార్క్ స్థలంలోని భారీ చెట్లు స్థానికులతో పాటు పార్క్‌కు వచ్చే సీనియర్ సిటిజన్స్‌కు నీడనిస్తున్నాయి. 15ఏళ్ల నుంచి ఆ కాలనీ వాసులు పార్క్‌లోని చెట్లనీడలో నిత్యం వాకింగ్, వ్యాయామం చేసుకుంటున్నారు. ముఖ్యంగా కాలనీలోని సీనియర్ సిటిజన్స్ పార్క్‌లోని భవనం, చెట్లనీడలో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కాలక్షేపం చేస్తుంటారు. పక్కనే ఉన్న ఒక స్థలానికి సంబంధించిన వారు అందులోకి వెళ్లేందుకు పార్క్ నుంచే దారి ఏర్పాటు చేసుకున్నారు. అందుకు అడ్డుగా ఉన్న చెట్లను నరికివేశారు. దీనిపై కాలనీ వాసులు, సీనియర్‌సిటిజన్స్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా నీడనిస్తున్న చెట్లను నరికివేయడం పర్యావరణాన్ని పాడు చేయడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరుదుగా పెరిగే ఉసిరి చెట్టుతో పాటు వేప చెట్లను నిర్దాక్షణ్యంగా నరికివేశారు. అంతేకాక భారీ రావి చెట్టుడా తొలగించేందుకు సిద్ధవగా అడ్డుకున్నామని స్థానికులు తెలిపారు. ఉసిరి, వేప, రావి చెట్లకు స్థానిక మహిళలు పూజలు చేస్తుంటారని వాటిని నరికేయడంతో తీవ్ర మనోవేదన చెందుతున్నారన్నారు. కమిషనర్ దృష్టి సారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

కరెంటు తీగలకు అడ్డుగా ఉన్నాయనే..

ఇక్కడ రోడ్డు డాక్యుమెంట్ ప్రకారం 50 అడుగులు ఉంది. దాన్ని ఆక్రమించి పార్కు ఏర్పాటు చేశారు. తమ స్థలంలోకి వెళ్లడానికి డాక్యుమెంట్ల ప్రకారం పార్క్‌ను తొలగించి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాం. అలాగే ఇక్కడున్న ట్రాన్స్‌ఫార్మర్ స్కూల్ పిల్లలకు, కార్లు వెళ్లడానికి అడ్డుగా ఉండడంతో కొంచెం పక్కకు తరలిస్తున్నాం. అందుకవసరమైన అనుమతులు తీసుకున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో కరెంటు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న చెట్లను తొలగించడం లేదు. - స్థల యజమాని





మురిపించిన హాస్య నాటికలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 2: చక్కని హాస్యంతో నవ్విస్తూ, సందేశాత్మకంగా ప్రేక్షకులను మురిపిస్తూ మూడు హాస్యనాటికల ప్రదర్శన సాగింది. మొగల్రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో సుమధుర కళానికేతన్, సిద్ధార్థ కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్య నాటికల పోటీల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం మూడు నాటికల ప్రదర్శనలు జరిగాయి. మొదటిగా మాతృశ్రీ కళానికేతన్, విశాఖపట్నం వారి 'చూపులు కలవని శుభవేళ' రావి నాగేశ్వరరావు రచనను, పీఎన్వీ సత్యనారాయణ దర్శకత్వంలో ప్రదర్శించారు. జబర్దస్త్ అప్పలరాజు, సహనటులు సత్యనారాయణ, జగదీష్, అర్జున్, సుజాతలు చక్కని హాస్యాన్ని పండించారు. తదుపరి మాడభూషి దివాకరబాబు రచనకు రౌతు వాసుదేవరావు దర్శకత్వంలో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ బృందం ప్రదర్శించిన రంగు పడుద్ది నాటిక నవ్వులు పూయించింది. శశిధర్, జాహ్నవి, నాగరాజు, వాసు, దిలీప్, పవన్ కల్యాణ్, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, పవన్‌కుమార్, రమేష్ నటించారు. చివరి నాటికగా అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్, చిలకలూరిపేట వారి చే 'ఏడున్నాడో.. ఎక్కడున్నాడో' ప్రదర్శించారు. అమెచ్యూర్ యూనిట్ రచనకు, ఎస్‌కే షఫీ దర్శకత్వంలో ప్రదర్శించి ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. కళాకారులు మాధవి, హరిబాబు, శివ, నారాయణ, మహేంద్ర, ఎస్‌కె షఫీ ప్రదర్శించారు. తొలుత నాగార్జున వర్సిటీ సహకారంతో కళారంగ/యువ కళాకారుల పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఎస్వీ నరసరాజు, పీవీ భాస్కర శర్మ, సినీ మా నటులు రచయిత దర్శకులు ఎస్‌కే మిశ్రో, తులసి బాలకృష్ణ, సుబ్బరాయ శర్మ, హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్, సురవరపు రమేష్‌బాబు, బి.ఆంజనేయరాజు, గుడివాడ లహరి పాల్గొని తమ అనుభవాలను వివరించారు. న్యాయవాది, కవి మోహన్ రాంప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు. సుమధుర సంయుక్త కార్యదర్శి డాక్టర్ కైలాసరావు, పసుపర్తి శివ రాం వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామంతపూడి వెంకట నరసరాజు, పసుమర్తి విజయభాస్కర శర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సూర్యనారాయణ పర్యవేక్షణ చేశారు.


తాకట్టు బంగారంతో వడ్డాణం!

మహిళా మేనేజర్ దుశ్చర్య



పెనమలూరు, ఫిబ్రవరి 2: మహిళా బ్యాంకు మేనేజరుతో ఉన్న పాత పరిచయంతో ఒక ఖాతాదారుడు ఆమె మాటలు నమ్మి తన బంగారం తాకట్టు పెట్టగా ఆ బంగారాన్ని ఫోర్జరీ సంతకంతో ఆ మహిళా మేనేజరు కాజేసి వడ్డాణం చేయించుకొన్న ఘటనపై కృష్ణాజిల్లా పెనమలూరు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. గంగూరు యూనియన్ బ్యాంకు మేనేజర్ దావులూరి ప్రభావతి పని చేస్తోంది. ఈమెకు గతంలో పరిచయం ఉన్న అదే గ్రామానికి చెందిన కవులూరి యోగేశ్వరరావు హైదరాబాద్‌లో ఉంటాడు. ఈ పరిచయంతో యోగేశ్వరరావును నమ్మబలికి అతడి 380 గ్రాముల బంగారానికి రుణాన్ని మంజూరు చేయించింది. 2 నెలల తర్వాత బంధువు ద్వారా బ్యాంకులో రుణం చెల్లించాడు. కొన్నాళ్లకు హైదరాబాద్ నుంచి వచ్చి బంగారం ఇవ్వమని అడగ్గా వడ్డాణం చేయించుకున్నానని చావు కబురు చల్లగా చెప్పింది. దీంతో తాను మోసపోయానని గ్రహించి తన సంతకం ఫోర్జరీ చేసి మోసం చేసిందని ఫిర్యాదు చేస్తూ పోలీసులను ఆశ్రయించగా దావులూరి ప్రభావతిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

బాబా మందిరానికి యాచకుడి భారీ విరాళం



సత్యనారాయణపురం, ఫిబ్రవరి 2: బాబామందిరం అభివృద్ధికి ఓ యాచకుడు లక్షలాది రూపాయలు విరాళంగా అందజేసిన అరుదైన సంఘటన ఇది. ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయి బాబా మందిరంలో శుక్రవారం యాచకుడు యాదిరెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఇప్పటికే బాబా మందిరానికి యాదిరెడ్డి వివిధ సందర్భాల్లో రూ.8లక్షల 54వేల 691 విరాళాన్ని అందజేశాడని నిర్వాహకులు తెలిపారు. యాచకుడు యాదిరెడ్డి మాట్లాడుతూ బాబా మందిరం వద్ద యాచించి సంపాదించిందంతా బాబాకే ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. మందిరాధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, సభ్యులు యాదిరెడ్డిని అభినందించి శేషవస్త్రం, ప్రసాదంతో సత్కరించారు.



డైరీ ఆవిష్కరిస్తున్న విద్యుల్లత

టౌన్‌ప్లానింగ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

పాయకాపురం, ఫిబ్రవరి 2: రాష్ట్ర మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ల అసోషియేషన్ డైరీ 2024 ఆవిష్కరణ మంగళగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఆర్‌జే విద్యుల్లత హాజరై డైరీని ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు, జాయింట్ డైరెక్టర్ రాంబాబు, అబ్దుల్ సత్తార్, శ్రీ రంగప్రసాద్, వెంకట్రావు, నాయుడు, వైవీ రమణ, వసీమ్ బేగ్, కృష్ణ, కిషోర్‌కుమార్, హరిదాసు, రాష్ట్రంలోని పురపాలక సంఘాల నుంచి సిబ్బంది పాల్గొన్నారు.

29లోపు వ్యాపార సంస్థలు లైసెన్స్ పొందాలి

- ఉప కార్మిక కమిషనర్ ఉషారాణి

కృష్ణలంక, ఫిబ్రవరి 2: లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఉపకార్మిక కమిషనర్ సీహెచ్ ఉషారాణి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 కింద వ్యాపార సంస్థలు తప్పనిసరి లైసెన్స్‌పై శుక్రవారం నగరంలోని సూర్యారావుపేట ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో వర్తక యాజమాన్య సంఘాలతో ఉప కార్మిక కమిషనర్ సీహెచ్ ఉషారాణి సమావేశం నిర్వహించారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కె.విద్యాధరరావు, ఫర్నీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇ.దామోదరరావు, సత్యనారాయణపురం వర్తక సంఘం సెక్రటరీ ఎస్.గోపాలకృష్ణ, కార్మిక శాఖ అధికారులు ఉన్నారు.




నిరసన ధర్నాలో మాట్లాడుతున్న వక్తలు

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ధర్నా

వన్‌టౌన్, ఫిబ్రవరి 2: ప్రజా రవాణా సంస్థలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, సంస్థకు కొత్త బస్సులు కొనాలని తదితర అంశాలపై డిమాండ్లతో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ శుక్రవారం ధర్నాచౌక్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సుదీర్ఘ డిమాండ్లను ప్రస్తావించారు. ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని ,సంస్థకు కొత్త బస్సులు కొనాలని, నియామకాలు చేపట్టాలన్న ప్రధాన డిమాండ్లతో పాటు మొత్తం 19 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. రిక్రూట్‌మెంట్ జరపకుండా కొత్త బస్సులు కొనకుండా, ప్రయాణికులకు సరైన రవాణా సేవలెలా అందుతాయన్నారు. మరోవైపు ప్రైవేట్ బస్సుల తాకిడి కూడా పెరిగిందన్నారు. కార్మికుల ఆర్థిక డిమాండ్లను కూడా పరిష్కరించడం లేదన్నారు. కొత్త ఆర్టీసీ బస్సులు కొనాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, నియామకాలు జరపాలని, ఉద్యోగ భద్రతకు తోడ్పడే 1/2019 సర్క్యులర్ మేరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌ఆర్‌ఎస్‌కు చాంపియన్‌షిప్



విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: పశ్చిమగోదావరి జిల్లా పత్తిపాడులో హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో గత నెల 29 నుంచి 31 వరకు ఆయుష్, ఫిజియోథెరపీ వైద్య కళాశాలలకు నిర్వహించిన స్పోర్ట్స్, గేమ్స్‌మీట్‌లో నగరంలోని డాక్టర్ ఎన్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల పురుష విద్యార్థులకు చాంపియన్‌షిప్‌ను వశం చేసుకుంది. వీటితో పాటు వాలీబాల్, చెస్, రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో పలువురు పతకాలను కైవసం చేసుకున్నారు. వీరికి రాష్ట్రప్రభుత్వం ఆయుష్‌శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్, వర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జీ, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, ప్రిన్సిపాల్ పి.సాయిసుధాకర్ బహుమతులు అందించి అభినందించారు.

9 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ

గల్లీ నుంచి ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)కు ఉత్తమ క్రికెటర్లను గుర్తించేందుకు కేకే గ్లోబల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో యనమలకుదురు కరకట్ట ప్రాంతంలో ఈ నెల 9 నుంచి 11 వరకు ఎన్.బోస్‌బాబు క్రికెట్ గ్రౌండ్స్‌లో నాకౌట్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని నిర్వహిస్తున్నట్టు మెంటర్ కల్యాణ్‌కృష్ణ, బెజవాడ టైగర్ టీమ్ నిర్వాహకులు నెక్కంటి మధుకర్ తెలిపారు. 16 నుంచి 25 ఏళ్లలోపు క్రికెటర్లతో కూడిన టీమ్‌లు బరిలో దిగుతాయన్నారు. సత్తా చాటినవారిని బెజవాడ టైగర్ టీమ్‌కు ఎంపిక చేసి ఏపీఎల్‌కు పంపేందుకు శిక్షణ ఇస్తామన్నారు.

9న విశాఖలో నేషనల్ స్కిల్ కాంక్లేవ్

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): యువతీ యువకులను అత్యంత నైపుణ్యం కలిగిన శ్రామికశక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ నెల 9న విశాఖపట్నం వేదికగా 'నేషనల్ స్కిల్ కాంక్లేవ్' నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. దీనికి సంబంధించిన ఫ్లయర్‌ను శుక్రవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ విభాగాల్లో నైపుణ్యం కలిగిన ఐటీ నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ఐఏఎస్ అధికారులు ఈ నైపుణ్య సమ్మేళనంలో పాల్గొంటారని వివరించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ, సీఈవో వినోద్‌కుమార్, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ నవ్య, సీడాప్ సీఈవో ఎం.కె.వి.శ్రీనివాసులు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిద్ధంకు 'ఖజానా' నుంచి చెల్లింపులు

- సభకోసం ఇంటర్ పరీక్షలు వాయిదా: రఘురామ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సిద్ధం పేరిట వైసీపీ నిర్వహిస్తున్న సభల ఖర్చు ఎవరిదని ఎంపీ రఘురామకృష్ణరాజు ప్రశ్నించారు. శుక్రవారం రచ్చబండ కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సిద్ధం సభకోసం ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల ఖర్చు ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లించారని, పార్టీ ఖాతా నుంచి ఇవ్వలేదని తెలిసింది. పార్టీ ఖాతాలో రూ.1,000కోట్లకు పైగా నిధులు ఉన్నప్పటికీ, వాటిని కదిలించకుండా ప్రజాధనాన్ని ఖర్చు చేయడం దారుణం. ఏలూరులో సిద్ధం సభ కోసం 20 రోజుల పాటు ఇంటర్ పరీక్షలను వాయిదా వేయాలని నిర్ణయించడం దారుణం. వివేకా సతీమణి సౌభాగ్యమ్మ ఎన్నికల్లో పోటీ చేస్తే జగన్ అండ్ కంపెనీకి వచ్చే నష్టం ఏమిటి? వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డిపై ప్రజల్లో ద్వేషాన్నినింపే విధంగా సాక్షి దినపత్రికలో రెండు పేజీల కథనాన్ని వండి వార్చడం విస్మయాన్ని కలిగించింది' అని రఘురామరాజు అన్నారు.

జగన్ పాలనలో స్మగ్లర్లు, కిడ్నాపర్లుగా పోలీసులు: లోకేశ్

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఉగ్రవాది జగన్ పాలకుడు కావడంతో రాష్ట్రంలో వనరులన్నీ దోపిడీకి గురై, అరాచకం రాజ్యమేలుతోందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శుక్రవారం ధ్వజమెత్తారు. 'క్రిమినల్ కేసుల్లో ఆరితేరిన గజదొంగ జగన్ సీఎం కావడంతో కొంత మంది పోలీసులు... దొంగలు, స్మగ్లర్లు, కిడ్నాపర్లుగా మారుతున్నారు. రాజకీయ కక్ష సాధింపుల కోసం జగన్ ఖాకీలను ప్రైవేట్ సైన్యాలుగా వాడటంతో వారికీ నేరాలు అలవాటైపోయాయి. స్మగ్లింగ్, కిడ్నాపులకు పాల్పడుతూ పోలీస్ వ్యవస్థ గౌరవాన్ని మంటగలుపుతున్నారు. కర్నూలు డీఐజీ ఆఫీస్‌లో ఎస్సైగా పని చేస్తున్న సుజన్ ఓ ముఠాని ఏర్పాటు చేసి, ఏపీ సీఐడీ టీమ్ పేరుతో ఐటీ కంపెనీ యజమానిని కిడ్నాప్ చేసి, హైదరాబాద్ పోలీసులకు చిక్కాడు. గంజాయి మాఫియాకు ఏపీ ప్రభుత్వ పెద్దల అండదండలున్నాయని తెలిసిన పోలీసులు గంజాయి స్మగ్లర్ల అవతారం ఎత్తారు. 22 కిలోల గంజాయితో కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్ హైదరాబాద్ పోలీసులకు చిక్కడం ఏపీలో పోలీసులే గంజాయి స్మగ్లర్లుగా మారిన దుస్థితిని వెల్లడిస్తోంది' అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

జగన్ మోసం చేసినా అధైర్యపడొద్దు

జగన్ మోసంతో నిండా మునిగిపోయినా నిరుద్యోగులు ఆందోళన చెందవద్దని, త్వరలో టీడీపీ-జనసేన సర్కార్ ఖాళీ టీచర్ పోస్టులన్నీ పారదర్శకంగా భర్తీ చేస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. నిరుద్యోగులకు ఆయన శుక్రవారం ఒక బహిరంగ లేఖ రాశారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేస్తుందని, జగన్ మోసంతో నిరాశ చెందకుండా డీఎస్సీకి ఇప్పటి నుంచే సిద్ధం కండి' అని లోకేశ్ పిలుపునిచ్చారు.

జగన్‌పై ఈడీ దృష్టి పడదే?: వర్ల

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్‌లో 8 ఎకరాల పొలం అన్యాక్రాంతం చేశాడని అక్కడి సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేసి, జైలుకు పంపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చూపు జగన్‌రెడ్డిపై ఎందుకు పడటం లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. '11 చార్జిషీట్లు, 5 ఈడీ కేసులు, రూ.43వేల కోట్ల అవినీతికి పాల్పడినట్లు సాక్ష్యాలలున్నా సీఎం జగన్‌రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు? జగన్‌పై చార్జిషీట్లు వేసి 11 ఏళ్లు అయినా, విచారణ ఎందుకు సాగడం లేదు?' అని వర్ల మండిపడ్డారు. కాగా, రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థుల జీవితాలను చీకటిమయం చేస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. పేదల ఆరోగ్యం కోసం చంద్రబాబు ప్రవేశపెట్టిన 33 పథకాలను రద్దు చేయడమే జగన్ వైద్య రంగంలో సాధించిన గొప్ప ప్రగతి అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్‌సూర్య విమర్శించారు. మార్టూరులో పట్టపగలు అధికారులే మారణాయుధాలతో తన ఖిలు చేయడం జగన్ గూండారాజ్‌కు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు విమర్శించారు. అధికారులే అధికారపార్టీ గూండాలుగా మారి, రాడ్లు, కర్రలు, కారప్పొడులతో తిరగడం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

వెంకయ్యనాయుడికి లోకేశ్ అభినందనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అభినందనలు తెలిపారు. శుక్రవారం ఆయన వెంకయ్య నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వెంకయ్యనాయుడిని పద్మవిభూషణ్ పురస్కారం వరించినందుకు అభినందనలు తెలిపారు. కాగా, పురస్కార గ్రహీత వెంకయ్యనాయుడిని వీహెచ్‌పీ సత్కరించింది. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్ తదితరులు శుక్రవారం, వెంకయ్య నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. వీహెచ్‌పీ సాహిత్యాన్ని వారు ఆయనకు అందజేశారు.

వల్లభనేని వంశీకి అరెస్టు వారెంట్

విజయవాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు అరెస్టు వారెంట్ జారీచేసింది. 2019 ఎన్నికల్లో పోలింగ్ రోజు రాత్రి విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పోలింగ్ బూత్ వద్ద వివాదం జరిగింది. ఆ సందర్భంగా వంశీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణకు వంశీ హాజరుకాకపోవడంతో కోర్టు శుక్రవారం అరెస్టు వారెంట్ జారీ చేసింది.

హోదా కోసం మోదీని నిలదీయండి: లక్ష్మీనారాయణ

గుంటూరు, ఫిబ్రవరి 2: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం యువత సోషల్ మీడియా వేదికగా ప్రధాని మోదీని ప్రశ్నించాలని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా సాధన విద్యార్థి, రాష్ట్ర యువజన జేఏసీ అధ్యక్షుడు షేక్ జిలాని నేతృత్వంలో గుంటూరులోని అభ్యుదయ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'సీఎం జగన్ ప్రత్యే హోదాను గాలికి వదిలేశారు. తన కేసుల మాఫీ కోసం ప్రధాని మోదీ కాళ్ల వద్ద ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టారు. పక్కనున్న తెలంగాణలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు, సాఫ్ట్‌వేర్ కారిడార్‌లు వచ్చాయి. కానీ ఏపీలో రూ.రెండు వేల కోట్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. ఇది మన రాష్ట్ర దయనీయ స్థితిని తెలియజేస్తుంది' అని విమర్శించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ... 'రాష్ట్రాన్ని బీజేపీ ఎంతగానో మోసగించింది. ప్రత్యేక హోదాను చంపే ప్రయత్నం చేస్తుంది. సీఎం జగన్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ప్రత్యేక హోదా కోసం యుద్ధం ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు.

విశాఖ రైల్వే జోన్‌పై డ్రామాలు కట్టిపెట్టాలి: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడుతున్న డ్రామాలను కట్టిపెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు కోసం భూమిని కేటాయించి, రైల్వే శాఖకు అప్పగించాలని శుక్రవారం డిమాండ్ చేశారు. జగన్ సర్కారు నాలుగేళ్లుగా ఆ రైల్వే జోన్ ఏర్పాటుకు అవసరమైన 53 ఎకరాల భూమిని ఇవ్వకుండా దాగుడుమూతలు ఆడుతోందన్నారు.

రామాలయం మైకులో 'జగనన్న భజన'

- మంత్రి ఉష శ్రీచరణ్ కోసం వైసీపీ నేతల అత్యుత్సాహం

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 2: మంత్రి ఉష శ్రీచరణ్‌కు స్వాగతం పలికేందుకు అధికార పార్టీ నాయకులు ఏకంగా రామాలయం మైక్‌సెట్‌లో జగనన్న భజన పాటలు మోగించారు. ఊరందరికీ వినిపించేలా భారీగా సౌండ్ పెంచి విమర్శల పాలయ్యారు. ఇటీవల పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన ఉష శ్రీచరణ్.. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలంలో శుక్రవారం పర్యటించారు. తుంగోడు పంచాయతీ చిన్నబాబయ్యపల్లి గ్రామానికి చేరుకున్న ఆమెకు స్వాగతం పలికేందుకు స్థానిక వైసీపీ నాయకులు.. రామాలయంలో ఏర్పాటు చేసిన మైక్‌ను వాడుకున్నారు. వస్తున్నది మంత్రి, మైక్‌ను వాడుకుంటున్నది అధికార పార్టీవారు కావడంతో ఆలయ పూజారి నిస్సహాయంగా ఓ మూలకు కూర్చుండిపోయారు.

ఎంఈవో-1లకు డ్రాయింగ్ అధికారాలివ్వాలి

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-1లకు జీత భత్యాలను డ్రాచేసుకునేందుకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ ఇవ్వాలని ఎంఈవో-1 సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాశారు. ప్రభుత్వం ఎంఈవో-1, 2ల విధులపై స్పష్టమైన జాబ్‌చార్ట్ విడుదలచేసినా కొన్ని జిల్లాల్లో ఎంఈవో-1లపై పనిభారం పెరుగుతోందని తెలిపారు.

మళ్లీ పాత బ్రాండ్లతో కిక్కు

- ఎన్నికల కోసం హడావుడిగా 'లిక్కర్ డీల్'
- కొత్త బ్రాండ్లపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- పేదల ఆరోగ్యం ఫణంగా కొత్త బ్రాండ్లు
- ఇలాగైతే కష్టమని భావించిన పెద్దలు
- వారం నుంచి బార్లు, షాపుల్లో టీడీపీ హయాం నాటి పాత బ్రాండ్లు
- దానికీ డీల్ మాట్లాడిన ప్రభుత్వ పెద్దలు
- పాత బకాయిలూ ఇచ్చేలా కంపెనీలతో ఒప్పందం

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. అందులో మద్యం అమ్మకాల ప్రస్తావన వచ్చినపుడు కొత్త బ్రాండ్లపై జనం భగ్గుమన్నారు. అది కూడా మహిళల్లో తీవ్ర వ్యతిరేకత కనిపించింది. దీన్ని గమనించిన పార్టీ పెద్దలు.. ఇలాగైతే ఎన్నికల్లో దెబ్బ తింటామని ఆందోళనకు గురయ్యారు. ఎలాగూ హామీ ఇచ్చినట్లు సంపూర్ణ మద్యపాన నిషేధం చేయలేకపోతున్నాం....కనీసం బ్రాండ్లపై అయినా వ్యతిరేకత లేకుండా చూసుకుందామని ఎత్తు వేశారు. టీడీపీ హయాం నాటి పాత బ్రాండ్లను మళ్లీ అందుబాటులోకి తెచ్చారు.

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగన్ ప్రభుత్వం అనేక ఎత్తులు వేస్తోంది. మద్యం బ్రాండ్ల విషయంలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని గుర్తించిన ప్రభుత్వం పాత బ్రాండ్లను మళ్లీ మార్కెట్‌లోకి వదిలింది. ఇంత కాలం ప్రభుత్వ పెద్దల సొంత బ్రాండ్లనే బలవంతంగా అమ్మగా, ఇప్పుడు ఓటర్లను మచ్చిక చేసుకోవడం కోసం గత ప్రభుత్వంలో మార్కెట్‌లో ఉన్న పాపులర్ బ్రాండ్లను తీసుకొచ్చింది. గత వారం రోజుల నుంచి బార్లు, ప్రభుత్వ మద్యం షాపులకు అన్ని బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఒక్కసారిగా పాత బ్రాండ్లను సరఫరా చేయడంతో బార్ల యాజమాన్యాలు, షాపుల్లోని సిబ్బంది కూడా అవాక్కయ్యారు. కాగా ఎన్నికల్లో లాభం పొందడం కోసమే పాత బ్రాండ్లను తీసుకొచ్చినా....ప్రభుత్వ పెద్దలు ఆయా కంపెనీలతో కూడా కమీషన్ల డీల్ కుదుర్చుకున్నారు. అయితే కమీషన్‌ను కొంతమేర తగ్గించుకున్నట్టు, పాత బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్టు మద్యం వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే దీనివల్ల తమకు నష్టం జరుగుతుందని కమీషన్లు సమర్పించుకుంటున్న కొత్త బ్రాండ్ల కంపెనీలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి.

మళ్లీ ఊపందుకోనున్న వ్యాపారం

పాత బ్రాండ్లు మళ్లీ రావడంతో మద్యం వ్యాపారం ఊపందుకుంటోంది. కొత్త బ్రాండ్ల మద్యం తాగడం ఇష్టంలేని వినియోగదారులు కొంతమంది తాగుడుకు దూరం కాగా, కొందరు తగ్గించుకున్నారు. ఇప్పుడు మళ్లీ పాత బ్రాండ్లు తేవడంతో ఎన్నికల సమయంలో మంచి వ్యాపారం జరుగుతుందని బార్ల యాజమాన్యాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే బార్లకు కావాల్సిన విధంగా బ్రాండ్లు సరఫరా చేస్తున్నారు. షాపులకు కూడా అన్ని బ్రాండ్ల మద్యం ఇస్తున్నా అన్ని షాపులకు ఇంకా పూర్తిస్థాయిలో చేరలేదు. ప్రభుత్వ నిర్ణయంతో బార్లలో వ్యాపారం కూడా కొంతమేర పెరిగింది. ప్రస్తుతం రోజుకు మొత్తం రూ.75కోట్ల మేర వ్యాపారం జరుగుతుండగా ఇకపై రోజుకు రూ.5 నుంచి రూ.10కోట్లు పెరిగే అవకాశం ఉంది. అయితే ఎన్నికల షెడ్యూలు విడుదలైతే గతేడాది ఈ సమయంలో అమ్మిన మద్యం దాటి అమ్మకూడదు.



రూ.200 కోట్ల బకాయిలు

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి రూ.700 కోట్ల విలువైన బిల్లులు మద్యం కంపెనీలకు చెల్లించాలి. అధికారంలోకి వస్తూనే వ్యాపారాన్ని చేతుల్లోకి తీసుకున్న ప్రభుత్వం ఆ బకాయిల విషయంలో కంపెనీలను ముప్పతిప్పలు పెట్టింది. ప్రభుత్వ పెద్దల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితేగానీ బకాయిలు ఇవ్వలేదు. ఇప్పటికీ ఇంకా రూ.200 కోట్లు కంపెనీలకు చెల్లించాలి. ఇప్పటివరకూ ఇచ్చిన బకాయిల బిల్లుల్లోనూ అధికార పార్టీ పెద్దలు 25శాతం కమీషన్‌గా తీసుకున్నారు. ఇప్పుడు మిగిలిన బకాయిలకు పాత బ్రాండ్లకు ముడి పెట్టినట్లు తెలిసింది. అలాగే ప్రస్తుతం మద్యం సరఫరా చేస్తున్న కంపెనీలన్నీ కేసుకు రూ.250 చొప్పున అధికార పార్టీ పెద్దలకు ఇస్తున్నాయి. ఇప్పుడు పాపులర్ బ్రాండ్ల విషయంలో అది కొంత తగ్గించినట్లు తెలిసింది. అవసరం ప్రభుత్వానిది కావడంతో ప్రజల్లో వ్యతిరేకత తగ్గించుకునేందుకు ఆ బ్రాండ్లు అవసరం కావడంతో కమీషన్ల విషయంలో కొంత రాజీపడ్డారని, అయితే ఎంతోకొంత ఇవ్వకుండా మాత్రం ఆర్డర్లు ఇవ్వడం లేదని తెలిసింది.

సర్వేలో తేలడంతోనే...

నాలుగేళ్లుగా మద్యం కంపెనీలు, వినియోగదారులు మొత్తుకున్నా పాత బ్రాండ్లకు అనుమతి ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు అకస్మాత్తుగా వాటిని మార్కెట్‌లోకి తేవడం వెనుక బలమైన కారణం ఉందని మద్యం కంపెనీలు భావిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు... అధికార పార్టీ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. అందులో మద్యం అమ్మకాల ప్రస్తావన వచ్చినపుడు కొత్త బ్రాండ్లపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అది కూడా మహిళల నుంచీ వచ్చినట్లు తెలిసింది. 'మా ఇళ్లల్లో మగాళ్లు గతంలో ఏదొక మందు తాగి ఇంటికొచ్చేవారు. కానీ ఈ ప్రభుత్వంలో వచ్చిన కొత్త కొత్త సీసాల వల్ల ఆరోగ్యం చెడిపోతోంది. కొంతమంది చనిపోతున్నారు కూడా' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇక పురుషుల్లో అయితే బ్రాండ్లపై సర్వత్రా వ్యతిరేకత వచ్చింది. దీన్ని గమనించిన పార్టీ పెద్దలు మద్యం వల్ల తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. ఎలాగూ హామీ ఇచ్చినట్లు సంపూర్ణ మద్యపాన నిషేధం చేయలేకపోతున్నామని, కనీసం బ్రాండ్లపై అయినా వ్యతిరేకత లేకుండా చూసుకుందామని భావించారు. ఆ వెంటనే పాపులర్ బ్రాండ్ల కంపెనీలకు కబురుపెట్టి డీల్ సెట్ చేసుకున్నారని మద్యం కంపెనీల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈసారి నేరుగా మద్యం కంపెనీలతో మాట్లాడకుండా మధ్యలో ఏజెంట్లను సెట్ చేసుకుని ఒప్పందాలు చేసుకున్నారు. నెల రోజుల కిందట ఈ ఒప్పందాల తతంగం జరగ్గా వారం రోజుల నుంచి అది కార్యరూపం దాల్చింది.

మహిళపై వైసీపీ నేత దాష్టీకం

- సామగ్రి బయటకు విసిరేసి ఇల్లు స్వాధీనం
- వివాదం న్యాయస్థానంలో ఉన్నా దౌర్జన్యం

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 2: శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామంలో ఓ వైసీపీ నేత నిరుపేద మహిళ ఇంటిని బలవంతంగా స్వాధీనం చేసుకున్నాడు. బాధిత మహిళ నీలాపు సుజాత 16ఏళ్లుగా నౌపడ పోస్టాఫీసు రహదారిలోని తన 2సెంట్ల స్థలం ఇంటిలో జీవిస్తున్నారు. ఈ ఇంటిని యజమాని సింగ్ గతంలో సుజాతకు రాసిఇచ్చారు. అప్పటినుంచి అది సుజాత ఆధీనంలో ఉంది. ఇటీవల సంక్రాంతి అనంతరం సుజాత కుటుంబం కూలి పనుల కోసం చెన్నై వెళ్లిపోయింది. కొద్ది రోజుల క్రితం స్థానిక వైసీపీ నేత ఈ ఇంటిని ఆక్రమించాడు. దీనిపై సుజాత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వివాదం కోర్టులో ఉండగానే వైసీపీ నేత శుక్రవారం బలవంతంగా ఇంట్లో సామగ్రిని బయటపడేసి, ఇంటికి తాళం వేశాడు. దీంతో బాధితురాలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.



బయట పడేసిన సామగ్రి

వ్యవసాయ ఉద్యోగులపై ఒత్తిళ్లు

- బలవన్మరణాలకు పాల్పడుతున్న ఆర్బీకే సిబ్బంది
- ఎరువులు, పురుగు మందుల అమ్మకాల్లో టార్గెట్లు
- సొమ్ము చెల్లించకుండానే తీసుకెళ్తున్న వైసీపీ నేతలు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకేలు) ఏర్పాటు తర్వాత ఒత్తిళ్లు మరింత పెరిగాయి. అనేక పనులు అప్పగించి, నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్లు విధిస్తోంది. దీంతో గత నాలుగేళ్లలో పలువురు వ్యవసాయ ఉద్యోగులు బలవన్మరణాలకు పాల్పడగా, తాజాగా బాపట్ల జిల్లాకు చెందిన గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. శ్రీకాళహస్తిలో ఎంపీఈవో శ్రీలక్ష్మి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆర్బీకేల్లో ఎరువులు, పురుగు మందుల వ్యాపారాన్ని ప్రభుత్వం మొదలుపెట్టింది. అత్యధిక రైతులు అక్కడే ఎరువులు కొనేలా చూడాలని సిబ్బందికి హుకుం జారీ చేసింది. ప్రైవేటు డీలర్లు అరువు పద్ధతిలో రైతులకు ఎరువులు, పురుగు మందులు అందిస్తారు. అదే ఆర్బీకేల్లో ముందుగా పేర్లు నమోదు చేసుకుని, సొమ్ము చెల్లించి తీసుకోవాలి. ఈ కారణంగా రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో డీలర్లకు ఎరువుల కోటా తగ్గించిన ప్రభుత్వం ఆర్బీకేలకు పెంచి, వచ్చిన సరుకంతా అమ్మాలని సిబ్బందిని ఒత్తిడి చేస్తోంది. చాలా చోట్ల అధికార పార్టీ నేతలు వైసీపీ అనుకూల రైతులకే ఎరువులు, పురుగు మందులు ఇప్పించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. పైగా కొందరు నగదు చెల్లించకుండా తర్వాత ఇస్తామంటూ, పెద్ద నాయకుల పేర్లు చెప్పి, సరుకు తీసుకెళ్లి, ఆర్బీకే సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

వీఏఏ ఆత్మహత్య

వేమూరు, ఫిబ్రవరి 2: మంత్రి మేరుగ నాగార్జున నియోజకవర్గ పరిధిలో ఆర్బీకేలకు అనుబంధంగా పనిచేస్తున్న వీఏఏలు వరుసగా ఆత్మహత్యల బాటపట్టడం సంచలనాన్ని రేకెత్తిస్తోంది. వేమూరు మండలం పెరవలికి చెందిన వీఏఏ గతంలో ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటన మరువక ముందే అదే మండలంలో చావలి ఆర్బీకేలో పని చేస్తున్న వీఏఏ, ఆర్బీకే ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి బెల్లంకొండ పూజిత (23) గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. గోదాముల సౌకర్యం లేక చావలి ఆర్బీకే ద్వారా అమ్మకానికి సిద్ధం చేసిన ఎరువులు వర్షాలకు తడిచాయి. తడిచిన ఎరువులనే అమ్మాలని అధికారులు ఆమెపై ఒత్తిడి తెచ్చారు. ఆర్బీకే భవన యజమానికి అద్దె చెల్లించకపోవడంతో ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఎరువుల అమ్మకం, సొమ్ము జమ విషయమై పై అధికారుల ఒత్తిడి పెరిగింది. డబ్బు చెల్లించలేని పరిస్థితిలో పూజిత గురువారం కన్నీటితో ఇంటికి చేరుకుని, ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, పూజిత మృత దేహానికి నివాళులు అర్పించిన రైతు భరోసా కేంద్రాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌మోహన్ మాట్లాడుతూ, 'ప్రభుత్వం మాకు ఉద్యోగాలు ఇచ్చింది బతకమనా? చావమనా? అధికారులు, పార్టీ నేతలు మమ్మల్ని బలి పశువులను చేస్తున్నారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూజిత మృతదేహాన్ని సందర్శించడానికి వచ్చిన పలు ప్రాంతాల వీఏఏలు కొద్దిసేపు నిరసన తెలిపారు. గిడ్డంగుల సౌకర్యాలు కల్పించకుండా ఎరువుల అమ్మకాలకు సిబ్బందిపై ఒత్తిడి చేయడం వల్ల ఇలాంటి దురదృష్టకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం పేర్కొంది.

బైరైటీస్‌కు రెక్కలు

- వైసీపీ నేతల జేబుల్లోకి రూ.100 కోట్లు
- క్రెడిట్ కింద ఖనిజం తీసుకెళ్లిన పెద్దలు
- ఏపీఎండీసీకి ముఖం చాటేసిన నేతలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష నేతలైతే చాలు...ఏతప్పూ చేయకుండానే విజిలెన్స్ దాడులు చేస్తారు. వైసీపీ నేతలను వెంటేసుకొని వాహనాల్లో కత్తులు, కారప్పొడులు, మారణాయుధాలు పెట్టుకుని తనిఖీలు చేస్తారు. అర్ధరాత్రులు అరెస్ట్‌చేసి వేధింపులకు గురిచేస్తారు. బాపట్ల జిల్లా పర్చూరులో గనుల శాఖ విజిలెన్స్ విభాగం చేసిన నిర్వాకమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. వైసీపీ నేతలు రూ.వందల కోట్ల స్కామ్‌లు, స్కీమ్‌లు వేసినా జీ హుజూర్ అంటారు. ఏపీఎండీసీని నిలువునా ముంచి కోట్ల రూపాయలు ఎగ్గొట్టినా వంగివంగి సలామ్‌లు చేస్తారు. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం...ఉమ్మడి కడప జిల్లా మంగంపేట బైరైటీస్...

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థకు మంగంపేటలో బైరైటీస్ మైన్‌నిల్వలున్నాయి. ఈ గనులపై కన్నేసిన వైసీపీ నేతలు ఏపీఎండీసీని గుప్పిటపట్టారు. ప్రత్యక్ష వేలంలో పాల్గొనకుండా, టెండర్లలో బిడ్డింగ్ వేయకుండా రాజకీయ ఒత్తిళ్లతో బైరైటీస్‌ను తీసుకెళ్లారు. అది ఏదో ఐదు కోట్లో, పది కోట్లో కాదు..ఏకంగా 200 కోట్లపైనే. ఇందులో 100కోట్లకు ఇప్పటి వరకు లెక్కతేలింది. ఏపీఎండీసీకి రూపాయి చెల్లించకుండా బైరైటీస్‌ను తీసుకెళ్లి దేశవిదేశాలకు అమ్ముకున్నారు. కోట్లకు పడగలెత్తారు. కానీ సంస్థకు బకాయిలు చెల్లించకుండా ముఖం చాటేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా సొమ్ము రాబట్టుకునేందుకు కార్పొరేషన్ ఇసుమంతైనా ప్రయత్నం చేయడంలేదు. నోటీసులు ఇవ్వడంలేదు. కనీసం 'మా బకాయిలు చెల్లించండి'అని కోరడం లేదు. ఎందుకో తెలుసా? బకాయిదారుల్లో సింహభాగం అధికార వైసీపీ ముఖ్యనేతలు. ఉమ్మడి కడప జిల్లాలో ఆయా నియోజకవర్గాల్లో పట్టున్న బడా నేతలు. అందుకే వారి వైపు అధికారులు కన్నెత్తిచూడటం లేదు.

గ్యారంటీగా డీకేటీ భూములు

తిన్నవారికి తిన్నంత అన్నట్లుగా బైరైటీస్ దందాసాగిపోతోంది. ఇప్పటికీ ఈ విధానం గుట్టుగా సాగిపోతూనే ఉంది. మచ్చుకు కొన్ని ఉదంతాలు...

- కడప జిల్లాకు చెందిన ఓ వైసీపీ నేత డీకేటీ భూములను పట్టా భూములుగా చూపించి వాటిని గ్యారంటీగా పెట్టి బైరైటీస్ తీసుకున్నారు. దీని విలువ 42 కోట్లపైనే ఉంటుందని అంచనా. ఏళ్లు గడుస్తున్నా ఆ నేత ఏపీఎండీసీకి రూపాయి చెల్లించలేదు. గ్యారంటీగా చూపిన భూముల వివరాలను పరిశీలించగా అవి పట్టా కాదు...డీకేటీ అని తేలింది. దీంతో అధికారులు షాక్‌కు గురయ్యారు.
- కడప జిల్లాకే చెందిన ప్రగతి మినరల్స్ నుంచి 26.33కోట్ల రూపాయలు రికవరీ చేయాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గనులశాఖకు సిఫారసు చేసింది. 54,655 మెట్రిక్ టన్నుల బైరైటీస్ అక్రమ రవాణాకు సంబంధించి విజిలెన్స్ విచారణ జరిపి ఈ సిఫారసు చేసింది.
- కడపకు చెందిన అధికారపార్టీ నేత 167 మంది బినామీ రైతులను చూపి 32వేల టన్నుల బైరైటీస్ తరలించుకుపోయారు. ఇదే నేత ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ముందుపెట్టి 3.63కోట్ల విలువైన బైరైటీస్‌ను తీసుకెళ్లారు. ఈ దందా విలువే 20కోట్లపైనే ఉంటుందని అంచనా.
- కడప జిల్లాకు చెందిన నేత కుటుంబానిదే ఐబీసీ లిమిటెడ్ కంపెనీ. ఈ సంస్థ ఏపీఎండీసీ నుంచి గత కొన్నేళ్లలో నాణ్యమైన బైరైటీస్ తీసుకుంది. ఇందుకు 39 కోట్లు చెల్లించాలి. వడ్డీ, అపరాధరుసుము, ఇంకా జీఎస్టీ అదనం. అయితే, ఆ సంస్థ ఇప్పటి వరకు 4కోట్లు మాత్రమే చెల్లించినట్లు తెలిసింది. ఇంకా 33.59కోట్లు చెల్లించాల్సి ఉంది.
- ఏపీఎండీసీతో జాయింట్ వెంచర్ కింద ఐబీసీ లిమిటెడ్ ఆంధ్రా బైరైట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఏబీసీపీఎల్) అనే కంపెనీని ఏర్పాటు చేశారు. ఇందులో ఏపీఎండీసీకి 11 శాతం వాటా ఉంది. మిగతా 89 శాతం ఐబీసీ లిమిటెడ్‌కు ఉంది. ఇది కందుల రాజమోహన్‌రెడ్డిది. ఆ సంస్థ 33.59 కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలి. బకాయి వసూళ్లకోసం రెవెన్యూరికవరీ కింద ఆస్తుల స్వాధీనం, ఇతర అవకాశాలు ఉన్నా ఏపీఎండీసీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాజకీయ ఒత్తిళ్లే ఇందుకు కారణమని తెలుస్తోంది.
- ఆంధ్రా బైరైట్ కార్పొరేషన్ ప్రైవేటు లిమిటెడ్ (ఏబీసీపీఎల్) 2015 నుంచే పనిచేయడం లేదు. కానీ ఆ సంస్థకు సీడీ గ్రేడ్ బైరైటీస్ సరఫరా రేటు ఒక టన్నుకు రూ. వెయ్యిగా ఉంది. 2008లో జరిగిన ఒప్పందం ప్రకారం ఇది అమలవుతోంది. అయితే, ఆ సంస్థ పనిచేయకున్నా, ఇప్పటికీ అదే రేటుకు బైరైటీస్‌ను సరఫరా చేయాలని కోరుతుండటం గమనార్హం, దీని వల్ల టన్నుకు వెయ్యి రూపాయల చొప్పున ఏపీఎండీసీ నష్టపోతోంది.
- అధికారిక గణాంకాల ప్రకారం కిషన్ ఎంటర్‌ప్రైజెస్ 4.82 కోట్లు, ప్రెస్ మినరల్స్ 72.15 లక్షలు, హరిణి ఇండస్ట్రీస్ 75.80 లక్షలు, పావనీ అండ్ కో 27.53 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది.
- ఇద్దరు వైసీపీ నేతలు చేరో రెండు కంపెనీల పేరిట భారీ బకాయిలు పెట్టారు.

హౌసింగ్ బాధ్యతల స్వీకరణకు వెంకటరమణారెడ్డి నో

- జేఎండీ శివప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి కే వెంకటరమణారెడ్డి ఇంతవరకు బాధ్యతలు స్వీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 28న కొంతమంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ బదిలీల్లో హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న జీ లక్ష్మీశాను తిరుపతి జిల్లా కలెక్టరుగాను, ఆ జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డిని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగాను బదిలీ చేసింది. వెంకటరమణారెడ్డి ఇంతవరకు బాధ్యతలు స్వీకరించలేదు. జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణంలో అవినీతి ఆరోపణలు, హౌసింగ్ కార్పొరేషన్‌లో అవకతవకలు, అక్రమాల నేపథ్యంలోనే ఆయన బాధ్యతలు చేపట్టడానికి నిరాకరించినట్లు తెలిసింది. దీంతో కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టరుగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి ఎం.శివప్రసాద్‌కు ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అప్రెంటీస్ విధానం వద్దు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అప్రెంటీస్ విధానాన్ని తిరిగి తేవడాన్ని స్కూల్ అసిస్టెంట్ల సంఘం వ్యతిరేకించింది. ఎప్పుడో రద్దుచేసిన విధానాన్ని మళ్లీ మళ్లీ తిరగతోడటం ఏంటని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.నరోత్తంరెడ్డి, సీహెచ్.సుబ్బారావు ఓ ప్రకటనలో ప్రశ్నించారు. మార్చి వరకు రిటైర్ అయ్యేవారి ఖాళీలు కూడా లెక్కించి మొత్తం పోస్టులకు డీఎస్సీ ప్రకటించాలన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి: సీఎస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా గ్రామాలు, ఆవాసాల్లో తాగు నీటికి ఇబ్బంది లేకుండా వెంటనే తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. రక్షిత మంచినీటి పథకాలు, ఇతర తాగునీటి సోర్సులన్నింటినీ పూర్తిగా అందుబాటులో ఉంచుకోవాలని, ముఖ్యంగా తీరప్రాంత మండలాల్లోని గ్రామాలు, గిరిజన మారుమూల ప్రాంతాలపై దృష్టిసారించాలని సూచించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి ఆయన కరువు, విపత్తుల నిర్వహణపై తదనంతర చర్యలపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శిశు మరణాల నివారణకు చర్యలు: ఆరోగ్య కమిషనర్

శిశు మరణాల రేటు తగ్గించేందుకు బహుముఖ విధానాన్ని అమలు చేస్తోన్నామని ఆరోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ చెప్పారు. శిశుమరణాలు తగ్గించడమే లక్ష్యంగా విజయవాడలో నవజాతి శిశువు, బాల్య అనారోగ్యం వంటి అంశాలతో ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్‌పై ఐదురోజుల శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. చివరిరోజు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఆస్పత్రుల్లో మౌలికసదుపాయాలు, వనరులను పెంపొందించడానికి, పరికరాలు, మానవ వనరులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. శిశు మరణాలు, నవజాతి శిశు మరణాలు తగ్గించేందుకు ఎస్ఎన్‌సీయూలు, ఎన్ఐసీయూలు కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. వీటిని బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.

తెలుగు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైళ్లు!

- మార్చిలోగా హైస్పీడ్ రైల్వే కారిడార్ల సర్వే పూర్తి
- హైస్పీడ్ రైళ్ల వేగం గంటకు 220 కి.మీ.
- బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు పెరిగిన కేటాయింపులు
- దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ వెల్లడి
- ఎంఎంటీఎస్ రెండోదశ కొనసాగింపు ఇప్పట్లో లేనట్లే!

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే హైస్పీడ్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చెప్పారు. దక్షిణ మధ్యరైల్వే పరిధిలోని ప్రాజెక్టులకు తాజా కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయని పేర్కొన్నారు. శుక్రవారం రైల్ నిలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ, తెలంగాణలో రాజధాని నగరాలను కలుపుతూ రెండు కారిడార్లను 2023 ఆగస్టులో ప్రతిపాదించారని, ఇందులో ఒకటి శంషాబాద్-విజయవాడ-విశాఖపట్నం కారిడార్ కాగా, మరొకటి విశాఖపట్నం-విజయవాడ- కర్నూలు కారిడార్ అని వెల్లడించారు. ఈ కారిడార్‌లలో మొత్తం 922 కిలోమీటర్ల మార్గానికి సంబంధించి ఇప్పటికే ఏరియల్ సర్వే పూర్తయిందని, ప్రస్తుతం కొనసాగుతున్న ఫీల్డ్ (ప్రిలిమినరీ ఇంజనీరింగ్ ట్రాఫిక్) సర్వే మార్చిలోగా పూర్తి కానుందని చెప్పారు. హైస్పీడ్ కారిడార్‌లు అందుబాటులోకి వస్తే గంటకు 220 కి.మీ. వేగంతో రాజధాని నగరాల మధ్య రైళ్లు పరుగులు పెడతాయని చెప్పారు. కాగా ప్రయాణికులకు అత్యంత వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే నిమిత్తం 40వేల సాధారణ రైలు బోగీలను వందేభారత్ ప్రమాణాలతో మార్పు చేస్తున్నట్లు చెప్పారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తుండగా, వాటి నిర్వహణ సదుపాయాల అభివృద్ధికి కేంద్రం రూ.10కోట్లు కేటాయించిందని చెప్పారు. త్వరలోనే మరికొన్ని రైళ్లు దక్షిణమధ్యరైల్వేకు రావచ్చన్నారు. కాగా, విజయవాడ-గూడూరు మధ్య నాల్గవ లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ప్రస్తుతం జరుగుతున్న మూడవ లైన్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. వీలైనంత త్వరగా నాల్గవ లైన్ నిర్మాణానికి అవసరమైన సర్వేను ప్రారంభించనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.

ఏపీకి రూ.9 వేలకోట్లు.. తెలంగాణకు రూ.5 వేల కోట్లు

రెండు తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులకు 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రూ.14,209 కోట్ల కేటాయింపులు జరిగాయని జీఎం అరుణ్‌కుమార్ తెలిపారు. ఇందులో ఏపీ పరిధిలోని ప్రాజెక్టులకు రూ.9,138 కోట్లు కేటాయించగా, తెలంగాణ ప్రాజెక్టులకు రూ.5,071 కోట్లు కేటాయించారని చెప్పారు. నిరుడు బడ్జెట్ కేటాయింపుల కంటే ఏపీకి 8.7శాతం, తెలంగాణకు 14.7శాతం అదనంగా వచ్చినట్లు చెప్పారు. ఈ బడ్జెట్‌లో దక్షిణ మధ్యరైల్వే పరిధిలో కొత్తగా రెండు డబ్లింగ్ లైన్లు, ఒక బైపాస్ లైన్‌ను కేంద్రం మంజూరు చేసిందని, భద్రాచలం-డోర్నకల్ మధ్య రూ.770 కోట్లతో 54.65 కిలోమీటర్లను వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపడతామన్నారు. కాగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అభివృద్ధి ప్రాజెక్టుల కోసం రూ.1650 కోట్లు కేటాయించారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 3 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com



నిట్ వరంగల్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ వరంగల్)- ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది.

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి 12 రోజులు. ప్రతి ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఐఐటీలు, ఐఐఐటీలు, నిట్ సంస్థల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ మెంబర్లు సెషన్స్ నిర్వహిస్తారు. ఇంజనీరింగ్/ఎంసీఏ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, పీజీ చదువుతున్నవారు, పీహెచ్‌డీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తారు.

స్మార్ట్ కాంట్రాక్ట్ మాస్టరీ: పయనీరింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్

సంస్థ ఆధ్వర్యంలోని సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్, ఈ&ఐసీటీ అకాడమీలు ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నాయి. ఇందులో బ్లాక్ చెయిన్-కరెంట్ అండ్ ఫ్యూచర్ అప్లికేషన్స్, ఇన్ఫర్మేషన్ అటెస్టేషన్ అండ్ మల్టీ ప్రొటోకాల్ స్టోరేజ్ ఫర్ వెబ్, బ్లాక్ చెయిన్-క్వెరీ లాంగ్వేజ్, బిజినెస్ నెట్‌వర్క్స్ అండ్ ప్రాసెస్ బేస్డ్ ఆన్ మోడలింగ్ అండ్ బ్లాక్ చెయిన్, ఓపెన్ అండ్ పర్మిషన్ లెస్ బ్లాక్ చెయిన్స్, హైబ్రిడ్ ఆర్కిటెక్చర్స్ ఫర్ బ్లాక్ చెయిన్స్ అండ్ క్లౌడ్ టెక్నికల్ ఆర్కిటెక్చర్స్, బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్, స్మార్ట్ కాంట్రాక్ట్స్, ట్రెయినింగ్ ఆన్ సాలిడిటీ లాంగ్వేజ్, ఇంట్రడక్షన్ టు టెస్టింగ్, బౌండెడ్ మోడల్ చెకింగ్ అంశాలు వివరిస్తారు. టెస్టింగ్ టూల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **ఎంపికయిన అభ్యర్థులకు ఈ-మెయిల్ సమాచారం:** మార్చి 22న

ఆప్టిమైజేషన్ టెక్నిక్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్

ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని ఈ&ఐసీటీ అకాడమీ నిర్వహిస్తోంది. ఇందులో డైరెక్ట్ సెర్చ్ మెథడ్స్, గ్రేడియంట్ బేస్డ్ మెథడ్స్, సింపుల్ మెథడ్ అండ్ లీనియర్ ప్రోగ్రామింగ్, జెనెటిక్ అల్గారిథమ్, పార్టికల్ ఆప్టిమైజేషన్, డిఫరెన్షియల్ ఎవల్యూషన్, కాలనీ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, సిమ్యులేటెడ్ ఎనీలింగ్ అల్గారిథమ్, టీచింగ్ లెర్నింగ్-ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, ఆప్టిమైజేషన్ మెథడ్స్, డెసిషన్ మేకింగ్ మెథడ్స్, న్యూరల్ నెట్‌వర్క్స్-అప్లికేషన్స్, హైబ్రిడ్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ అంశాలు వివరిస్తారు. సాఫ్ట్ కంప్యూటింగ్, మెటా ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లకు సంబంధించిన కేస్ స్టడీస్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 11 నుంచి 22 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5
- **ఎంపికయిన అభ్యర్థులకు ఈ-మెయిల్ సమాచారం:** మార్చి 8న

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **వెబ్‌సైట్:** nitw.ac.in

ఇండస్ బిజినెస్ అకాడమీలో పీజీడీఎం

బెంగళూరులోని ఇండస్ బిజినెస్ అకాడమీ(ఐబీఏ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ, ఎన్‌బీఏ, ఐఏసీబీఈ-యూఎస్‌ఏ సంస్థల గుర్తింపు ఉంది. ఇది డ్యూయెల్ స్పెషలైజేషన్ కోర్సు. ఈ ప్రోగ్రామ్ ఎంబీఏ డిగ్రీకి సమానం. జాతీయ పరీక్ష స్కోర్, అకడమిక్ ప్రతిభ, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్స్ ఇస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది.

స్పెషలైజేషన్‌లు

మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్ అండ్ ఈ-బిజినెస్, రిటైల్, ఆపరేషన్స్, ఇంటర్నేషనల్ బిజినెస్, అంత్రప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్.

ప్రోగ్రామ్ వివరాలు

ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. రెండు, మూడు ట్రైమెస్టర్లలో స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. మూడో ట్రైమెస్టర్ అంటే మొదటి ఏడాది కోర్సు పూర్తికాగానే రెండు నెలల కార్పొరేట్ ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ అనాలిసిస్, ప్రజెంటేషన్స్, గెస్ట్ లెక్చర్స్, సెమినార్స్, మాక్ ఇంటర్వ్యూ సెషన్స్, గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి.

అర్హత

- ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2024/మ్యాట్(2023 సెప్టెంబరు/డిసెంబరు; 2024 ఫిబ్రవరి/మే)/ఏటీఎంఏ 2024/(జీమ్యాట్/జీఆర్‌ఈ)(2023 జూలై తరవాత)/గేట్(2023/2024) అర్హత పొంది ఉండాలి.

వెయిటేజీ

జాతీయ పరీక్ష స్కోర్‌కు 20 మార్కులు, అకడమిక్ ప్రతిభకు 35 మార్కులు, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌కు 10 మార్కులు, గ్రూప్ డిస్కషన్-పర్సనల్ ఇంటర్వ్యూకు 35 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

స్కాలర్‌షిప్

- పదోతరగతి నుంచి డిగ్రీ వరకు 60 శాతానికి పైగా మార్కులు ఉంటే 'పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.50,000; 70 శాతానికి పైగా మార్కులు ఉంటే 'సర్దార్ వల్లభ్‌భాయ్ జావేర్‌భాయ్ పటేల్ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.60,000; 80శాతానికి పైగా మార్కులు ఉంటే 'నేతాజీ సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ స్కాలర్‌షిప్' కింద రూ.70,000 ఇస్తారు.
- 'అటల్ బిహారి వాజపేయి మెమోరియల్ స్కాలర్‌షిప్'నకు పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. క్యాట్/ ఎక్స్‌ఏటీ/జీమ్యాట్/జీఆర్‌ఈలో 85 శాతానికి పైగా, మ్యాట్/ఏటీఎంఏలో 750కి పైగా, సీమ్యాట్‌లో 95 శాతానికి పైగా స్కోర్ సాధించిన వారికి రూ.1,00,000 ఇస్తారు. వీటికంటే తక్కువ స్కోర్‌లు సాధించినవారికి అంచెలవారీగా స్కాలర్‌షిప్ మొత్తం తగ్గుతూ ఉంటుంది. మరిన్ని స్కాలర్‌షిప్‌లు, అవార్డుల వివరాలకోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- అభ్యర్థులు దరఖాస్తు ఫారంలోనే తమకు అనువైన స్కాలర్‌షిప్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 27
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు జీడీ, ఇంటర్వ్యూ సెంటర్:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.iba.ac.in

ఎన్‌ఐపీహెచ్‌టీఆర్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్‌ఐపీహెచ్‌టీఆర్-ముంబై)- రెగ్యులర్ కోర్సులతోపాటు స్కిల్ బేస్డ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీ డిప్లొమా, డిప్లొమా, స్కిల్ ట్రెయినింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ప్రోగ్రామ్‌ను అనుసరించి ఎంట్రెన్స్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.



పీజీ డిప్లొమా ఇన్ కమ్యూనిటీ హెల్త్ కేర్

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్, అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు; బీఎస్సీ(కమ్యూనిటీ హెల్త్) నర్సింగ్ జీఎన్‌ఎం ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు. ఆయుష్ విభాగాల్లో పనిచేస్తున్నవారికి, స్టాఫ్ నర్సులకు, ఎల్‌హెచ్‌వీలకు, పీహెచ్‌ఎన్‌లకు ప్రాధాన్యం ఉంటుంది.

డిప్లొమా ఇన్ హెల్త్ ప్రమోషన్ ఎడ్యుకేషన్

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో కూడా 30 సీట్లు ఉన్నాయి.
- ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయుష్/అలైడ్ హెల్త్ సైన్సెస్/ఎడ్యుకేషన్/వెల్ఫేర్/నర్సింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు 40 ఏళ్లు మించకూడదు.

పీజీ డిప్లొమా ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. 30 సీట్లు ఉన్నాయి.
- ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; మెడికల్ గ్రాడ్యుయేట్లు; నర్సింగ్ గ్రాడ్యుయేట్లు; జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్‌ఎం) ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉన్నవారు; పారామెడికల్ గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

స్కిల్ బేస్డ్ కోర్సులు

శానిటరీ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. హోం హెల్త్ ఎయిడ్ కోర్సు వ్యవధి నాలుగు నెలలు. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులకు సైన్స్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఫస్ట్ రెస్పాండర్ కోర్సు వ్యవధి నాలుగు రోజులు. ఇందులో 20 సీట్లు ఉన్నాయి. ఎనిమిదోతరగతి ఆపై చదివినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

- రిజిస్టర్డ్ పోస్ట్/స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ: మార్చి 31
- వెబ్‌సైట్: www.fwtrc.gov.in; www.niphtr.mohfw. gov.in

సాంప్రదాయేతర శక్తి వనరులు

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సాంప్రదాయేతర శక్తి వనరులు ఎల్లప్పుడూ లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పునరుద్ధరణ(*Renewable*) శక్తి వనరులు అంటారు. వీటిని ప్రత్యామ్నాయ శక్తి వనరులు అని కూడా అంటారు. ప్రత్యామ్నాయ శక్తి వనరులకు ఉదాహరణలు..

- జల విద్యుత్ శక్తి(Hydro Electricity)
- సౌర శక్తి(Solar Energy)
- పవన శక్తి(Wind Energy)
- అలల శక్తి(Wave Energy)
- వేలాతరంగా శక్తి(Tidal Energy)
- భూతాప శక్తి(Geothermal Energy)
- బయోమాస్(Biomas)



- OTEC(Ocean Thermal Energy Convertion)

1981లో ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం DNES (Departmen of Conventional Energy Sources) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

జల విద్యుత్: 2019 నాటికి మన దేశంలో మొత్తం జల విద్యుత్ ఉత్పత్తి- 45,293 మెగావాట్లు. జలవిద్యుత్ ఉత్పత్తిలో పంజాబ్, కర్ణాటక అగ్ర స్థానాల్లో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తికి 1975లో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాసాగర్ దేశంలో అత్యధిక ఎత్తుగల జలవిద్యుత్ కేంద్రం - నాత్పా జాక్రీ(హిమాచల్ ప్రదేశ్). కేరళ 100 శాతం జల విద్యుత్ పైనే ఆధారపడ్డది. జల విద్యుత్‌ను తెల్ల బొగ్గు అని కూడా అంటారు. ప్రపంచ జల విద్యుత్ ఉత్పత్తిలో మనదేశం ఆరో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు. దేశంలో మొదటిసారిగా జల విద్యుత్‌ను జనరేటర్ల సహాయంతో 1889లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో గల 'లోనాపల' వద్ద ఉత్పత్తి చేశారు. మొట్టమొదట జల విద్యుత్ కేంద్రాన్ని 1902లో కర్ణాటకలోని మైసూర్ వద్ద ఉన్న శివన్నసముద్రం వద్ద కావేరీ నదిపై నిర్మించారు. ఈ జల విద్యుత్ కేంద్రం కర్ణాటకలోని కోలార్ బంగారు గనికి విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలో అత్యంత

ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం త్రీ గార్జెస్. దీని ఉత్పత్తి సామర్థ్యం 22,500 మెగావాట్లు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రెజిల్‌లోని ఇటైపు వద్ద నిర్మించారు. దీని సామర్థ్యం 14,000 మెగా వాట్లు.

సౌర శక్తి: 2019 నాటికి మొత్తం సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 28,180.71 మెగా వాట్లు. సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం అధికంగా గల రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ. కొచ్చి(కేరళ) విమానాశ్రయం సౌర విద్యుత్‌తో నడుస్తోంది. 2020 జూన్‌లో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్‌ను మధ్యప్రదేశ్‌లోని 'రివా'లో ప్రారంభించారు. దీనిని 500 హెక్టార్ల విస్తీర్ణంలో 700 మెగా వాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. సౌర శక్తి ఉత్పత్తిలో అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వరుస స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఎనిమిదో స్థానంలో ఉంది. మొట్టమొదట సౌరశక్తి కేంద్రం జమ్మూ కశ్మీర్‌లోని చొగ్లాంసర్ వద్ద నిర్మించారు. ఆసియాలో నే అతిపెద్ద సౌర తటాకం(Solar Pond) గుజరాత్‌లోని భుజ్ వద్ద ఉంది.

ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది.

పవన శక్తి: దేశ పవన శక్తి ఉత్పత్తి సామర్థ్యం 35,625 మెగావాట్లు. ప్రపంచంలో పవన శక్తి ఉత్పత్తిలో చైనా మొదటి, భారత్ నాలుగో స్థానాల్లో ఉన్నాయి. దేశంలో పవన శక్తి ఉత్పత్తిలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో పవన విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటున్న ప్రాంతం జోగిమట్టి(కర్ణాటక). దేశంలో మొట్టమొదటి పవన శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని మాండవి వద్ద 1986లో నిర్మించారు. దేశంలో అతి పెద్ద శక్తి కేంద్రం తమిళనాడులోని ముప్పాండల్ వద్ద ఉంది.

అలల శక్తి: మొట్ట మొదటి అలల శక్తి కేంద్రాన్ని కేరళలోని తిరువనంతపురం వద్ద గల విజింజీం వద్ద నిర్మించారు.

వేలాతరంగ శక్తి: ఆసియాలోనే మొట్టమొదటి వేలాతరంగ విద్యుత్ కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా వద్ద నిర్మించారు. వేలాతరంగ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు- గల్ఫ్ ఆఫ్ కచ్(1200 మెగావాట్లు), గల్ఫ్ ఆఫ్ కంభట్(7000 మెగావాట్లు), సుందర్ బన్స్.

భూతాప శక్తి: భారతదేశంలో ఏకైక భూతాపశక్తి కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని 'మణికరణ్' వద్ద ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్‌లో గల పూగా లోయ కూడా భూతాపశక్తి ఉత్పత్తికి అనుకూలమైంది. భారత్‌లో 45,000 మెగా వాట్లు జియోథర్మల్ ఉత్పత్తికి అవకాశం ఉంది.

బయోమాస్: దీనిని వ్యర్థ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. మొట్ట మొదటి బయోమాస్ విద్యుత్ కేంద్రం పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిర్మించారు. బయోమాస్‌లో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటాయి.

OTEC(Ocean Thermal Energy Convertion): దీనిని సముద్రపు నీటి ఉష్ణోగ్రతల వ్యత్యాసం ఆధారంగా ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే మొట్టమొదటి OTEC కేంద్రం తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద అమెరికా సహాయంతో నిర్మించారు. ప్రస్తుతం భారతదేశంలో ఐదు ప్రాంతీయ గ్రిడ్స్ ఉన్నాయి.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ.


చింటూ




మీకు తెలుసా?

- తెల్లగా, కంటి దగ్గర నీలం రంగులో ఉండే ఈ పక్షి ఇండోనేషియాలోని బాలి ప్రాంతంలో ఉంటుంది. దీన్ని బాలి స్టార్లింగ్ అని పిలుస్తారు. దీన్నే జలక్ బాలి, బాలి మైనా పేర్లతో కూడా పిలుస్తారు.
- బ్రిటీష్ బర్డ్ ఎక్స్‌పర్ట్ స్టార్లింగ్ 1911 సంవత్సరంలో ఈ పక్షి గురించి చెప్పాడు కాబట్టి అతని పేరు వచ్చింది.
- మగ పక్షులు పెద్దగా ఉంటాయి. ఆడపక్షులు చిన్నగా ఉంటాయి. అలా గుర్తించాలంతే. 25 సెం.మీ. పొడవు ఉంటాయివి. రెక్కల పొడవు 52 సెం.మీ. వీటి బరువు 150 గ్రాములు.
- గింజలు, పండ్లు, పురుగులను తినే ఈ పక్షులు గుంపులుగా ఉంటాయి.
- వీటి సంఖ్య తక్కువ. అందుకే బాలి జాతీయపార్కులో పెంచుతున్నారు.
- ఈ అడవి పక్షులను ఎక్కువగా మనుషులే పట్టుకుంటున్నారు. దీని ఫొటోతో ఇండోనేషియాలో నాణేలు కూడా విడుదల అయ్యాయి.
- ఇవి అందంగా ఉంటాయి. వీటి తోక అంచులు, మెడ దగ్గర మాత్రమే నల్లగా ఉంటుంది. ఇవి వర్షాకాలంలో మాత్రమే గుడ్లు పెడతాయి. నీలం, ఆకుపచ్చ రంగులో రెండు లేదా మూడు గుడ్లు మాత్రమే పెడతాయి. పదిహేను రోజుల పాటు పొదుగుతాయి.
- కేవలం వందపక్షులు మాత్రమే 2012 లెక్కల ప్రకారం కనపడటంతో వీటిమీద ఇండోనేషియా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.
- వీటి జీవనకాలం కేవలం ఐదేళ్లు ఉంటుంది.
- చెట్ల తొర్రల్లో మాత్రమే నివసిస్తాయి. అది కూడా ఇతర పక్షులు వదిలేసిన పాతగూళ్లలో మాత్రమే నివాసం ఏర్పరచుకుంటాయి.
- ఇవి వేరే ప్రాంతాలకు వెళ్లటానికి ఇష్టపడవు. కేవలం బాలి ప్రాంతంలోనే ఈ పక్షులు కనపడతాయి.

సరైన నీడ ఏది?



6 తేడాలను గుర్తించండి



చుక్కలు కలిపి రంగులు వేయండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 220

1		4	3			5		
	2		7					
5								2
4			8			1		
	5		4		1		3	
		8			2			5
2								8
					8		6	
		1			6	9		4

సుడోకు - 219 సమాధానం

9	1	8	2	4	3	6	5	7
6	3	4	5	9	7	8	2	1
2	7	5	6	1	8	4	9	3
7	9	2	3	8	4	1	6	5
8	5	1	7	6	9	3	4	2
3	4	6	1	2	5	7	8	9
1	8	3	9	5	6	2	7	4
5	6	7	4	3	2	9	1	8
4	2	9	8	7	1	5	3	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.